శనివారం
17-5-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 235
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

త్వరలోనే పుతిన్‌తో ట్రంప్ ముఖాముఖి

అబుదాబీ: రష్యా-ఉక్రెయిన్ శాంతి చర్చలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హాజరుకాకపోవడంలో ఆశ్చర్యం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. తాను లేకుండా ఆయన అక్కడకు వెళ్లరని చెప్పుకున్నారు. తామిద్దరం కలుసుకునే సమయం ఆసన్నమైందన్నారు. త్వరలోనే ముఖాముఖి భేటీ అవుతామని ట్రంప్ చెప్పారు. తన కుమార్తె టిఫనీ బిడ్డకు జన్మనిచ్చినందుకే అమెరికాకు తిరిగి వెళ్లాల్సిన అవసరం వచ్చిందని తెలిపారు. 30 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ పాటించాలన్న అమెరికా ప్రతిపాదనకు ఉక్రెయిన్ అంగీకరించింది. రష్యా మాత్రం ఏ నిర్ణయం తీసుకోలేదు. టర్కీ వేదికగా శాంతి చర్చలు ప్రారంభించాయి.

> ఎన్నికల నిర్వహణ ఖర్చులో మార్పు రావాలి. ఎన్నికల సంస్కరణలు జరగకపోతే... దేశానికి ప్రజాస్వామిక భవిష్యత్ ఉండదు. ఎన్నికలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి యువత ముందుకు రావాలి. దేశాభివృద్ధిలో కీలకపాత్ర యువత చేతిలోనే ఉంది.
>
> - జాస్తి చలమేశ్వర్
> సుప్రీం కోర్టు
> మాజీ న్యాయమూర్తి

ప్రజాస్వామ్య రక్షణ బాధ్యత యువతదే

- ఎన్నికల సంస్కరణలతోనే దేశ భవిష్యత్
- ప్రమాదంలో పత్రికాస్వేచ్ఛ
- బిల్లులపై సుప్రీం తీర్పును స్వాగతించాల్సిందే
- ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో జస్టిస్ జాస్తి చలమేశ్వర్

విశాలాంధ్ర బ్యూరో-తిరుపతి: తీవ్ర సంక్షోభ పరిస్థితులు ఎదుర్కొంటున్న ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత నేటి యువతదేనని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్ పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల సందర్భంగా తిరుపతిలోని కనం రాజేంద్రన్ హాలు(కచ్చపి ఆడిటోరియం)లో ప్రతినిధుల సభను ఆయన శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. సభకు ఏఐవైఎఫ్ నేతలు సుఖ్‌జిందర్ మహేసరి, వలీ ఉల్లాఖాద్రి, అరుణ్, లెనిన్, ఆర్తి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ముందుగా ఇటీవల కాలంలో మృతి చెందిన ఏఐవైఎఫ్ నాయకులతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు సంతాపసూచకంగా మహాసభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. మహాసభల ఆహ్వానసంఘం అధ్యక్షుడు, సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అధ్యక్ష ఉపన్యాసం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ చలమేశ్వర్ ఎన్నికల సంస్కరణలు, రాజ్యాంగం, పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాస్వామ్యం తదితర అంశాలపై సుదీర్ఘ ప్రసంగం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ... నేటికీ దేశంలో పేదరికం, ఆకలి, వివక్ష కనిపిస్తున్నదని జస్టిస్ చలమేశ్వర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల్లో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న పాలకులకు దేశాభివృద్ధిలో ఇసుమంత పాత్ర కూడా ఉండటం లేదన్నారు. ఒక్కొక్క పార్లమెంట్ సభ్యుడు సగటున ఎన్నికల్లో రూ.50 నుండి రూ.100 కోట్లు ఖర్చు పెడుతున్నారని, గెలిచిన తర్వాత వారు ప్రజలకు ఏ మేరకు సేవ చేస్తారో ఆలోచించుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ ఖర్చులో కూడా మార్పు రావాలని ఆయన అన్నారు. ఎన్నికల సంస్కరణలు జరగకపోతే... దేశానికి ప్రజాస్వామిక భవిష్యత్ ఉండబోదని హెచ్చరించారు. ఎన్నికలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి యువత ముందుకు రావాలని జస్టిస్ చలమేశ్వర్ పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో కీలకపాత్ర యువత చేతిలోనే ఉందని, ఆ వైపుగా యువత ముందడుగు వేయాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో ఇప్పటికీ 132 సవరణలు చేశారని గుర్తు చేశారు. నిజంగా అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అంత గొప్పదని చెబుతున్న పాలకులే... అన్ని సవరణలు చేయవలసిన అగత్యం ఏమొచ్చిందని ఆయన ప్రశ్నించారు. పత్రికా స్వేచ్ఛకు సంబంధించి రాజ్యాంగంలో

- మిగతా 2 లో

యువతే రాజ్యాంగ రక్షకులు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ 8 లో

పార్లమెంటు ప్రత్యేక భేటీకి కేంద్రం విముఖత

న్యూఢిల్లీ: పహల్గాం దాడి అనంతరం నెలకొన్న భారత్-పాక్ ఉద్రిక్తతలు, ఆపరేషన్ సిందూర్‌పై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలన్న ప్రతిపక్షాలు డిమాండ్‌పై కేంద్రం నిరాసక్తత కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేందుకు కేంద్రం సుముఖంగా లేదని సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ కొన్ని ఆంగ్ల మీడియా కథనాలు ఈ మేరకు వెల్లడించాయి. ఈ ఏడాది జులైలో జరిగే వర్షాకాల

- మిగతా 2 లో

'వక్ఫ్'పై కొత్త పిటిషన్లు విచారించలేం

న్యూఢిల్లీ: వక్ఫ్ (సవరణ) చట్టం-2025 రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలయిన రెండు కొత్త పిటిషన్లు పరిశీలించడానికి సుప్రీం కోర్టు శుక్రవారం నిరాకరించింది. ప్రతి ఒక్కరూ వార్తాపత్రికలలో పేరు రావాలని కోరుకుంటున్నారని పేర్కొంది. విచారణకు రానున్న పెండింగ్ అంశాన్ని మే 20న నిర్ణయిస్తామని ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్, న్యాయమూర్తి జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ తర్వాత సుప్రీం కోర్టు ఈ కేసులో మధ్యంతర ఉపశమనం అంశంపై

- మిగతా 2 లో

మోదీ సర్కారుపై కోర్టుకెక్కిన సెలెబి

న్యూఢిల్లీ: జాతీయ భద్రతా కారణాలు చూపుతూ భారత ప్రభుత్వం 'సెలెబి 'అనుమతిని రద్దు చేయడంపై ఆ సంస్థ కోర్టుకెక్కింది. సెలెబి అనుమతిని రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న ఒక రోజు తర్వాత టర్కీకి చెందిన విమానయాన సంస్థ సెలెబి దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని కోర్టులో సవాలు చేసింది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌కు టర్కీ మద్దతు ఇచ్చిన నేపథ్యంలో కేంద్రం ఈ చర్య తీసుకుంది. సెలెబి ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ఇండియా శుక్రవారం దిల్లీ

- మిగతా 2 లో

డేటా హబ్‌గా హైదరాబాద్

- విద్యుత్ లైన్ల ఆధునికీకరణపై దృష్టి
- ఫ్యూచర్ సిటీలో పూర్తిగా భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటు
- సబ్‌స్టేషన్లు అప్‌గ్రేడ్ చేయాలి
- విద్యుత్ శాఖపై సమీక్షలో సీఎం రేవంత్ దిశానిర్దేశం

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ రాజధాని హైదరాబాద్ భవిష్యత్‌లో డేటా సెంటర్ల హబ్‌గా మారబోతోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఫ్యూచర్ సిటీలో పూర్తిగా భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రేటర్ పరిధిలో ప్రయోగాత్మకంగా స్మార్ట్‌లైన్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్లు అప్‌గ్రేడ్ చేయాలని, ఓఆర్ఆర్‌లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు రూపొందించాలని విద్యుత్ శాఖ అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఆయన శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహించారు. వచ్చే మూడేళ్లలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుందని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఫ్యూచర్‌సిటీలో పూర్తిగా భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని, అక్కడ విద్యుత్ టవర్లు, లైన్లు, స్తంభాలు కనిపించకూడదన్నారు. ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. గతేడాదితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందన్నారు. 2025-26లో విద్యుత్ డిమాండ్ 18,138 మెగావాట్లకు పెరుగుతుందని, 2034-35 నాటికి విద్యుత్ డిమాండ్ 31,808 మెగావాట్లకు చేరుతుందని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాల దృష్ట్యా చర్యలు ఉండాలని సీఎం ఆదేశించారు. రైల్వేలైన్లు, మెట్రో, ఇతర మాస్ ట్రాన్స్‌పోర్ట్‌ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఇతర కార్పొరేషన్ల విద్యుత్ అవసరాలతో పాటు కొత్తగా ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లు, పారిశ్రామిక వాడలకు కావాల్సిన విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రీజనల్ రింగ్ రోడ్డు పరిధిలో నిర్మించే రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్‌లకు కావాల్సిన విద్యుత్ అవసరాలపైన హెచ్‌ఎండీఏతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్లను అప్‌గ్రేడ్ చేసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ లైన్ల ఆధునీకికరణపైన దృష్టి సారించాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్‌ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని, సెక్రటేరియట్, నెక్లెస్ రోడ్, కేబీఆర్ పార్కు వంటి ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ తీసుకురావాలని చెప్పారు. 160 కిలోమీటర్ల అవుటర్ రింగ్ రోడ్‌లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం కావాల్సిన ప్రణాళికలను

- మిగతా 2 లో

రక్షణ బడ్జెట్‌కు మరో 50 వేల కోట్లు

మోదీ సర్కారు యోచన

న్యూఢిల్లీ: భారత్-పాక్ ఉద్రిక్తతల వేళ రక్షణరంగం విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఆ రంగానికి రూ.50 వేల కోట్ల మేర బడ్జెట్‌లో అదనపు కేటాయింపులు చేపట్టవచ్చని తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రభుత్వం ఈ దిశగా సన్నాహాలు చేస్తుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది రక్షణశాఖ కేటాయింపులు రూ.6.81 లక్షల కోట్లుగా ఉన్నాయి. తాజా పెంపునకు పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం లభించే అవకాశాలున్నాయి. దాంతో రక్షణ రంగానికి కేటాయించిన నిధులు రూ.7 లక్షల కోట్లు దాటుతాయని ఆ వర్గాలు తెలిపాయి. చైనా, పాకిస్థాన్ నుంచి భద్రతా సవాళ్లు ఎదురవుతున్న నేపథ్యంలో రక్షణరంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో కేటాయింపులను ప్రభుత్వం పెంచిన సంగతి తెలిసిందే. ఈ పద్దు కింద రూ.6,81,210 కోట్లను ప్రతిపాదించింది. 2024-25 బడ్జెట్

- మిగతా 2 లో

పిల్లలమర్రికి భామలు

- రాజరాజేశ్వరి ఆలయంలో సందడి
- వెదురు ఆకృతులు, హస్తకళలకు ఫిదా
- ఏఐజీ ఆసుపత్రిలో చిన్నారులకు పరామర్శ

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ, మహబూబ్‌నగర్ జిల్లాలోని పిల్లలమర్రి అందాలభామల రాకతో మెరిసింది. 700 ఏళ్ల చరిత్రగల పిల్లలమర్రి అందాలకు ముద్దుగుమ్మలు ఫిదా అయ్యారు. తమ ఫోన్లలో ఫోటోలు క్లిక్‌మనిపిస్తూ సందడి చేశారు. 22 మందితో కూడిన మిస్ వరల్డ్ పోటీదారుల బృందం పిల్లలమర్రిలోని విజయనగర కాలంనాటి రాజరాజేశ్వర ఆలయాన్ని సందర్శించింది. సమీపంలోని పురావస్తుశాఖ మ్యూజియాన్ని వీక్షించింది. 16, 17, 18వ శతాబ్దం కాలం నాటి వస్తువులను, విగ్రహాలను అందగత్తెలు పరిశీలించారు. 3-4 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పిల్లలమర్రి మర్రిచెట్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ మహావృక్షం ప్రాధాన్యత తెలియజేస్తూ భామల కోసం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేశారు. మర్రిచెట్టు సంరక్షణ తీరుపై అధికారులు వారికి వివరించారు. వెదురుతో తయారు చేసిన బుట్టలు, అలంకరణ ఆకృతులు, హస్తకళా నైపుణ్యం, మహిళా సంఘాల హస్తకళలు, నేతన్నల గొప్పతనాన్ని, మగ్గాలతో నేసిన చీరలను వివిధ రకాల వంటకాలను ప్రత్యేక స్టాళ్లను సుందరీమణులు ఆసక్తిగా వీక్షించారు. గద్వాల, నారాయణపేట చేనేత చీరల డిజైన్లు వారిని ఆకట్టుకున్నాయి. అందగత్తెల కోసం పిల్లలమర్రిని అధికారులు ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. వాల్ పెయింటింగ్, ల్యాండ్ స్కేపింగ్, పచ్చదనం, మహావృక్షం వద్ద ఆకర్షణీయమైన పూలమొక్కలు, ఫొటో షూట్‌కు అనుగుణంగా వ్యూ పాయింట్‌లు ఏర్పాటు చేశారు. సుందరీమణుల కోసం భారీ బందోబస్తు చేశారు. పిల్లలమర్రి అందాలను అందాలభామలు వారి ఫోన్లలో బంధిస్తూ సరదాగా గడిపారు. పిల్లలమర్రి మహావృక్షం కింద గురుకుల పాఠశాలల విద్యార్థులతో ముఖాముఖిలో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మీరు పడమంటే కింద పడతా లేకుంటే లేదు!

మోదీకి ప్రజలు, సైన్యం పాదాభివందనం

బీజేపీ మరో మంత్రి దురహంకారం

జగదీశ్ తొలగింపునకు కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జగదీశ్ దేవ్డా కొత్త వివాదానికి తెరతీశారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రశంసించిన ఆయన... యావత్‌దేశం, సైన్యం ప్రధాని మోదీకి శిరస్సు వంచి పాదాలకు నమస్కరించిందని అనుచిత వ్యాఖ్యలు చేశారు. కల్నల్ సోఫియా ఖురేషికి జరిగిన

- మిగతా 2 లో

ప్రపంచం దృష్టికి పాక్ 'ఉగ్ర' కుట్రలు

అఖిలపక్ష ఎంపీలతో విదేశాలకు ప్రతినిధి బృందాలు

కేంద్రం సంప్రదింపులు

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్... పాకిస్థాన్‌పై కఠినంగా వ్యవహరిస్తోంది. ఓవైపు దౌత్య చర్యలు తీసుకుంటూనే మరోవైపు ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేసేందుకు కృషి చేస్తోంది. అలాగే ఆపరేషన్ సిందూర్, ఉగ్రవాదులకు పాక్ ప్రత్యక్షంగా చేస్తున్న సాయం గురించి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం వివిధ దేశాల రాయబారులు, విదేశాంగ మంత్రులకు ప్రత్యేకంగా వివరణ ఇచ్చింది. తాజాగా ప్రపంచ దేశాలకు ఈ విషయాలను వివరించాలని ఏర్పాట్లు చేస్తోంది. అందుకోసం వివిధ రాజకీయ పార్టీల ఎంపీలతో బృందాలను ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రతి ప్రతినిధి బృందంలో 5-6 మంది ఎంపీలు, ఒక విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారి, ప్రభుత్వ ప్రతినిధి ఉంటారు. మొత్తం ఎనిమిది బృందాలు 10 రోజుల వ్యవధిలో ఐదు దేశాలకు వెళ్తాయి. ఈ బృందాలకు కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ నేతృత్వం వహించే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. వీరు మే 22న భారతదేశం నుంచి వివిధ దేశాలకు బయలుదేరి జూన్ మొదటివారంలో తిరిగి వచ్చే అవకాశం ఉంది. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ ఏవిధంగా మద్దతు పలుకుతోందనే విషయాన్ని... ఆపరేషన్

- మిగతా 2 లో

'భూ భారతి' ట్రిబ్యునళ్లు ఏర్పాటు చేస్తాం

- పట్టాదారు పాసుపుస్తకంలో భూకమతాల మ్యాపులు ముద్రిస్తాం
- అర్హులైన రైతులకు పట్టాలిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2 లో

భారత్ దెబ్బకు సెలెబీ షేర్ల పతనం

ఇస్తాంబుల్: భారత్ దెబ్బకు టర్కీకి చెందిన సెలెబీ కంపెనీ షేరు ధర ఏకంగా 10 శాతం పతనమైంది. గత నాలుగు సెషన్లలో ఈ షేరు విలువ 30శాతం ఆవిరైంది. సెలెబీ సబ్సిడరీ కంపెనీ ద్వారా భారతీయ విమానాశ్రయాలలో సరకుల రవాణాతోపాటు బహుళ సేవలను అందించింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు టర్కీ మద్దతుతో సెలెబీకి ఉన్న సెక్యూరిటీ క్లియరెన్స్‌లను భారత్ రద్దు చేసింది. అదానీ ఎయిర్ పోర్టు సంస్థ కూడా సెలెబీతో ఒప్పందాన్ని రద్దు చేసుకొంది. దీంతో ముంబై, అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టుల నుంచి ఆ కంపెనీ బయటకు వెళ్లినట్లైంది. ప్రస్తుతం అదానీ ఎయిర్ పోర్ట్స్ హోల్డింగ్ ముంబై, అహ్మదాబాద్, మంగళూరు, గువహాటి, జైపూర్, లక్నో, తిరువనంతపురం విమానాశ్రయాలను నిర్వహిస్తోంది. ప్రభుత్వ నిర్ణయం తర్వాత ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు లిమిటెడ్ కూడా ఒప్పందాన్ని రద్దు చేసుకొంది. ఆ స్థానంలో ఏఐఎస్ఏటీఎస్, బర్డ్‌గ్రూప్‌తో కలిసి పని చేయనున్నట్లు తెలిపింది. దీంతో తమది టర్కీ కంపెనీ కాదని సెలెబీ వివరణ ఇచ్చింది. ఆ దేశాధ్యక్షుడు ఎర్డోగాన్ కుటుంబంతో తమకు సంబంధం లేదని, ఆయన కుమార్తె తమకు బాస్ కాదని వెల్లడించింది. "ఎర్డోగాన్ కుమార్తె సుమెయ్యి మా కంపెనీని నియంత్రిస్తున్నారన్న ప్రచారంలో నిజం లేదు. మా మాతృసంస్థలో ఆ పేరుతో ఎవరికీ హక్కులు గానీ, వాటాలు గానీ లేవు. అసలు మాది టర్కీ సంస్థే కాదు. మా కంపెనీ యాజమాన్య హక్కులన్నీ సెలెబీయోగ్లు కుటుంబానికే పరిమితం. వారికి ఎలాంటి రాజకీయ సంబంధాలు లేవు' అని కంపెనీ ఒక ప్రకటన విడుదల చేసింది.

ప్రజాస్వామ్య రక్షణ బాధ్యత యువతదే

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేకంగా చట్టం లేనప్పటికీ 19-(1ఏ)లో భావ ప్రకటనా స్వేచ్ఛ ను పొందుపరిచారని, దానినే పత్రికా స్వేచ్ఛగా భావించాలని సూచించారు. కానీ మీడియాకు ఈ దేశంలో ఏ మేరకు స్వేచ్ఛ లభిస్తున్నదో గుర్తించాలన్నారు. సమాఖ్యస్ఫూర్తిని కాపాడేలా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కాదని... రాష్ట్రపతి న్యాయవ్యవస్థపై ప్రశ్నలు సంధించడంపై చర్చ జరుగుతోందన్నారు. వాస్తవానికి తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన 10 బిల్లులకు సమ్మతి తెలపకుండా ఆ రాష్ట్ర గవర్నర్ వ్యవహరించిన రాజ్యాంగ వ్యతిరేక వైఖరికి అడ్డుకట్ట వేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు స్వాగతించ దగిందన్నారు. భారత రాజ్యాంగాన్ని, సమాఖ్య స్వభావాన్ని, రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాపాడే విషయంలో సుప్రీం తీర్పు ఆదర్శవంతమైందేనన్నారు. ఇలాంటి తీర్పుల పట్ల సానుకూలంగా వ్యవహరించి రాజ్యాంగబద్ధంగా అమలు చేయడానికి బదులు... రాష్ట్రపతి ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి వివాదాలు సృష్టించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరమన్నారు. దేశంలో ప్రజాస్వామ్య మనే పదమే అదృశ్యమయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. ఈ పరిస్థితుల్లో సంపూర్ణ అవగాహనతో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యతను యువత తమ భుజస్కంధాలపైకి ఎత్తుకోవాల్సిన అవసరం ఉందని జస్టిస్ చలమేశ్వర్ పిలుపునిచ్చారు.

డేటా హబ్‌గా హైదరాబాద్

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధం చేయాలని, జీహెచ్ఎంసీ పరిధిలోని ఫుట్‌పాత్‌లు, నాలాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులకు రేవంత్‌రెడ్డి సూచించారు. ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, కొత్తగా అమల్లోకి తెచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీపైన దృష్టి సారించాలని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తిలో ప్రఖ్యాతిగాంచిన ప్రపంచ దిగ్గజ సంస్థలకు అవకాశం ఇవ్వాలన్నారు. గ్లోబల్ క్యాపబులిటీ సెంటర్ల హబ్‌గా హైదరాబాద్ దేశంలో అందరి దృష్టిని ఆకర్షిస్తోందన్నారు. ఫ్యూచర్ సిటీలో హై టెన్షన్ లైన్లు కూడా తరలించాలన్నారు.

పార్లమెంటు ప్రత్యేక భేటీకి కేంద్రం విముఖత

(మొదటిపేజీ తరువాయి)

సమావేశాల్లోనే ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రశ్నలకు కేంద్రం సమాధానం చెప్పనుంది. పహల్గాం దాడి అనంతరం జరిగిన పరిణామాలు, కలిసికట్టుగా తీసుకున్న నిర్ణయాలను చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఇటీవల ప్రధాని మోదీకి లేఖ రాశారు. 'ఐక్యత, సంఘీభావం అవసరమైన ఈ తరుణంలో... వీలైనంత త్వరగా ఉభయ సభల్లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేయడం ముఖ్యమని విపక్షం భావిస్తోంది' అని రాహుల్ పేర్కొన్నారు. వీరితో పాటు మరికొందరు విపక్ష ఎంపీలు సైతం ఇదే డిమాండ్ చేశారు. అయితే, విపక్షాల డిమాండ్‌ను బీజేపీ నేతలు తోసిపుచ్చారు. ప్రస్తుతం ఆపరేషన్ సిందూర్ తాత్కాలికంగానే నిలిచిందని, ఈ సమయంలో అనవసర చర్చలకు తావివ్వొద్దని ప్రతిపక్షాలను దుయ్యబట్టారు. ఆపరేషన్ సిందూర్ ముగిసిన తర్వాత ప్రత్యేక సమావేశం డిమాండ్‌ను లేవనెత్తాలని సూచించారు. కేంద్రం కూడా దీనిపై సుముఖంగా లేనట్లు తాజాగా వార్తలు వినిపిస్తున్నాయి. జులైలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి.

రక్షణ బడ్జెట్‌కు మరో 50 వేల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

కేటాయింపుల(రూ.6.22 లక్షల కోట్లు)తో పోలిస్తే ఇది 9.53 శాతం అధికం. సవరించిన అంచనాల(రూ.6.41 లక్షల కోట్ల)తో పోలిస్తే 6.2 శాతం ఎక్కువ. తాజా కేటాయింపుల్లో కొత్త ఆయుధ వ్యవస్థల కొనుగోలుకు పెద్దపీట వేశారు. స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో రక్షణ కేటాయింపులు 1.91 శాతంగా ఉన్నాయి. రూ.50 వేల కోట్ల అనుబంధ బడ్జెట్‌లో నిధులను పరిశోధన, ఆయుధాలు, అవసరమైన పరికరాల కొనుగోలుకు ఉపయోగించే అవకాశాలున్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరానికి ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రక్షణ రంగానికి కేటాయింపులు రూ.2.29 లక్షల కోట్లుగా ఉన్నాయి. మొత్తం వార్షిక పద్దులో 13 శాతం రక్షణకే కేటాయించారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంకు దగ్గర్లో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం బైసరన్ లోయలో ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చినవారు పర్యాటకులను అతి సమీపం నుంచి కాల్చి చంపారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దానికి ప్రతిగా పీఓకే, పాక్‌లోని ఉగ్రస్థావరాలను ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ ధ్వంసం చేసింది. అది జీర్ణించుకోలేని పాక్ తర్వాత రెచ్చగొట్టే చర్యలకు పాల్పడటంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. అయితే భారత్ ధాటిని తట్టుకోలేని పాక్ వెనక్కి తగ్గటంతో కాల్పులు విరమణ ఒప్పందం కుదిరింది.

100 మంది పలస్తీనియన్ల మృతి

రణరంగమైన పశ్చిమాసియా - గాజాపై కొనసాగిన ఇజ్రాయిల్ భీకర దాడులు

జెరూసలేం: పశ్చిమాసియా రణరంగమైంది. గాజాపై ఇజ్రాయిల్ గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు జరిపిన భీకర దాడుల్లో 100 మంది పలస్తీనియన్లు చనిపోయారు.దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్, దేర్ అల్-బలా నగర శివార్లపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేసింది. 48 మృతదేహాలను ఇండోనేషియా ఆసుపత్రికి తీసుకెళ్లగా... మరో 16 మృతదేహాలను నాసర్ ఆసుపత్రికి తరలించారని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. శిథిలాల కింద పదుల సంఖ్యలో ప్రజలు చిక్కుకుపోగా వారిలో ఎవరూ ప్రాణాలతో లేరని తెలుస్తోంది. తాజా పరిస్థితిపై హమాస్ తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తంచేసింది. ఇజ్రాయిల్ అమానవీయతను ఎండగట్టాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరింది. హమాస్ అంతమే లక్ష్యంగా దాడులను మరింతగా విస్తరించేందుకు కట్టుబడి ఉన్నట్లు ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. ఇజ్రాయిల్ దాడుల్లో ఇప్పటివరకు 53,010 మంది పలస్తీనియన్లు చనిపోగా, గాయపడిన వారి సంఖ్య 1,19,919కు పెరిగిందని గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. అయితే శిథిలాల కింద చిక్కుకున్న వారిలో ఎవరూ ప్రాణాలతో లేరన్న అంచనా మేరకు మృతుల సంఖ్యను 61,700గా సవరించి ప్రభుత్వ మీడియా కార్యాలయం ఒక ప్రకటన చేసింది.

పలస్తీనియన్లకు సాయం అవశ్యం: ట్రంప్

పశ్చిమాసియా పర్యటన వేళ పలస్తీనియన్ల దీనస్థితిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ వారికి సాయం అవసరమని అన్నారు. గాజా ప్రజలు పస్తులు ఉంటున్నారని, వారికి సహాయాన్ని అందించడం తక్షణావశ్యమన్నారు. గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణను సమర్థిస్తారా అన్న ప్రశ్నకు 'వచ్చే నెలలో చాలా మంది పనులు జరుగుతాయి' అని ట్రంప్ బదులిచ్చారు. 'మనం పలస్తీనియన్లకు సాయం అందించాలి. గాజా ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు కాబట్టి రెండు పక్షాలను దృష్టిలో పెట్టుకొని ముందుకెళ్లడం అవసరం' అని ట్రంప్ తెలిపారు. గాజాను స్వేచ్ఛా మండలంగా మార్చేందుకు కృషి చేస్తానని, గాజాకు సంబంధించి తనకు మంచి ఆలోచనలు ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు వెల్లడించారు.

ఎఫ్-55 యుద్ధ విమానాల తయారీపై దృష్టి: ట్రంప్

వాషింగ్టన్: యుద్ధ విమానాల చరిత్రలోనే అత్యంత శక్తిమంతమైన ఎఫ్-22 రాప్టర్‌ను అమెరికా తయారు చేసింది. ఇప్పుడు ఈ యుద్ధ విమానాన్ని అప్‌గ్రేడ్ చేసే యోచనలో అగ్రరాజ్యం ఉంది. ఈ విషయాన్ని దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. బోయింగ్, జీఈ ఏరోస్పేస్ సీఈవోలు సహా కొందరు వ్యాపారవేత్తలతో దోహాలో మాట్లాడినప్పుడు లాక్‌హీడ్ మార్టిన్ తయారు చేసిన ఎఫ్-35 ప్రత్యామ్నాయంగా ఎఫ్-55ను అభివృద్ధి చేసే అంశాన్ని ప్రస్తావించారు. ఎఫ్-22 రాప్టర్‌కు అప్‌గ్రేడ్‌గా ఎఫ్-22 సూపర్‌ఫైటర్‌ను తయారు చేయనున్నట్లు తెలిపారు. 'ఎఫ్-55ను తయారు చేయనున్నాం. ఇది రెండు ఇంజిన్లతో మంచి ధరకు లభిస్తుంది. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన ఫైటర్ జెట్ ఎఫ్-22 దానికి సూపర్ వెర్షన్ తీసుకురానున్నాం. ఇది అత్యాధునికంగా ఉండనుంది' అని ట్రంప్ అన్నారు. ఎఫ్-47 యుద్ధ విమానం అభివృద్ధి ఒప్పందాన్ని బోయింగ్‌కు ఇవ్వడం విదితమే. అమెరికాలోనే అత్యాధునిక ఆరోతరం ఫైటర్‌గా ఈ యుద్ధ విమానాన్ని రూపొందించాలని ట్రంప్ అన్నారు. ఫిబ్రవరిలో ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ట్రంప్ సర్కారు ఎఫ్-35 యుద్ధ విమానాలను భారత్‌కు విక్రయించేందుకు ఆసక్తి చూపింది. ప్రపంచవ్యాప్తంగా వాడకంలో ఉన్న ఐదవతరం అత్యాధునిక యుద్ధ విమానం ఎఫ్-35. రాడార్లు, ప్రత్యర్థి ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కళ్లుగప్పి శత్రు స్థావరాలను ధ్వంసం చేయడం దీని ప్రత్యేకత. ఇందులో అత్యాధునిక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, నిఘా, పర్యవేక్షణ సామర్థ్యాలున్నాయి. దీనిలో మూడు వేరియంట్స్ అందుబాటులోకి వచ్చాయి. ఈ విమానం అభివృద్ధికి 2 ట్రిలియన్ డాలర్లకు పైగా వెచ్చించారు.

పిల్లలమర్రికి భామలు

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొన్నారు. కాగా, మిస్ వరల్డ్ కంటెస్టెంట్ల కోసం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల వరకు మెట్టుగడ్డ నుంచి పిల్లలమర్రి వరకు ఆంక్షలు విధించారు. 13 వందల మంది పోలీసులతో మూడంచల భద్రత ఏర్పాటు చేశారు. అందాల భామలకు స్వాగతం పలికేందుకు జిల్లా అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు.

ఏఐజీ ఆసుపత్రి రోగులకు ఆప్యాయ పలకరింపు

తెలంగాణలోని వివిధ ప్రముఖ, పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తున్నారు. ఈ క్రమంలో భాగంగా గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి వెళ్లారు. మెడికల్ టూరిజంలో భాగంగా గ్రూప్ బి1 మిస్ వరల్డ్ కాంటెస్టెంట్లు ఈ ఆసుపత్రిని సందర్శించారు. అక్కడి రోగులను ఆప్యాయంగా పలకరించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. చికిత్స పొందుతున్న చిన్నారులతో గడిపారు. ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ డా. నాగేశ్వర రెడ్డి వారికి చికిత్స విధానాలను, పరిశోధనల తీరును వివరించారు. ఆరోగ్య రంగంలో సాధించిన పురోగతిని, బ్రెస్ట్ వెల్‌నెస్, 'గట్' (జీర్ణ వ్యవస్థ), వంటి అంశాలను ప్రచారం చేయాలని అందగత్తెలకు సూచించారు. వైద్య రంగంలో వస్తున్న అధునాతన మార్పులు, మహిళల్లో వస్తున్న వ్యాధుల గురించి వివరించారు. సుందరీమణులు ఆస్పత్రిలో అన్ని విభాగాలను సందర్శించారు. విదేశీ రోగులకు సదుపాయాలు తదితర వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. ప్రతి ఒక్కరూ ఆహారం, ఆరోగ్యంపై దృష్టిపెడితే సమాజం ఎంతో ఉన్నతంగా ఉంటుందన్నారు. మిస్ వరల్డ్ పోటీదారులు కూడా తమ అభిప్రాయాలను నాగేశ్వరరెడ్డితో పంచుకున్నారు. ఐసీయూలోని చిన్నారులను పరామర్శించారు. అనంతరం ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో తమ అనుభవాలను పంచుకున్నారు.

ఎకో పార్కుకు...

రంగారెడ్డి జిల్లా, శంకర్‌పల్లి మండలం, ప్రొద్దుటూరు... ఎక్స్‌పీరియం ఎకో ఫ్రెండ్లీ పార్కులో అందగత్తెలు సందడి చేశారు. పార్కులోని వివిధ జాతుల మొక్కలు, వృక్షాల విశిష్టతలను నిర్వాహకులు వారికి వివరించారు. కాగా, మిస్‌వరల్డ్ పోటీదారులు ఆదివారం సచివాలయానికి వెళ్లనున్నారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 7.30 వరకు అక్కడే ఉంటారు. సచివాలయంపై ప్రదర్శించే 3డీ ప్రొజెక్షన్ మ్యాపింగ్‌లో తెలంగాణ చరిత్ర, అభివృద్ధిని వీక్షిస్తారు.

మోదీకి ప్రజలు, సైన్యం పాదాభివందనం

(మొదటిపేజీ తరువాయి)

అవమానం మరువక ముందే బీజేపీకి చెందిన మరొక మంత్రి దురహంకారం ప్రదర్శించడం పెద్దఎత్తున చర్చకు దారితీసింది. జబల్‌పూర్‌లో జరిగిన సివిల్ డిఫెన్స్ వలంటీర్ల కార్యక్రమంలో జగదీశ్ దేవ్డా మాట్లాడుతూ 'మనం ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలపాలి. యావత్ దేశం, సైన్యం ఆయనకు 'నట్ మస్తక్' (పాదాభివందనం) చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు ఇచ్చిన సమాధానాన్ని పొగిడేందుకు మాటలు చాలడం లేదు. మోదీని చప్పట్లతో అభినందిద్దాం' అని దేవ్డా వ్యాఖ్యానించారు.

సైన్యానికి అవమానం: కాంగ్రెస్

సైన్యాన్ని కించపరిచారంటూ జగదీశ్ దేవ్డా వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా మండిపడ్డారు. 'బీజేపీ నేతలు తరచూ సైన్యాన్ని అవమానిస్తుండటం సిగ్గుచేటు, దురదృష్టకరం. మొన్న సోఫియా ఖురేషిపై మధ్యప్రదేశ్ మంత్రి అనుచిత వ్యాఖ్యలు చేశారు. నేడు అదే రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మొత్తం సైన్యాన్ని అవమానించారు. సైనిక శౌర్యానికి యావత్ దేశం గర్విస్తుంటే... బీజేపీ నేతలు మాత్రం అవమానిస్తున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోకుండా కాపాడుకునే ప్రయత్నాల్లో బీజేపీ ఉంది. ఈ ప్రవర్తనతో ప్రజలకు, సైన్యానికి బీజేపీ ఏం సందేశమిస్తోంది?' అంటూ ప్రియాంక ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనటే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేవ్డా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. దేవ్డా వీడియోను ప్రదర్శించారు. ఇటువంటి దూషణలు, సిగ్గులేని మాటలు ఏ భారతీయుడైనా మాట్లాడతారని మీరు ఊహించగలరా అని ప్రశ్నించారు. 'శత్రువులకు గుణపాఠం నేర్పిన సాయుధ దళాలకు దేశం మొత్తం కృతజ్ఞతలు తెలుపుతోంది. 1965, 1971, 1999, పహల్గాం ఉగ్రదాడి తర్వాత కూడా సైన్యం తగిన సమాధానం ఇచ్చింది. సైన్యం శౌర్యాన్ని, త్యాగాలను ప్రజలు ఎప్పటికీ గౌరవిస్తారు. సరిహద్దులను కాపాడటమే కాకుండా దేశ ప్రాదేశిక సమగ్రతను సాయుధ దళాలు రక్షిస్తున్నాయి. సియాచిన్ హిమానీ నదాల నుండి రాజస్థాన్ ఎడారుల వరకు ప్రజలు సురక్షితంగా జీవించేలా నిరంతరం రక్షణ కల్పిస్తున్నారు. అలాంటి వారిని ఉద్దేశించి ఇటువంటి ప్రకటన ఘోరమైన అవమానం' అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా దేవ్డాను తక్షణమే తొలగించాలని ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో ప్రధాని అనుమతితోనే దేవ్డా ఈ వ్యాఖ్యలు చేసినట్లు విశ్వసించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ప్రపంచం దృష్టికి పాక్ 'ఉగ్ర' కుట్రలు

(మొదటిపేజీ తరువాయి)

సిందూర్ ద్వారా ఉగ్రవాదంపై భారత్ జరిపిన పోరాటాన్ని తగిన ఆధారాలతో విదేశాలకు వివరించనున్నట్లు తెలిసింది. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రతిపక్ష పార్టీలతో చర్చలు జరుపుతోందని, త్వరలో ఈ బృందాలను ఏర్పాటుచేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. సరిహద్దు ఉగ్రవాదం అంశంపై దేశ ఐక్యతను ప్రదర్శించడానికి చేసే ఒక సమష్టి ప్రయత్నంగా దీనిని అభివర్ణించాయి. గతంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు.. అటల్ బిహారీ వాజ్‌పేయిని ఎన్‌హెచ్ఆర్‌సీకి పంపడం వంటి విషయాలను ఆదర్శంగా తీసుకొని ఈ చర్యలకు సమాయత్తమవుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఈ బృందాలు విదేశీ ప్రభుత్వాలు, రక్షణ అధికారులు, మీడియా సంస్థలతో చర్చలు జరపనున్నట్లు తెలిపారు. ఇక ప్రతినిధి బృందాల్లో బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, టీఎంసీ, డీఎంకే, ఎన్‌సీపీ (ఎస్పీ), జేడీయూ, బీజేడీ తదితర పార్టీలకు చెందిన 30పైగా ఎంపీలు ఉండనున్నారు. ఎంపీలు శశిథరూర్, మనీశ్ తివారీ, సల్మాన్ ఖుర్షీద్, అమర్‌సింగ్ (కాంగ్రెస్), సుదీప్ బందోపాధ్యాయ్ (టీఎంసీ), సంజయ్ ఝా (జేడీయూ), సస్మిత్ పాత్రా (బీజేడీ), సుప్రియా సూలే(ఎన్‌సీపీ-ఎస్పీ), కె.కనిమొళి (డీఎంకే), జాన్ బ్రిట్టాస్ (సీపీఎం), అసదుద్దీన్ ఒవైసీ (ఏఐఎంఐఎం) ఈ బృందాల్లో భాగం కానున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై కేంద్రం అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయనప్పటికీ... ఈ విషయమై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడినట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ వెల్లడించారు.

- 1994లో భారత్- పాకిస్థాన్ తీవ్ర ఉద్రిక్తతలను ఎదుర్కొన్న సమయంలో జమ్మూకశ్మీర్‌లో జరిగిన మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించి పాకిస్థాన్... ఐరాస మానవ హక్కుల కమిషన్ లో ఒక తీర్మానం సమర్పించడానికి సిద్ధమవగా... అప్పటి భారత ప్రధాని పీవీ నరసింహారావు పాక్‌పై దౌత్య వ్యూహాన్ని అమలుచేశారు.

ఇరుదేశాల మధ్య పరిస్థితులను అక్కడి అధికారులకు వివరించడానికి ఐరాస వద్దకు భారత్ నుంచి బహుళ పార్టీల ప్రతినిధుల బృందాన్ని పంపారు. దీనికి దివంగత బీజేపీ నేత అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వం వహించగా... అప్పటి విదేశాంగ సహాయ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, ఫరూక్ అబ్దుల్లా ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఆ సమయంలో అమెరికాలో భారత రాయబారిగా ఉన్న హమీద్ అన్సారీ కూడా కీలక పాత్ర పోషించారు. వీరంతా ఐరాసలో పాకిస్థాన్ చేసిన ఆరోపణల్ని సమర్థంగా తిప్పికొట్టారు. దీంతో పాక్ తన తీర్మానాన్ని వెనక్కు తీసుకుంది.

'భూ భారతి' ట్రిబ్యునళ్లు ఏర్పాటు చేస్తాం

విశాలాంధ్ర-హైదరాబాద్: భూ భారతి చట్టం అమలులో భాగంగా ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల్లో శుక్రవారం జరిగిన భూభారతి అవగాహన సదస్సుల్లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి ఆయన పాల్గొన్నారు. భూభారతి నాలుగు పైలట్ మండలాల్లో 13 వేల దరఖాస్తులు వచ్చాయని, వాటిని ఈనెల 30లోగా పరిష్కరిస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తహసీల్దార్, ఆర్డీఓ, అదనపు కలెక్టర్, కలెక్టర్, సీసీఎల్ఏ, ఆపై ట్రిబ్యునల్ స్థాయిలో అప్పీల్ వ్యవస్థను భూభారతి చట్ట ప్రకారం రూపొందించామన్నారు. రెవెన్యూశాఖ సేవలు సులభంగా, పారదర్శకంగా ప్రజలకు అందించేలా కార్యాచరణ అమలవుతున్నట్లు తెలిపారు. భూభారతి కార్యక్రమం ద్వారా భూ సంబంధిత సమస్యల పరిష్కారం వేగవంతం కావడమే కాకుండా, రైతులకు నమ్మకమైన భూ సమాచారం అందుతోందని చెప్పారు. వాస్తవిక డేటాతో భూ పత్రాలు సమర్పించడం వల్ల భవిష్యత్తులో హక్కులపై ఆందోళన ఉండదన్నారు. భూ సమస్యలను ఉద్దేశపూర్వకంగా పరిష్కరించని అధికారులను ఉపేక్షించ బోమని మంత్రి పొంగులేటి హెచ్చరించారు. భూ యజమానుల భూ కమతాలకు మ్యాపులను పట్టాదారు పాసుపుస్తకంలో ముద్రిస్తామన్నారు. ఆరువేల మంది లైసెన్సు కలిగి ఉన్న సర్వేయర్లను నియమిస్తున్నామని చెప్పారు. దీంతో భూముల హద్దుల గుర్తింపు ప్రక్రియ సులభతరం అవుతుందని అన్నారు. త్వరలో గ్రామ రెవెన్యూ అధికారులనూ నియమిస్తామని చెప్పారు. పట్టాలేని భూములు సాగు చేసుకుంటున్న అర్హులైన పోడు భూముల రైతులకు పట్టాలు ఇస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ధరణి పోర్టల్ వల్ల రైతులు నిద్రలేని రాత్రులు గడిపారని, గత ప్రభుత్వ తొందరపాటు చర్యతో రైతులు శిక్షను అనుభవించారన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు వస్తాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. మొదటి విడతగా ప్రతీ నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు కేటాయించా మని, మరో నాలుగు విడతల్లో ఇళ్లు అందజేస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

19 నుంచి ఏపీ ఈఏపీసెట్

విశాలాంధ్ర-కాకినాడ : ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మా కోర్సుల్లో ప్రవేశానికి ఏపీ ఏపీసెట్-2025 ను జేఎన్టీయూ కాకినాడ అధ్వర్యంలో జరగనున్నాయి. శుక్రవారం కాకినాడ జేఎన్‌టీయూలోని వైస్ చాన్సలర్ ఛాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏపీఈఏపీసెట్-2025 కన్వీనర్ వి.వి.సుబ్బారావు ప్రవేశ పరీక్షల వివరాలను వెల్లడించారు. ఈ నెల 19, 20 తేదీల్లో వ్యవసాయ, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాలకు, 21 నుంచి 27 వరకు ఇంజినీరింగ్ ప్రవేశాలకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా 145 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో రెండు సెంటర్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలకు మొత్తం 3 లక్షల 62 వేల 418 మందికి పైగా నమోదు చేసుకున్నారని తెలిపారు. వారిలో ఇంజినీరింగ్‌కు 2 లక్షల 80 వేల 578 మంది, వ్యవసాయ, ఫార్మసీ రంగాలకు 81 వేల 814 మందితో పాటు రెండు పరీక్షలు హాజరయ్యేవారు 912 మంది నమోదు చేసుకున్నట్లు ఆయన వివరించారు. హాల్ టికెట్లను ఈ నెల 12 నుంచి డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించామని, అలగే హాల్ టికెట్ల వెనుక చిరునామాతో కూడిన క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు.

బహిరంగంగా ఖండిస్తున్నా

జస్టిస్ బేలా త్రివేదికి వీడ్కోలు చెప్పకపోవడంపై సీజేఐ

న్యూఢిల్లీ: జస్టిస్ బేలా ఎం త్రివేదికి వీడ్కోలు చెప్పరాదన్న బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) వైఖరిని భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ శుక్రవారం విమర్శించారు. సుప్రీం కోర్టు 75 ఏళ్ల చరిత్రలో పదవీ విరమణ చేసిన 11వ మహిళా న్యాయమూర్తి జస్టిస్ త్రివేదిని సత్కరించడానికి ఏర్పాటు చేసిన సభకు అధ్యక్షత వహించిన ప్రధాన న్యాయమూర్తి గవాయ్... ఎస్‌సీబీఏ వైఖరిని బహిరంగంగా ఖండించారు. 'నేను స్పష్టంగా, సూటిగా ఉండటాన్ని నమ్ముతాను. అసోసియేషన్ తీసుకున్న వైఖరిని నేను బహిరంగంగా ఖండించాలి' అని ఆయన అన్నారు. అయితే, ప్రధాన న్యాయమూర్తి గవాయ్, ఎస్‌సీబీఏ అధ్యక్షుడు కపిల్ సిబల్, ఉపాధ్యక్షుడు రచన శ్రీవాస్తవ ఉత్సవ ధర్మాసన కార్యకలాపాలలో ఉండటం పట్ల ప్రశంసలు కురిపించారు. 'కపిల్ సిబల్, రచన శ్రీవాస్తవకు నేను కృతజ్ఞుడను. వారిద్దరూ ఇక్కడ ఉన్నారు. వారి సంఘాల తీర్మానం ఉన్నప్పటికీ వారు ఇక్కడ ఉన్నారు. కానీ అసోసియేషన్ కోల్పోయింది. ఇక్కడ ఫుల్‌హౌస్ ఉండటం. ఆమె చాలా చాలా మంచి న్యాయమూర్తి అని రుజువు చేస్తుంది. వివిధ రకాల న్యాయమూర్తులు ఉన్నారు. కానీ అది మంజూరు చేయవలసిన దానిని తిరస్కరించడానికి ఒక అంశం కాకూడదు' అని తెలిపారు. జస్టిస్ త్రివేది ఎల్లప్పుడూ న్యాయంగా ఉంటారని, ఆమె 'కఠిన శ్రమ, సమగ్రతకు' ప్రసిద్ధి చెందారని సీజేఐ బీఆర్ గవాయ్ అన్నారు. 'జస్టిస్ త్రివేది, మీరు మన న్యాయవ్యవస్థకు విలువైన ఆస్తి. మీరు కొత్త ప్రయాణాన్ని ప్రారంభించినప్పుడు మీకు శుభాకాంక్షలు' అని ఆయన అన్నారు. జూన్ 9, 2025న పదవీ విరమణ చేసే జస్టిస్ త్రివేది... వ్యక్తిగత నిబద్ధత కారణంగా శుక్రవారం తన చివరి రోజు జరుపుకున్నారు. ఆగస్టు 31, 2021న ఆమె సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

మోదీ సర్కారుపై కోర్టుకెక్కిన సెలెబి

(మొదటిపేజీ తరువాయి)

హైకోర్టును ఆశ్రయించి... కేంద్రం నిర్ణయాన్ని సవాలు చేస్తూ, 'అస్పష్టమైన' జాతీయ భద్రతా సమస్యలను హేతుబద్ధంగా ఉదహరించారని తెలిపింది. ఈ నిర్ణయాన్ని పక్కన పెట్టాలని కోరుతూ... ఇది 3,791 ఉద్యోగులు, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని ప్రభావితం చేస్తుందని కంపెనీ వాదించింది. ఎటువంటి హెచ్చరిక లేకుండా ఈ ఆర్డర్ జారీ చేయబడిందని పేర్కొంది.

చంద్రబాబు కక్ష సాధింపు: బొత్స

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, మాజీ ప్రభుత్వాధికారి కృష్ణమోహన్‌రెడ్డి అరెస్టులను శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఖండించారు. చంద్రబాబు చేస్తున్న కక్షపూరిత రాజకీయాల వల్ల వ్యవస్థలు దెబ్బతింటున్నాయని, తప్పుడు కేసులు బనాయించి... తప్పుడు సాక్ష్యాలు, వాంగ్మూలాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రభుత్వాధికారులను, మాజీ ప్రభుత్వాధికారులపైనా రాజకీయ విరోధం చూపిస్తున్నారని, చంద్రబాబు తీసుకొచ్చిన తప్పుడు సంప్రదాయాలు రాష్ట్రానికి చేటు చేస్తాయని తెలిపారు. మద్యం వ్యవహారంలో ఇప్పటివరకూ ఎలాంటి ఆధారాలు చూపడం లేదని, బెదిరించి, భయపెట్టి తప్పుడు వాంగ్మూలాలు తీసుకుని, అరెస్టులు చేస్తున్నారన్నారు.

'వక్ఫ్'పై కొత్త పిటిషన్లు విచారించలేం

(మొదటిపేజీ తరువాయి)

విచారణ చేస్తుంది. శుక్రవారం ఒక పిటిషన్ విచారణకు వచ్చిన వెంటనే కేంద్రం తరపున హాజరయిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యంతరం వ్యక్తం చేస్తూ చట్టాన్ని సవాలు చేస్తూ 'అంతులేని' పిటిషన్లు దాఖలు చేయడం సాధ్యం కాదని అన్నారు. పిటిషనర్ తరపున హాజరయిన న్యాయవాది తాను ఏప్రిల్ 8న పిటిషన్ దాఖలు చేశానని, ఏప్రిల్ 15న సుప్రీం కోర్టు రిజిస్ట్రీ ఎత్తి చూపిన లోపాలు తొలగించానని, అయితే తన పిటిషన్‌ను విచారణకు జాబితా చేయలేదని అన్నారు.

'ప్రతి ఒక్కరూ తన పేరు వార్తాపత్రికలలో ఉండాలని కోరుకుంటారు' అని సీజేఐ అన్నారు. న్యాయవాది తన పిటిషన్‌ను పెండింగ్‌లో ఉన్న పిటిషన్లతో జతచేయాలని ధర్మాసనాన్ని కోరినప్పుడు... 'ఆ విషయాన్ని మేము నిర్ణయిస్తాము' అని పేర్కొంటూ... పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఇలాంటిదే మరొక పిటిషన్ విచారణకు వచ్చినప్పుడు ధర్మాసనం 'తోసిపుచ్చుతున్నాం' అని తెలిపింది. పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌లలో జోక్యం చేసుకోవడానికి అనుమతించాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరడంపై సీజేఐ స్పందిస్తూ 'ఇప్పటికే చాలామంది జోక్యం చేసుకున్నారు' అని అన్నారు. ఏప్రిల్ 17న సుప్రీం కోర్టు తన ముందున్న మొత్తం పిటిషన్‌లలో ఐదు పిటిషన్లను మాత్రమే విచారణ చేయాలని నిర్ణయించింది. న్యాయస్థానాలు వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను డీనోటిఫై చేసే అధికారం, వక్ఫ్-బై-యూజర్ లేదా వక్ఫ్ ద్వారా డీనోటిఫై చేసే అధికారం సహా మూడు అంశాలపై మధ్యంతర ఆదేశాలు జారీ చేయడానికి మే 20న వాదనలు వింటామని ధర్మాసనం తెలిపింది.

భూభారతి చట్టం దేశానికే ఆదర్శం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీమ్ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం భూభారతి చట్టంలో పైలట్ మండలంగా ఎంపిక చేసిన జిల్లాలోని పెంచికల్ పేట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి తనసరి అనసూయ (సీతక్క), ఉమ్మడి జిల్లా శాసనమండలి సభ్యులు దండే విఠల్, రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, జిల్లా కలెక్టర్ వెంకటేష్, దోత్రే, ఎస్.పి. శ్రీనివాస్ రావు, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం. డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు లతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని, మేధావుల సూచనలు, 18 రాష్ట్రాలలోని భూ చట్టాలపై అధ్యయనం చేసి న్యాయనిబనుల సలహాలు, ప్రజల అభిప్రాయాలతో రూపొందించిన భూభారతి చట్టంలోని అంశాలు ప్రతి రైతు సమస్యకు పరిష్కార మార్గం చూపుతుందని తెలిపారు. జూన్ 2వ తేదీ నాటికి పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న మండలాలలో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధరణి లో గల లోపాలు, సమస్యల వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, భూ సమస్యల పరిష్కారం కొరకే ధరణి పోర్టల్ లు రద్దుచేసి భూ భారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈ చట్టం అమలులో రెవెన్యూ శాఖ అధికారులు కీలక పాత్ర పోషిస్తారని, అధికారులు చిత్తశుద్ధితో పనిచేసే రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. జూన్ 2వ తేదీ నాటికి 10 వేల 956 గ్రామాలలో గ్రామ పాలన అధికారుల వ్యవస్థ ప్రారంభిద్దామని తెలిపారు. రెగ్యులర్ సర్వేయర్లు కాకుండా ఇంకా 5 వేల మంది లైసెన్స్ సర్వేయర్లను 3 నెలల పాటు శిక్షణ అందించి నియమించడం జరుగుతుందని తెలిపారు. రానున్న రోజులలో అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని, అధికారుల సమన్వయంతో అర్హుల జాబితా రూపొందించడం జరిగిందని తెలిపారు. అటవీశాఖ అధికారులు పోడు సాగు చేసే వారి పట్ల అత్యుత్సాహం ప్రదర్శించకూడదని, పంట సాగుకు అడ్డు పడకూడదని తెలిపారు.

గత రబీతో పోలిస్తే

ఈసారి 160 శాతం ధాన్యాన్ని కొనుగోలు చేశాం : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నల్గొండ జిల్లాలో గత రబీతో పోలిస్తే ఈ రబీలో 160 శాతం ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నలమాడ ఉత్తంకుమార్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావుతో కలిసి హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులతో రబీ ధాన్యం సేకరణపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా జిల్లాలో ధాన్యం సేకరణ వివరాలను జిల్లా కలెక్టర్ తెలియజేస్తూ జిల్లాలో ఈ రబీలో 5 లక్షల 57 వేల మెట్రిక్ టన్ను ధాన్యం వస్తుందని అంచనా వేయడం జరిగిందని, సుమారు 5 లక్షల 14 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలియజేశారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం 160 శాతం ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో గన్ని బ్యాగులు, టార్పాలిన్ల సమస్యలు లేవని, మొదట్లో రైతులు ధాన్యాన్ని తూర్పారబట్టకుండా తీసుకురావడం వల్ల సమస్య ఉండేదని, ఇప్పుడు ఎలాంటి సమస్యలు లేవని వెల్లడించారు. రాష్ట్ర పౌరసరఫరాలు, ఇరిగేషన్ శాఖ మంత్రి నాలమాడ ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకించి ఈ రబీ సీజన్లో మాత్రం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. అందువలన రైతులెవరు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు ఎదురవకుండా జిల్లా కలెక్టర్లు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ ధాన్యం సేకరణకు సంబంధించి పత్రికలలో వ్యతిరేక వార్తలు వచ్చినప్పుడు తక్షణమే స్పందించి వివరణలు ఇవ్వాలని తెలిపారు. ఇన్చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, మార్కెటింగ్‌శాఖ ఏడి ఛాయదేవి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, తదితరులు ఈ వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

రాజీవ్ యువవికాసం దరఖాస్తులు వేగంగా పరిశీలించాలి

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్: రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలనను వేగవంతంగా పూర్తి చేయాలని బి.సి. సంక్షేమ శాఖ అధికారి ఎం.నరసింహస్వామి అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బి.సి డెవలప్మెంట్ అధికారి నరసింహస్వామి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్సీ కార్పొరేషన్ శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ దేశి రామ్ నాయక్, ఎల్.డి.యం సత్యనారాయణ మూర్తిలతో కలిసి రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలనపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి నుండి హార్డ్ కాపీలు రాని యెడల వారికి ఫోన్ చేసి కాపీలు త్వరగా వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా బ్యాంకుల నుండి సిబిల్ వెరిఫికేషన్ నివేదికలను త్వరగా తీసుకొని వచ్చి మీకు ఇచ్చిన టార్గెట్లను త్వరితగతిన పూర్తి చేయాలని వార్డ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వార్డ్ ఆఫీసర్లు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

విశాలాంధ్ర - కారేపల్లి : మతోన్మాద కేంద్ర ప్రభుత్వ బీజేపీ రైతు కార్మిక ఉద్యోగ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి వై.ప్రకాష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని మాదారం గ్రామంలో ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె గ్రామీణ భారత బందులో కార్మిక కర్షక ఉపాధ్యాయ యువజన సకల జనులు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వై ప్రకాష్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కనీస వేతన చట్టం అమలు చేయాలని దేశంలో ఉన్న అసంఘటితనంగా కార్మికులను శాశ్వత కార్మికులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఢిల్లీ రైతాంగానికి లిఖితపూర్వకంగా రాసి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఎంఎస్ పి గిట్టుబాటు ధర చట్టం అమలు చేయాలని స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని ప్రైవేటీకరణను నిలిపివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోయిల శ్రీనివాస్, కావేటి నాగేశ్వరరావు, కుర్ర శ్రీను, గడ్డం వెంకన్న, బీవీరు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల కాన్వాయ్‌ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ముధోల్ నియోజకవర్గంలోని కుంటాల మండల కేంద్రంలో భూ భారతి అవగాహన సదస్సుకు మంత్రులు వస్తున్న కాన్వాయ్‌ని స్థానిక బీఆర్ఎస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కాన్వాయ్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ ధనసరి అనసూయ అలియాస్, సీతక్క ఉండగా, వీరిని అడ్డుకునే ప్రయత్నం చేసిన వారిని పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అయితే ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, వడ్ల కొనుగోలు జాప్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు.

గ్రామస్తుల బాగోగులే లక్ష్యం

విశాలాంధ్ర - గూడూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విలేకరుల సమావేశంలో మండల తాసిల్దార్ చంద్రశేఖర్ రావు, మండల ప్రజా పరిషత్ అధికారి ఎర్ర వీరస్వామిలు పాల్గొని మాట్లాడుతూ గత 7, 8 నెలల నుండి ప్రజలకు నానా ఇబ్బందులు గురిచేస్తూ ప్రజల ఇళ్లల్లోకి దూరి దొరికిందంతా దోచేస్తున్న కోతుల బెడద తేటతెల్లమైపోయింది. గూడూరు మండల కేంద్రంలో కోతల బెడద తగ్గించడానికి గూడూరు కాంగ్రెస్ పార్టీ నాయకుడైన వాంకుడోత్ కొమ్మాలు గత కొన్ని నెలల నుండి కోతులను పట్టించడానికి ఖర్చును వెచ్చించారు. చెన్నై నుండి గత నాలుగైదు నెలల క్రితం 2,200 కోతులను వాటిని పట్టేందుకు అయ్యే ఖర్చు దాదాపు 15 లక్షలు ఖర్చు చేసి కోతులను పట్టించడం జరిగింది. గూడూరు గ్రామస్తులకు కోతుల నుండి వచ్చే బెడదను తప్పించి వారి సమస్యను పరిష్కరించారనీ అధికారులు వాంకుడోత్కొమ్మాలుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజల కోసమే కొమ్మాలు, కొమ్మాలు కోసమే ప్రజలు అన్నట్లు గూడూరు గ్రామమంతా కొమ్మాలు చేసిన పనికి విశేషా ఆదరణ ఆశీర్వాదం కొమ్మాలుకు దక్కిందని, పంట పొలాలు కాయగూరలు నాలుగు మెతుకులు కడుపులోకి పోతున్నాయి అంటే కారణం కొమ్మాలే అని ఊరు వాడ కోడైకుస్తున్నది.

పట్టాలు లేకున్నా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్ : ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు ఇండ్ల పట్టాలు ఇస్తూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సిపిఐ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథి రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పట్టణ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆర్గనైజేషన్ కమిటీ సమావేశం వీరవెల్లి రవి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎలాంటి కొర్రీలు లేకుండా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైన కూడా పట్టాలు లేవని సాకుతో అధికారులు అర్హుల జాబితా నుండి వారిని తొలగిస్తున్నారని, ఇలా చేయకుండా పట్టాలు లేకుండా అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు, ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని ఆయన కోరారు. 67 గజాల లోపే కట్టాలని రిజిస్ట్రేషన్ పత్రాలు ఉండాలని ఇంటి పట్టాలు ఉండాలని రేషన్ కార్డులో పేరు ఉండాలని అనేక సాకులతో అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని ఇది సబబు కాదని అన్నారు. గత ప్రభుత్వం 58 జీవో కింద పట్టాలు ఇస్తామని కొంతమందికే ఇచ్చి చేతులు దులుపుకున్నదని, అప్పుడు రాని పట్టాలు ఇప్పుడు ప్రజల దగ్గర ఎక్కడ ఉంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిళ్ల సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని అరికడితే.. డెంగ్యూ వ్యాధిని అరికట్టినట్టే

విశాలాంధ్ర- మరిపెడ: దోమల వ్యాప్తిని అరికట్టి డెంగ్యూ వ్యాధిని సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ రవి పేర్కొన్నారు డెంగ్యూ డే సందర్భంగా శుక్రవారం మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి మరిపెడ పట్టణం కార్గిల్ సెంటర్ మరియు బస్టాండ్ సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ మరియు మానవహారం నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడారు ఆర్థోవైరస్ తరగతికి చెందిన నాలుగు రకాల డెంగ్యూ వైరస్‌ల వల్ల ఈ వ్యాధి సోకుతుందన్నారు.ఇది మనిషి నుండి మనిషికి ఏడిస్ ఈజిప్టు దోమల ద్వారా సంక్రమిస్తుందన్నారు. ఈ జాతి దోమపైన నల్లని, తెల్లని చారలు ఉండుటవలన దీనిని టైగర్ దోమ అని కూడా పిలుస్తారన్నారు. ఈ దోమలు ఇంటి లోపల, ఆవరణలో ఉండి, పగటిపూట మాత్రమే కుడతాయన్నారు. ఇవి ఎక్కువ దూరం (400 మీటర్లు) ఎగరలేవని, అన్ని రకాల దోమలకంటే ఈ దోమ చాలా బరువైనదగా ఉంటుందన్నారు. డెంగ్యూ వైరస్‌తో ప్రభావం అయిన దోమలోనే కాకుండా దోమ గుడ్లలో కూడా ఈ వైరస్ ఉంటుందన్నారు.కాబట్టి త్వరితగతిన ఎక్కువ మందికి వ్యాధి వ్యాపించే అవకాశం ఉంటుందన్నారు. డెంగీ వ్యాధి మూడు రకాలుగా బయటపడవచ్చు, డెంగీ జ్వరండెంగీ హెమరేజ్ జ్వరండెంగీ షాక్ సింగ్రోమ్‌గా వెల్లడి అవుతుందన్నారు. నివారణ చర్యలు ముఖ్యంగా ఇంటిలోపల, ఇంటి ఆవరణలో ఎక్కడా మూతలేకుండా కొద్దిగా నీళ్ళుకూడా నిల్వ ఉండకూడదన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వామి, పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ మంగమ్మ, సూపెర్వైసోర్స్ కృష్ణ, ఆచార్యులు, సుదర్శన్, లక్ష్మి కుమారి, మాధవి, పల్లె దవాఖాన సిబ్బంది సాయి శ్రీ, సిరి, సతీష్, ఝాన్సీ, తరణి, హెల్త్ అసిస్టెంట్ వీరయ్య, నర్సయ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మారినా పేదల భూములకు రక్షణ కరువు

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీం : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్ నగర్ మండలం అంకుశ పూర్‌లో దళిత మహిళపై దౌర్జన్యం చేసిన ఘటన సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. పూర్తి వివరాల్లోకెళ్తే కాగజ్నగర్ మండలంలోని అంకుసాపూర్ గ్రామానికి చెందిన చునార్కర్ మీరాబాయి గత 40 ఏళ్లుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. అట్టి భూమిపై కన్నుబడ్డ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కుటుంబ సభ్యుడు కోనేరు శేషగిరి (లడ్డు బాబు) తన అనుచరులతో చేను కెళ్ళి రెండు ట్రాక్టర్ల ద్వారా చదును చేయడంతో విషయం తెలుసుకున్న మహిళ అడ్డుకునే ప్రయత్నం చేసింది. ఆమెపై కులం పేరుతో దూషించి దాడికి యత్నించాడు. దీంతో ఆవేదన చెందిన మహిళ తనకు జరిగిన అన్యాయాన్ని వీడియో రూపంలో సోషల్ మీడియాలో ప్రచారం చేయడం జరిగింది. గత 40 ఏళ్లుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, సాగు చేసుకుంటున్న భూమికి సంబంధించి పత్రాలు అన్నీ ఉన్నాయని, ఈ విషయమై గతంలో సైతం పోలీసుల ద్వారా బెదిరించిన ఘటనలు ఉన్నాయని, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన న్యాయం జరగడం లేదు, మహిళ అని కూడా చూడకుండా బూతులు మాట్లాడుతూ నెట్టవేసినట్లు ఆ మహిళ ఆ వీడియోలో వాపోయింది. సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని మహిళా డిమాండ్ చేస్తుంది.

ఘనంగా అరిబండి సురేష్ బాబు పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - నేరేడుచర్ల : ఘనంగా మండల పార్టీ అధ్యక్షుడు అరిబండి సురేష్ బాబు పుట్టినరోజు వేడుకలను నేరేడుచర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బి ఆర్ ఎస్ పార్టీ ఆఫీసు నందు హుజూర్ నగర్ నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహరెడ్డి సమక్షంలో పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పట్టణ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అన్నిగ్రామలా పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారులు, సిబ్బందికి యోగా తరగతులు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జిల్లా కేంద్రం కొత్తగూడెంలో పోలీస్ అధికారులు సిబ్బందికి యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. శుక్రవారం హేమచంద్రాపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు యోగా తరగతులను ఏర్పాటు చేసారు. ఈ తరగతులలో కొత్తగూడెం సబ్ డివిజన్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది, ఆర్మడ్ రిజర్వు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎస్పి అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ నిత్యం విధులలో వత్తిడికి గురవుతూ ప్రజలకు సేవలు అందిస్తున్న పోలీసులకు ఈ యోగా తరగతులు ఎంతో అవసరం అన్నారు. శారీరక దృఢత్వంతో పాటు, మానసికంగా కూడా దృఢంగా ఉండేలా యోగ ఉపయోగపడుతుం దన్నారు. యోగ గురువు గుమలాపురం సత్యనారాయణ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి రెహమాన్, సీఐలు వెంకటేశ్వర్లు, కరుణాకర్, రమేష్, శివప్రసాద్, ఆర్ఐలు లాల్ బాబు, సిబ్బంది హాజరయ్యారు.

మతోన్మాద ఉగ్రవాద చర్యలు ఖండించాల్సిందే

విశాలాంధ్ర - కారేపల్లి : మతోన్మాద ఉగ్రవాద చర్యలను యావత్ దేశం ఖండించాల్సిందేనని యుద్ధంలో మరణించిన సైనికుల మరణాలతో రాజకీయాలు చేయటం అవసరమా అని కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమవంతరావు విమర్శించారు. శుక్రవారం సింగరేణి మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్‌లో జరిగిన కారేపల్లి మండల కౌన్సిల్ సమావేశం సిపిఎస్ సీనియర్ నాయకులు పాపినేని సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ ఉగ్రవాద చర్యలను అందరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. సామ్రాజ్యవాదులు కనుసైగల్లో ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం కీలుబొమ్మగా మారిందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పుకోవడం దారుణమైన చర్య అన్నారు. ఉగ్రవాద చర్యలను మతం పేరుతో రుద్దటం దారుణమైన చర్య అన్నారు.దేశంలో ఉన్న ప్రధాన సమస్యలను పక్కదారి పట్టించేందుకు ఇటువంటి చర్యలు పాల్పడుతున్నారన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ ధరణిలో ఉన్న లోపాలు భూభారతతో తీర్చవలసిన అవసరం ఉందన్నారు. సిపిఐ నియోజవర్గ ఇంచార్జ్ ఎర్రబాబు జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ జిల్లా సమితి సభ్యులు ఉంగరాలు సుధాకర్ చెన్నైశెట్టి భూషయ్య,పుచ్చకాయల శ్రీనివాసరావు, అనంతరామయ్య, వీరు నాయక్,వడ్డే వెంకటయ్య బట్టు సంగయ్య,భాగం వెంకన్న,బొమ్మల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ల కేబుల్ వైర్ల దొంగ అరెస్ట్

విశాలాంధ్ర - నేరేడుచర్ల : విద్యుత్ మోటార్ల కేబుల్ వైర్ల దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు శుక్రవారం నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామానికి చెందిన పస్తం అశోక్ అలియాస్ అనిల్ కుమార్ రాత్రి సమయంలో రామాపురం సమీపంలో పంట పొలాల వద్ద ఉన్న (10) వ్యవసాయ విద్యుత్ మోటార్ల కేబుల్ వైర్ల దొంగతనానికి పాల్పడ్డారన్నారు. కేబుల్ వైర్ల ధర సుమారు 20వేల వరకు ఉంటుందన్నారు.దొంగిలించిన సొమ్మును అమ్మడానికి మిర్యాలగూడ వైపు వెళ్తుండగా చిల్లేపల్లి చెక్ పోస్ట్ వద్ద పోలీసుల వాహనాల తనిఖీలలో పట్టుపడ్డట్టు తెలిపారు. నిందితుడి నుండి 10 మోటార్ల కేబుల్ వైర్లను, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపినట్లు తెలిపారు.

రెవెన్యూ సేవల్లో పారదర్శకత పెంచేందుకు చర్యలు : కలెక్టర్



విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి పైలట్ ప్రాజెక్ట్ అమలులో పారదర్శకత, సమర్థత, వేగం తీసుకొచ్చేందుకు విశేష చర్యలు చేపట్టామని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. శుక్రవారం కొండాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి, దరఖాస్తుల ప్రక్రియ, విధానాలను సమీక్షించారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ, భూభారతి గ్రామ సభలలో రైతుల నుండి స్వీకరించిన దరఖాస్తుల ప్రక్రియను త్వరితంగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తులు భూభారతి చట్టం తహసీల్దార్ లాగిన్ ద్వారా ఆన్లైన్‌లో అప్లోడ్ చేయాలని, దానికి అనుగుణంగా భూసంబంధిత సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు భూమి సంబంధిత సర్టిఫికెట్లు, రికార్డులు పొందడంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడమే మా ప్రథమ లక్ష్యం అని అన్నారు. ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రతి రెవెన్యూ అధికారిపై ఉందని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు భూభారతి రెవెన్యూ టీం లీడర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భూభారతి ప్రక్రియలో ఎదురవుతున్న సవాళ్లను గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన సూచనలు ఇచ్చారు. భూభారతి గ్రామ సభల్లో రైతుల నుండి దరఖాస్తులు ఉచితంగా స్వీకరించాలని కలెక్టర్ ఆదేశించారు.

పోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి:డీఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఉపాధ్యాయులు పోక్సో చట్టంతో పాటు ఆధునిక సైబర్ నేరలపట్ల అవగాహన కలిగివుండాలని డిఎస్పి అబ్దుల్ రెహమాన్ అన్నారు. కొత్తగూడెం లోని జిల్లా విద్యా శిక్షణా కేంద్రంలో శుక్రవారం జరిగిన ఆంగ్ల ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. పోక్సో చట్టం, బాలికల అక్రమ రవాణా, సైబర్ నేరాల పట్ల ఆయన వివరించారు. కేవలం నేరం చేయడమే కాకుండా, నేరాన్ని దాచిపెట్టడం కూడా నేరంగా పరిగణించబడుతుందన్నారు. విద్యార్థులు పాఠశాలలో ప్రవేశించిన దగ్గర నుండి బయిటికి వెళ్లే వరకు ఉపాధ్యాయులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. మన ఫోన్‌కు కొత్త నంబర్స్‌తో కాల్స్ వస్తే లిఫ్ట్ చేయొద్దన్నారు. లిఫ్ట్ చేస్తే సైబర్ నేరగాళ్ళు మన అకౌంట్ ను హ్యాక్ చేసి డబ్బులను మొత్తం కాజేస్తారని డిఎస్పి వివరించారు. అందుకే అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే జనరల్, వీడియో కాల్స్ కు సమాధానం చేయెద్దన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ ఎన్.సతీష్ కుమార్, వన్ టౌన్ సిఐ. కరుణాకర్, ఎస్ఐ విజయ, రిసోర్స్ పర్సన్లు సైదులు, మీరా హుస్సేన్, మురళి, హరిబాబు పాల్గొన్నారు.

జోరు వానలోనూ బడిబాట

విశాలాంధ్ర - గార్ల : సర్కారు బడిలో విద్యార్థి కేంద్రీకృత విధానంలో మెరుగైన విద్యాబోధన నేర్పిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు జి.వీరభద్రం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దకిష్టపురం, చంద్రగిరి, చిన్నకిష్టపురం గ్రామాల్లో జోరు వానను సైతం లెక్కచేయకుండా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించమన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యారంగం వ్యాపార వస్తువుగా మారిందన్నారు. డబ్బున్న వారికే కార్పొరేట్ విద్య అందుబాటులో ఉందన్నారు. ఫలితంగా పేద, మధ్యతరగతి, గ్రామీణ విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరం అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. ప్రైమ్ మినిస్టర్ స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా ప్రాథమిక పాఠశాల పెద్దకిష్టాపురంలో సు విశాలమైన తరగతి గదులలో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థికి ఏడాదికి రెండు జతల ఏకరూప దుస్తులు, స్పోర్ట్స్ డ్రస్సులు, ఉచిత పాఠ్య పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తు సన్న బియ్యంతో భజన భోజన పథకం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ, రాంబాబు, రాజ్ కుమార్, స్వాతి, విద్యార్థుల తల్లిదండ్రులు, యువకులు పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా వెదురు వస్తువులు తయారు చేయాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : నేటి ఆధునిక సమాజ సమాజానికి అనుగుణంగా వెదురు వస్తువులను చాలా ప్రావిణంతో తయారు చేసినప్పుడే వాటికీ మార్కెటింగ్ ఉంటుందని బెంగళూరుకు చెందిన బ్యాంబు ఇండస్ట్రీస్ ఫౌండేషన్ సీఈవో నేజు జార్జ్ అన్నారు. జిల్లాలోని చంద్రుగొండ మండలం లోగల బెండలపాడు గ్రామంలో గిరిజన యువకులు నిర్వహిస్తున్న బ్యాంబు క్లస్టర్ పరిశ్రమను శుక్రవారం నేజు జార్జ్‌తో పాటు సంస్థ బాధ్యులు దివ్య సందర్శించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచనలతో వారు పాల్గొన్నారు. వారితోపాటు కలెక్టర్ కూడా పాల్గొన్నారు. గిరిజన యువకులు క్లస్టర్లు నిర్వహిస్తున్న వస్తువులను పరిశీలించారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లో వస్తువులు అమ్ముడు పోవాలంటే చాలా భిన్నంగా ప్రామాణికంగా నైపుణ్యంతో తయారు చేయాల్సి ఉంటుందని యువకులకు సూచించారు. దీనికోసం క్లస్టర్ సభ్యులు ట్రైనింగ్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. వెదురు వస్తువులు తయారీ కోసం తమ సంస్థ నుంచి ట్రైనర్లను పంపిస్తామని చెప్పారు. కాగా గిరిజన యువకులకు ఉపాధిగా ఉన్న ఈ క్లస్టర్ను అభివృద్ధి చేయాలని కలెక్టర్ కొన్ని నెలలుగా ప్రోత్సహిస్తూ సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో చంద్రుగొండ ఎంపీడీవోతో పాటు క్లస్టర్ సభ్యులు బాధ్యులు బుర్ర సురేష్, నాగభూషణం, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య మహిళలకు వసుధ ఫౌండేషన్ ఆర్థికసాయం

విశాలాంధ్ర - భద్రాచలం : అనారోగ్యంతో బాధపడుతున్న భద్రాచలంకు చెందిన ఇరువురు మహిళలకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక చేయూతను అందించింది. శుక్రవారం అలవాల విజయ, ఎస్.మమతలకు వసుధ ఫౌండేషన్ నిర్వాహకులు రూ.10 వేల చొప్పున భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి చేతుల మీదుగా అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆ మహిళలు ఆర్థిక సహాయం అందించాలని వసుధ ఫౌండేషన్ ను ఆశ్రయించారు. దింతో స్పందించిన వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ వి. శ్రీనివాసరాజుకు సూచించారు. ఈ క్రమంలో ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఈవో రమాదేవి మాట్లాడుతూ ఏజెన్సీలోని నిరుపేదలకు విద్యా, వైద్య అవసరాల కోసం వసుధ ఫౌండేషన్ అందిస్తున్న చేయూత అభినందనీయమన్నారు. శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

టెన్త్ సీబీఎస్ఈలో లీడ్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ప్రతి ఒక్కరికి మెరుగైన విద్యను అందించాలనే తమ లక్ష్యానికి నిదర్శనంగా, లీడ్ గ్రూప్ నేడు 2025 సీబీఎస్ఈ 10వ తరగతి బోర్డులలో విద్యార్థులు సాధించిన అద్భుతమైన ప్రదర్శనను వెల్లడించింది, టైర్ 2, టైర్ 3 పట్టణాల నుండి వచ్చిన విద్యార్థులు జాతీయ సగటు కంటే 1.5 రెట్లు ఎక్కువ ప్రతిభ కనబరిచారు. ఈ సంవత్సరం, 125 మంది లీడ్ విద్యార్థులు 90శాతం కంటే ఎక్కువ స్కోరు సాధించారు. ఇది జాతీయ సగటు కంటే 1.5 రెట్లు ఎక్కువ, 32 మంది విద్యార్థులు 95శాతం కంటే ఎక్కువ స్కోరు సాధించారు, తద్వారా జాతీయ సగటు కంటే 2 రెట్లు ఎక్కువ ప్రతిభ కనబరిచారు. విద్యాపరమైన ప్రత్యేకతను మరింత వెల్లడి చేస్తూ, 23 మంది విద్యార్థులు కనీసం ఒక సబ్జెక్టులో 100శాతం స్కోరు సాధించారు. గణితం, ఇంగ్లీష్, సోషల్, సైన్స్, హిందీ వంటి బోధనాంశాలలో వారి ప్రతిభను ప్రదర్శించే చిన్న పట్టణ విద్యార్థులకు ఇది ఒక అద్భుతమైన విజయంగా నిలిచింది. లీడ్ గ్రూప్ సీఈఓ మరియు సహ వ్యవస్థాపకుడు సుమీత్ మెహతా మాట్లాడుతూ, "మా విద్యార్థుల అద్భుతమైన 2025 సీబీఎస్ఈ 10 వ తరగతి ఫలితాలు స్థానం లేదా నేపథ్యంతో సంబంధం లేకుండా ఎక్కడైనా అధిక నాణ్యత గల అభ్యాస ఫలితాలను సాధించవచ్చనే దానికి శక్తివంతమైన జ్ఞాపిక. లీడ్ శక్తివంతమైన సంగారెడ్డి లోని పాఠశాలల విద్యార్థులలో అత్యధిక స్కోరు సాధించిన వారిలో సెయింట్ ఆంథోనీ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ - సెయింట్ పీటర్స్ హై స్కూల్ విద్యార్థులు దేవర్దేశ్ వైభవి, పూజారి అమర్‌నాథ్, భూషణం సాత్విక్ ఉన్నారు. సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ - సెయింట్ పీటర్స్ హై స్కూల్ చైర్మన్ ఆంథోనీ రెడ్డి మాట్లాడుతూ, " సీబీఎస్ఈ 10వ తరగతి బోర్డులలో అసాధారణ ప్రతిభ కనబరిచిన దేవర్దేశ్ వైభవి, పూజారి అమర్‌నాథ్ భూషణం సాత్విక్‌ల చూసి మేము గర్వపడుతున్నామన్నారు.

సంపాదకీయం

బీజేపీ ప్రేరిత ముర్ము అనుమానాలు

చట్టసభలు ఆమోదించిన బిల్లులకు రాష్ట్రపతి, రాష్ట్రాల గవర్నర్లు ఆమోదం తెలపడానికి గడువు విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా అని ప్రశ్నిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అత్యున్నత న్యాయస్థానం నుంచి వివరణ కోరారు. ఒక అంశం రాజ్యాంగబద్ధమైందా కాదా అని తెలుసుకోవడానికి అవసరమైన పుడు రాష్ట్రపతి లేదా గవర్నర్లు రాజ్యాంగంలోని 143వ అధికరణం ప్రకారం సుప్రీంకోర్టు సలహా కోరవచ్చు. ఒక దృక్కోణంతో చూస్తే రాష్ట్రపతి "రాజ్యాంగ నిబద్ధంగా ప్రజాస్వామ్యానికి సంబంధించిన వివరణ అడిగారనుకోవచ్చు. సహకార ఫెడరలిజం ను పరిరక్షించడానికి రాష్ట్రపతి ఈ వివరణ కోరడం సబబుగానే కనిపిస్తుంది. ఇది ఘర్షణ వైఖరిని నివారించడానికి తోడ్పడనూ వచ్చు. రాజ్యాంగ ప్రక్రియల పవిత్రతను, ప్రమాణాలను కాపాడడానికే రాష్ట్రపతి ఈ ప్రశ్న అడిగారనీ అనుకోవచ్చు. రాజ్యాంగంలోని 143(1) కింద రాష్ట్రపతి ఇలా వ్యవహరించడం చాలా అరుదైన అంశమే. చట్ట సభలు ఆమోదించిన బిల్లులకు ఆమోద ముద్ర వేయడానికి రాజ్యాంగం రాష్ట్రపతికి, గవర్నర్లకు ఎలాంటి గడువూ విధించలేదు. కానీ నెలల తరబడి, సంవత్సరాల తరబడి రాష్ట్రపతి కానీ గవర్నర్లు కానీ ఆమోద ముద్ర వేయకుండా మౌనంగా ఉండడంవల్ల కలిగే దుష్పరిణామాల గురించి కూడా ఆలోచించవలసిందే. చట్ట సభలు ఏ బిల్లులు ఆమోదించినా అది ప్రజాభిప్రాయాన్ని ప్రతిఫలిస్తుందనడంలో సందేహం లేదు. కానీ బిల్లులకు ఆమోద ముద్ర వేయడానికి రాష్ట్రపతికి గానీ, గవర్నర్లకు గానీ అనుమానాలు, అభ్యంతరాలు, భిన్నాభిప్రాయాలు ఉన్నప్పుడు ఆ బిల్లులను చట్టసభలకు వెనక్కు పంపించే అవకాశం కూడా రాజ్యాంగం ఇచ్చింది. అయితే అలా వెనక్కు పంపించిన బిల్లులను చట్ట సభలు సవరించి మళ్లీ పంపించవచ్చు. లేదా మళ్లీ యథాతథంగా అమోదించి రాష్ట్రపతికిగానీ, గవర్నర్లకు గానీ వెనక్కు పంపించవచ్చు. ఏ మార్పులూ చేయకుండా బిల్లులను అదే రూపంలో రెండో సారి ఆమోదం కోసం పంపితే రాష్ట్రపతికి, గవర్నర్లకు ఉన్న మార్గమల్లా ఆమోదించి పంపడమే. అంటే చట్టసభలు ఆమోదించిన బిల్లులను తిరస్కరించే, ఆమోదం నిరాకరించే అవకాశం రాజ్యాంగం ఇవ్వలేదు. కానీ ఇటీవలి కాలంలో కొందరు గవర్నర్లు, ముఖ్యంగా తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి బిల్లులను ఆమోదించకుండా, లేదా చట్ట సభలకు వెనక్కు పంపకుండా ఏ మాటా చెప్పకుండా తమ దగ్గరే అట్టిపెట్టుకోవడంవల్ల ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకెక్కింది. మూడు నెలలలోగా రాష్ట్రపతి గానీ, గవర్నర్లు గానీ బిల్లులను ఆమోదించి పంపాలని 2024 ఏప్రిల్ లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఇది బీజేపీ వారికి కంటిలో నలుసులా తయారైంది. ఒక వేళ మూడు నెలలలోగా బిల్లులను ఆమోదించి చట్టసభలకు పంపకపోతే దానికి కారణం ఏమిటో రాష్ట్రపతి, గవర్నర్లు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కూడా అత్యున్నత న్యాయస్థానం నిర్దేశించింది. ఒక వేళ గవర్నర్ బిల్లులను మళ్లీ చట్టసభలకు పంపితే, చట్టసభలు మార్పులతోనో, మార్పులు లేకుండానో రాష్ట్రపతికో, గవర్నర్లకు పంపితే వాటిని ఆమోదించకుండా ఉండకుండా ఉండడం చట్ట వ్యతిరేకం అని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. రాజ్యాంగంలోని 201 అధికరణం ప్రకారం రాష్ట్రపతి, 200వ అధికరణం ప్రకారం గవర్నర్ ఆమోదించకుండా ఉంటే అది రాజ్యాంగం ప్రకారం విచక్షణాధికారాన్ని వినియోగించుకున్నట్టు అవుతుందా కాదా అని కూడా వివరించాలని రాష్ట్రపతి సుప్రీంకోర్టును కోరారు. అసలు న్యాయస్థానాలు బిల్లులను ఆమోదించడానికి గడువు నిర్ణయించవచ్చునా లేదా అని కూడా రాష్ట్రపతి వివరణ కోరారు. 200, 201వ అధికరణం ప్రకారం రాష్ట్రపతికి, గవర్నర్లకు ఉన్న విచక్షణాధికారాలు 361వ అధికరణం ప్రకారం సబబేనా కాదా కూడా వివరించాలని రాష్ట్రపతి ముర్ము కోరారు. 142వ అధికరణం ప్రకారం న్యాయవ్యవస్థ అధికారం ఎంత, చట్టం కానప్పుడు కార్యనిర్వాహకవర్గం ఆ బిల్లులో పేర్కొన్న అంశాలపై చర్య తీసుకుని ముందుకెళ్లే అవకాశం ఉందా లేదా అని కూడా వివరించాలని ముర్ము కోరారు. రాష్ట్రపతి ముర్ము మొత్తం 14 అంశాల మీద సుప్రీంకోర్టు అభిప్రాయం కోరారు.

ఆ అంశం చట్టానికి సంబంధించింది అయినప్పుడు ఆ అంశాన్ని తేల్చడానికి అయిదుగురు న్యాయమూర్తులతో కూడిన బెంచీకి నివేదించాలని అధికరణం 145(3) చెప్తోంది కదా అన్నది రాష్ట్రపతి అనుమానాల్లో మరో అంశం. కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య వివాదం తలెత్తినప్పుడు అధికరణం 131 ప్రకారం కాకుండా మరో రకంగా పరిష్కరించే అవకాశం ఉందా లేదా అన్న విషయం తేల్చాలని రాష్ట్రపతి కోరారు. 143(1) అధికరణం ప్రకారం ఏ అంశం మీదైనా రాష్ట్రపతి సుప్రీంకోర్టు అభిప్రాయం కోరవచ్చు. కానీ ముర్మూ లేవనెత్తిన 14 అంశాలు రాష్ట్రపతికి, గవర్నర్లకు ఉన్న విచక్షణాధికారాల పరిధిని వివరించవలసిన పరిస్థితికు దారి తీశాయి. రాష్ట్రపతి, గవర్నర్లు చట్టసభలు ఆమోదించి పంపిన బిల్లులకు ఎప్పటి లోగా ఆమోదం తెలపాలో రాజ్యాంగం నిర్దేశించని మాట నిజమే. రాజ్యాంగ నిర్ణాయకసభ ఈ పని చేయకపోవడానికి భవిష్యత్తులో పేచీకోరు గవర్నలు పుట్టుకొస్తారని, వారు బిల్లులను నిరవధికంగా తొక్కి పెడ్తారని ఊహించి ఉండకపోవచ్చు. రాష్ట్రపతి ముర్ము కోరిన సలహా ప్రకారం ఇప్పుడు సుప్రీంకోర్టు రాజ్యాంగ విధానం, అధికార విభజన, ఫెడరల్ వ్యవస్థ, పొరపాట్లు నివారించడానికి కల్పించిన వెసులుబాట్లు, ముఖ్యంగా రాష్ట్రాల స్థాయిలో శాసనాలు రూపొందించే ప్రక్రియ మొదలైన అంశాలను కూడా నిశితంగా పరిశీలించి మార్గ నిర్దేశం చేయవలసి ఉంటుంది. అనుమానాలను నివృతి చేసుకోవడానికి రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా కోరడానికి సర్వాధికారాలు ఉన్నాయన్న విషయంలో సందేహాలకు తావు లేదు. బిల్లులను ఆమోదించడానికి రాజ్యాంగం నిర్ణీత గడువు విధించనప్పటికీ తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి లాంటి వారు ఆ బిల్లులను తొక్కి పెట్టడంవల్ల కలిగే దుష్పరిణామాలను, చట్టసభలు అమలు చేయదలచుకున్న శాసనాలు అమలులోకి రాకపోవడంవల్ల కలిగే నష్టాన్ని రాష్ట్రపతి బేరీజు వేసినట్టు లేదు. గవర్నర్లు మంత్రివర్గ సలహా మేరకు నడుచుకోవాలన్న రాజ్యాంగ సూత్రాన్ని కూడా ముర్ము పరిగణించినట్టు లేదు. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ ఒకే పార్టీ అధికారంలో ఉన్నంత కాలం గవర్నర్లు రాష్ట్రాల ప్రభుత్వాలను ఇబ్బంది పెట్టే రీతిలో ప్రవర్తించిన దాఖలాలు లేవు. కానీ కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ, రాష్ట్రాలలో వేర్వేరు పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాలు చేసే పనులకు కొందరు గవర్నర్లు అడ్డంకులు కల్పిస్తున్నారు. కేరళ గవర్నరుగా పని చేసినప్పుడు ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ అయితే విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్ల నియామకాలకు కూడా అడ్డు తగిలి వివాదాలకు అవకాశం కల్పించారు. గవర్నర్లు లాంఛనప్రాయమైన ప్రభుత్వాధినేతలుగా ఉండకుండా రాష్ట్రాలలొ అధికారంలో ఉన్న పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ కానప్పుడు వివాదాలు మరీ పెచ్చరిల్లాయి. ఈ వివాదాలు మోదీ అధికారంలోకి వచ్చిన తరవాతే పెరిగిపోయాయి. ముర్ము సుప్రీంకోర్టుకు నివేదించిన అంశాలపై సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన తరవాత గవర్నర్ల విపరీత ప్రవర్తనకు అడ్డుకట్ట పడ్తుందేమో చూడాలి. కానీ తనను రాష్ట్రపతిని చేసినందుకు ద్రౌపది ముర్ము అనేక సార్లు బహిరంగంగానే మోదీకి విశ్వాసపూరితమైన రీతిలో కృతజ్ఞతలు చెప్పుకున్నారు. తాను రాష్ట్రపతి కావడం మోదీ చలవేనని ఆమె అభిప్రాయం అయి ఉంటుంది. అయినా రాష్ట్రపతి, గవర్నర్లు రాజ్యాంగ నిర్దేశం ప్రకారం నడుచుకోవాలిగా! సం యమంతో ప్రవర్తించాలిగా! ఆమె అడిగిన ప్రశ్నలన్నీ బీజేపీ ప్రేరణతోనే అని స్పష్టంగానే కనిపిస్తోంది.

దిగంబర కవితో కొన్ని గంటలు

చక్రవాకం
- ముక్కాముల చక్రధర్

తృప్తినివ్వదు. ఓ పదో, పదిహేను రోజులో గడిపితే కూడా దిగులేస్తుంది. చెప్పులు దాచేస్తే మనతో ఉండిపోతాడా...! పోనీ, బట్టల సంచీని మాయం చేస్తే ఎలా ఉంటుంది? ఇలాంటి పల్లేరు కాయల ప్లానులు వేస్తాం. అయినా మన పిచ్చికానీ... దేశ దౌర్భాగ్యాన్ని దిగంబరంగా చూపించిన కవికి బట్టలెందుకు, కాళ్లకి జోళ్లెందుకు. ఆ ఇద్దరు కవయిత్రులు రాధాకృష్ణ, అమూల్యచందుల కవిత్వ ఆవిష్కరణ కోసం వచ్చాడనుకున్నాం. మనల్ని కకావికలం చేసి పోతాడని కలగన్నామా ! అలా వికలం చేసిన వాడే విలోమ కథకుడు నగ్నముని. తెల్ల వెంట్రుకలను సుతారంగా పైకి దువ్వుకుని పొడుగు చేతుల చొక్కాతో చిర్నగవుతో కారు దిగుతూంటే నా మటుకు నాకు మాక్సిమ్ గోర్కీని చూస్తున్నాను అనిపించింది. నన్ను చూసిన తర్వాత నగ్నముని మొదటి మాట "రాక్షసుడా...! నువ్వు ఇలాగే ఉంటావా.. ఇలాగే చేస్తావా?!" అని కౌగిలించుకుంటే చెప్పొద్దూ... చచ్చేంత ఆనందం కలిగింది. దాచుకున్న డబ్బులతో తెలిసీ తెలియని వయసులో ఇంటి నుంచి పారిపోయి ఆ మహానగరం హైదరాబాద్ శాసనసభలో నగ్నమునిని కలిసి కాళ్లకి దండం పెట్టిన ఆనాటి లేత రోజులు గుర్తుకొచ్చాయి. నిజానికి ఇంకా ఇప్పటికీ ఆ లేత మనుషులమే ఈ నగ్నముని అనే కవి ముందు. "చాలా చదివేశాం... చాలా చూసేసాం" అని అర్ధరాత్రో, మిట్ట మధ్యాహ్నమో ఓ మత్తులో ఉన్నప్పుడు అనుకుంటాం కాని... కొన్ని గంటల సాహచర్యం తర్వాత తెలుస్తుంది "ఈ కాలమంతయూ మిథ్యయే" అని. 'నవ్వుతాడేంటో ఈ నగ్నముని ప్రతి చిన్న విషయానికి' అని లోలోపల కించిత్ అనుమానిస్తాం. నవ్వుతున్నాడంటే మనల్ని చూసి కాదర్రా వెర్రిబాగులోళ్లారా. ఈ మారని లోకాన్ని చూసి ఈసడించుకుంటున్నాడ్రా అని ఆనక తెలిసొస్తుంది. కుర్చీలో కాలు మీద కాలు వేసుకుని కూర్చున్న నగ్నముని "ఇంకేంటి సంగతులు" అని ప్రశ్నించాడంటే ఆయనే చాలా సంగతులు చెప్పడానికి సిద్ధపడ్డాడని ఈ తెలివితక్కువ బుర్రలకి ఎప్పుడు అర్థమవుతుంది? పూర్వ కాలముననే చాలా తెలిసియుండిననూ... గొప్పగా... ఏదో మహా ప్రశ్న అడిగినట్లుగా ఫోజు పెడుతూ "అసలు దిగంబర కవిత్వం ఎలా ప్రారంభమైంది? దాని పునాది ఏంటీ?" అని అడుగుతామా... "అదా... ఏం కాదు...ఓ ఆరుగురం కలిసి ఇలా రాద్దామర్రా అనుకున్నాం. రాసేసాం" అంటాడే తప్ప అసలు నెపం మాత్రం లోకానికి వదిలేస్తాడు. మళ్లీ "గురువు గారూ. మీరు సాహిత్యంలోకి... మరీ ముఖ్యంగా ఈ దిగంబర కవిత్వంలోకి ఎలా వచ్చారు?" అని అమాయకంగా ప్రశ్నించిన ఆ కృష్ణ ప్రసాద్ అనే సాదాసీదా మనిషికి మాత్రం "నా పద్దెనిమిదో ఏటే తొలి కవిత రాసాను. మా ఇంటి వాతావరణం అలా కవిని చేసింది. ఇక దిగంబర కవిత్వమంటారా... నా ఆలోచనే. నేను కాకుండా మరో ఐదుగుర్ని కలుపుకుని వాళ్ల పేర్లు మార్చుకుని ఈ కుళ్లు వ్యవస్థపై తిరగబడితే తప్ప కుదరదనుకున్నాం. అందుకే దిగంబర కవిత్వం వచ్చింది" అంటూ సంజాయిషీ కాదు కాని ఓ వివరణ ఇస్తాడు నగ్నముని. మనం కూడా ఇంచుమించు ఇలాంటి ప్రశ్నే కదా అడిగాం. అతనికి వివరించి... మనకి పెదవి విరిచాడేంటి అని తర్కించుకుంటామా... మళ్లీ నగ్నమునే ఆ కృష్ణ ప్రసాద్ కేసి చూస్తూ "మనుషులు మారాలి కదా. వాళ్ల బతుకులు ఇలా ఉన్నాయని చెప్పాలి కదా. మర్యాదగా చెబితే రాజ్యానికి ఎక్కదు కదా... అందుకన్న మాట ఇలా దిగంబర కవిత్వం రాసాం" అని చెబుతాడు. ఇద్దరమే ఆ హొటేలు కారిడార్‌లో రింగు రింగులుగా పొగ వదులుతున్నప్పుడు అడిగా "నేనడిగితే నెపం, గిపం అంటూ దాటేశారు. అతగాడికి అంత వివరంగా చెప్పారేంటి?" అంటే... "నువ్వు సరే... అసలు నెపాలు, కోపాలు, తాపాలు, పాపాలు, పరిహారాలు, పరిహాసాలు, హింసలు, మధ్య తరగతి జీవితాలు, చిగురుటాకులా వణికే బతుకులు మోస్తున్నది వాళ్లు. వాళ్లకి అసలు సిసలు విషయాలు తెలియాలి" అన్నాడు రెండు వేళ్ల మధ్య బందీ అయిన సిగరెట్ నుసిని బొటనవేలితో దులిపేస్తూ. విజయవాడలో కొన్ని గంటల కోసం అద్దెకు తీసుకున్న ఆ హొటేలు గది అంతా కవిత్వమై గుబాళించడం మాత్రం అచ్చంగా ఆయన చలవే.

"మనకి మంచి విమర్శ కరవైంది. రా.రా వంటి వారు లేకపోవడం ఈనాటి దౌర్భాగ్యం" అని నగ్నముని అంటే... 'ఇతగాడేంట్రా దిగంబర కవిత్వాన్ని చీల్చి చెండాడిన రారాని పొగుడుతున్నాడు' అని మనసులో చాలా ఇదైపోతాం కదా...! అదిగో అలాంటప్పుడే "రా.రా రాజకీయాలు మనకి నచ్చవు కాని విమర్శకుడిగా రా.రాని కొట్టేవాడు లేడు. అలాంటి వాక్యాన్ని రాసిన వాడు నాకు మళ్లీ కనపడలేదు" అంటూన్న నగ్నమునిని వింటూంటే... 'ఇదిరా గుండె అంటే. దిగంబర కవిత్వాన్ని విమర్శించిన వాడిలో వాక్యం గొప్పతనాన్ని చూసిన వాడు ఈ నగ్నముని' అనుకుంటూ మురిసిపోతాం. సరిగ్గా ఆ సమయంలోనే ముఖపుస్తకంలో కొట్టుకు చచ్చిపోతున్న నానా జాతి వాళ్లు గుర్తొచ్చి 'మీరు మరణించి చాలా రోజులైంది. కాసింత పునర్జన్మకి ప్రయత్నించండర్రా' అని అరవాలనిపించింది. కవిత్వాన్ని ఆవిష్కరించాడు కదా... ఆ కవయిత్రుల గురించి మాట్లాడతాడు అనుకున్నాం కదా... మాట్లాడాడు. ఏమని.. వీళ్లని చూస్తూంటే దిగంబర కవిత్వం తొలి రోజులు గుర్తుకొస్తున్నాయని, వీళ్లు నాటి దిగంబర కవిత్వానికి నేటి కొనసాగింపని తేల్చిపారేశాడు. ఆ బాలోత్సవ భవన్‌లో కూర్చున్న పెద్ద వారంతా ఏమనుకున్నారో నాకు తెలియదు కాని.... నా మటుకు నేను "వీళ్లని దిగంబర కవుల వారసులు" అంటాడేంటి అని కంగారు పడిపోయాను సుమీ. ఇదీ అడిగాను నగ్నమునిని పుటోలు, సన్మానాలు, మెమెంటోలు, కాళ్లకి దండాలు అయిన తర్వాత... "ఏటి ఇలా అనేశారు. మీకు వారసులు అని. కరస్టేనా" అంటే "ముమ్మాటికి కరెస్టే. మార్గం తెలిసింది వాళ్లకి. ఇక పరువెట్టాల్సింది వాళ్లు. పరిగెట్టించాల్సింది నువ్వు" అంటూ నేను కుళ్లుకునే నవ్వు నవ్వాడు నగ్నముని. అప్పుడు తెలిసింది ఆ నవ్వుకి అర్థం. ఇంతకీ ఏం తెలిసిందంటే... ప్రజా కవిత్వాన్ని పట్టుకోవడం ఎలాగో ఇదిగో ఇలాంటి వాళ్లు నేర్పిస్తారని. వెళ్లిపోయాడని వగచాం కదా! కొన్ని గంటల సమయమే ఇచ్చాడని భోరుమన్నాం కదా! మరికొంత సమయం ఉండాల్సిందని వాంఛించాం కదా! సేమ్ టూ సేమ్ నగ్నముని కూడా అంతే. అర్ధరాత్రి పన్నెండు గంటలకి నాగోలులో ఇంటి ముందు కారు దిగాడని తెలిసింది. ఆయన చెబితేనే. ఇదొక్కటే చెబితే నగ్నముని ఎందుకు అవుతాడు. ఇంకోటి కూడా చెప్పారు. మరొకటి కూడా అన్నారు. "రాక్షసుడా. అక్కడే ఇంకో రెండు రోజులు ఉండాలనిపించింది. ఈ 48 గంటలూ... నలభై ఎనిమిది సెకన్లలో అయిపోయింది. నిన్ను చూడాలని ఉంది. ఎప్పుడొస్తావు. కాసింత త్వరగా రా" అని 94410... నుంచి పిలిచారు. ఫోన్ పెట్టేసి కన్నీళ్లు సర్దుకుంటున్నాను. మా పురం నుంచి ఆ మహానగరంలోని మహా మనీషిని చూసేందుకు....

(నగ్నమునికి పుట్టినరోజు శుభాకాంక్షలతో ఈ నాలుగు మాటలు)

- సీనియర్ జర్నలిస్టు, 99120 19929

సైనికదాడుల్లో సామ్రాజ్యవాదుల జోక్యం

డి.రాజా
సీపీఐ ప్రధాన కార్యదర్శి

జమ్ము కాశ్మీర్ - పహల్గాంలో టెర్రరిస్టుల దాడుల్లో 26మంది యాత్రికులు మరణించారు. ఇది ఇండియా అంతటా తీవ్రంగా కలిచివేసింది. ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ భద్రత, పౌర స్వేచ్ఛ, ప్రజాస్వామ్య జవాబుదారీ తనం, ప్రాంతీయ శాంతి, సామ్రాజ్యవాదుల జోక్యం లాంటి అనేక ఒత్తిడులు కలిగించే ఆందోళనలు బహిర్గతమయ్యాయి. టెర్రరిస్టుల దాడుల అనంతరం భారతసైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని 9 టెర్రరిస్టుల స్థావరాలపై క్షిపణులతో దాడులుజరిపి ధ్వంసం చేశారు. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతాల్లో టెర్రరిస్టు స్థావరాలను నామరూపాలు లేకుండా చేశారు. ఈ సందర్భంగా దేశ స్పందన సైనిక దాడులకంటే మిక్కిలిగా ఉంది. ఈ సందర్భంగా ఐక్యత, సమ్మిళిత, రాజ్యాంగ విలువలకు కట్టుబడిఉండటం ఎంతైనా అవసరం. ఈ సందర్భంగా కొన్ని సంక్లిష్టమైన ప్రశ్నలు వేయవలసి ఉంది. టెర్రరిస్టు ప్రేరేపకులు నిఘా విభాగం విశాలమైన విధాన పరమైన మార్గదర్శకం సక్రమంగానే ఉన్నాయా? జాతీయ భద్రతా సంక్షోభం ఏర్పడినప్పుడు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేయడం మంచి సంప్రదాయం. అయితే ఇండియా ప్రభుత్వం ప్రతిపక్షాలను మినహాయించి నిరంకుశంగా వ్యవహరించింది. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రతిపక్షాలను సంప్రదించకుండా ప్రభుత్వం తనంతటతానే సైనిక దాడులకు పూనుకుంది. ప్రధానమంత్రి ఏ సమావేశాల్లోనూ పాల్గొనకుండా ఉండటం మరిన్ని ప్రశ్నలకు అవకాశం కల్పించింది. ఉన్నతస్థాయిలో జవాబుదారీతనం కనిపించలేదు. అదే సమయంలో సైన్యం వృత్తినైపుణ్యం, ధైర్యసాహసాలను రాజకీయం చేయడం లేదా మతానికి, దాడులకు ముడిపెట్టడం ఏ మాత్రం సమంజసంకాదు. ఇదొక హెచ్చరిక. మితవాదశక్తులు రాజకీయంగా ప్రయోజనం పొందేందుకు తగిన సైనిక కార్యాచరణను చేపట్టింది. ఇదొక ప్రమాదకరమైన ధోరణి. తరచుగా అతి జాతీయవాదాన్ని ప్రదర్శించడం లేదా మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవడం జరుగుతోంది. మన సైన్యం ధైర్యసాహసాలను సంస్థాగతంగా గౌరవించాలి. ఛాతీని చరుచుకోవడం పరోక్షంగా మతాన్ని వినియోగించడం. జాతీయ భద్రత పేరుతో ప్రచ్ఛన్నంగా మతాల ఆధారంగా దేశాన్ని విభజించడం ఏ మాత్రం తగిన పనికాదు. సరిహద్దు ఆవల సైన్యం షెల్లింగ్ జరపడంతో కొంతమంది పౌరులుకూడా చనిపోయారు. ప్రత్యేకించి పూంచ్‌లాంటి సరిహద్దు ప్రాంతంలో సైనికులు భద్రతాచర్యలు చేపట్టారు. ప్రజలు తీవ్ర ఆందోళన, బాధను వ్యక్తం చేయడం సరైందే. ఈ అంశంపై సున్నితంగా దేశప్రజలు చర్చించుకోవడం తప్పనిసరి. అత్యంత విచారకరమైన విషయంఏమంటే గోదీ మీడియా మతాన్ని విస్తరించేందుకు అదేపనిగా ప్రచారాన్ని చేపట్టింది. విచ్ఛిన్నకరమైన, మతమైనారిటీలను బలిపశువులు చేయడం జరిగింది. అలాగే మతాలను రెచ్చగొట్టే వాతావరణాన్ని కలిగించారు. అదే సమయంలో ఇందుకు భిన్నంగా స్వతంత్ర జర్నలిజంను అందించే ప్రయత్నాన్ని కొంతమంది చేయడం ద్వారా నిజమైన విలువలను పాటించారు. అలాగే సంయమం కూడా పాటించారు. అటువంటి జర్నలిజాన్ని పాటించే సంస్థ 'ది వైర్' ను నిషేధించారు. నిషేధాన్ని ఎందుకు విధించారో కూడా చెప్పలేదు. ఇది చాలా ఆందోళన కలిగించే పరిణామం.

పక్షపాతంగా వ్యవహరించే మీడియాను ఏమాత్రం అదుపుచేయలేదు. నిష్పాక్షికంగా, దర్యాప్తుచేసి వాస్తవమైన వార్తలను అందించే సంస్థలను నోరుమూయించారు. అంటే పత్రికలు, మీడియా, ప్రజాస్వామ్యయుతంగా పనిచేయకుండా అణచివేస్తున్నారు.

ఉదాహరణకు నియమబద్ధంగా పనిచేసే మీడియా సంస్థలను అణచివేయడానికి పూనుకున్నారు. ప్రెస్‌ను స్వేచ్ఛగా పనిచేయనీయడం లేదు. ప్రజాస్వామ్యంలో సంక్షోభ సమయాల్లో తీవ్ర నిరసనదళాలు తలెత్తాయి. నిరంకుశాధికారంతో ఈ దళాల నోరుమూయిస్తున్నారు. కొన్ని ఎంపికచేసిన సంస్థలపై సెన్సార్‌షిప్‌ను విధిస్తున్నారు. ఏమాత్రం పారదర్శకంగా లేదా జవాబుదారీతనంగా ఉండటంలేదు. ప్రభుత్వం మీద ప్రజల విశ్వాసం తరిగిపోతోంది. ప్రభుత్వం మరింతగా విమర్శపట్ల సహనంకోల్పోయింది. సైనిక కార్యాచరణ ప్రారంభమైన తర్వాత ప్రతీకారంతో షెల్లింగ్‌ను తీవ్రతరం చేశారు. ఈ సమయంలోనే అకస్మికంగా కాల్పుల విరమణకు ఇండియా-పాక్‌లు అంగీకరించాయని సామ్రాజ్యవాదులు ప్రకటించారు. ఈ ఒప్పందం ప్రత్యేకించి సరిహద్దుల్లో నివసించే ప్రజలకు కొంత ఊరట కలిగింది. అయితే ఇక్కడ అనేక ప్రశ్నలు తలెత్తాయి. ఈ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఎవరు చర్చించారు? ఎందుకు చర్చించారు అనే ప్రశ్నలు వచ్చాయి. ఒప్పందం కుదరడానికి తానే రెండు దేశాల పాలకులతోనూ మాట్లాడి ఒప్పందం కుదిర్చానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బహిరంగంగా ప్రకటించాడు. నిజంగా ఒప్పందం చేసుకున్నది ఇండియా లేదా పాకిస్థాన్ ప్రభుత్వాలు అయితే, వారే ముందుగా ప్రకటించాలి. వీరు ట్రంప్ చేసిన ప్రకటనను తిరస్కరించలేదు. ఇండియా ప్రధానమంత్రితో సహా సైనిక, పౌర అధికారులు ట్రంప్ ప్రకటనపై ఎలాంటి వ్యాఖ్యానం చేయలేదు. కాల్పుల విరమణ ద్వైపాక్షిక నిర్ణయమే అని మాత్రం రెండు దేశాలు ప్రకటించాయి. అమెరికా మధ్యవర్తిత్వం వహించమని ఎవరూ కోరలేదని స్పష్టంగా తిరస్కరించడం లేదా ఖండించడం చేయలేదు.

ఈ ధోరణి తీవ్రమైన చిక్కులను కలిగిస్తుంది. అస్థిరతను కల్పించడం, జోక్యం చేసుకోవడం సైనికీకరణను ప్రోత్సహించడం, మధ్యవర్తిత్వం వహించడం లేదా కాల్పుల విరమణకు రెండుపక్షాలపై ఒత్తిడిచేయడం, విదేశీ శక్తి ప్రత్యేకించి అమెరికాకు చారిత్రక రికార్డు ఉంది. ఇక్కడకూడా రెండు పక్షాలపైన ఒత్తిడిచేశారు. 1972లో కుదిరిన సిమ్లా ఒప్పందం సూత్రీకరణకు మూల స్తంభం. ఇలాంటి కార్యాచరణను తిరస్కరించడానికి లేదు. శాంతిసాకుతో దక్షిణాసియాలో విదేశీ జోక్యం ఏర్పడింది. ఈ ప్రాంతంలో శాంతికి, అభివృద్ధికి వ్యతిరేకంగా వ్యూహాత్మకమైన ఆర్థిక ప్రయోజనాలకోసం సామ్రాజ్యవాద శక్తులు జోక్యం చేసుకుంటున్నాయి. ఈ విషయంలోనూ సామ్రాజ్యవాద ధోరణి మారిపోయిన వైనం కనిపిస్తోంది. ఇప్పుడు సామ్రాజ్యవాదం వాణిజ్యం, దౌత్యం, మధ్యవర్తిత్వం ముసుగులో తన ప్రయోజనాలకోసం పనిచేస్తోంది.

ట్రంప్ ప్రకటన సామ్రాజ్యవాదం ఎక్కువకాలం సైనిక జోక్యాలు లేదా వలసవాద ఆక్రమణలకు పరిమితమైలేదు. ప్రపంచంలో శాంతికి, సుస్థిరతకు కృషి చేస్తున్నట్లు కపటమాడుతోంది. ట్రంప్ తాజా ప్రకటన అలాంటిదే. పలస్తీనాలో తన ప్రయోజనాలు, లాభాల ప్రభావాన్ని విస్తరించడానికి మారణకాండను ప్రోత్సహిస్తోంది. ఇండియా, పాకిస్థాన్‌లలో వాణిజ్యాన్ని పెంపొందించేందుకే తాను కాల్పుల విరమణ ఒప్పందానికి కృషిచేశానని చెప్పడం కపటమే. సైనిక, పారిశ్రామిక విభాగాలలో ప్రయోజనం పొందేందుకే సామ్రాజ్యవాద శక్తులు అన్ని విధాలుగా పనిచేస్తున్నాయి. ఒకవైపు రెండుదేశాల మధ్య దాడులు జరుగుతున్న సమయంలో పాకిస్థాన్‌కు ఐఎమ్ఎఫ్ బిలియన్ డాలర్ల రుణాన్ని మంజూరు చేయడానికి అమెరికా ఒప్పించింది. ఈ రుణంలో పెద్ద మొత్తం రక్షణశాఖకు, సైనిక ఆయుధాలను సమీకరించుకునేందుకు గాను పాకిస్థాన్ ఖర్చు చేస్తుంది. వీటిని సరఫరాచేయడం ద్వారా అమెరికా ప్రయోజనం పొందుతుంది. ఇండియా సార్వభౌమత్వానికి భంగంకలిగే చర్యలకు దారితీసింది. యుద్ధము, శాంతి విషయాలలో విదేశీ శక్తుల జోక్యం పనికిరాదు. ఉపఖండంలో అంతర్జాతీయ శక్తులు జోక్యం చేసుకోవడాన్ని ఎవరూ సహించి మౌనంగా ఉండరు. భారత ప్రభుత్వం ప్రమాదకరమైన సంప్రదాయాన్ని అంటే జోక్యాన్ని ఖండించడం లేదా కాపాడుకోవడం జరగలేదు. కశ్మీరు విషయంలో కూడా జోక్యం చేసుకునేందుకు అవకాశం ఇవ్వకూడదు. ఈ మొత్తం వ్యవహారంలో తుది విశ్లేషణ ఏమంటే-టెర్రరిస్టుల దాడుల నుంచి సైనిక స్పందన, సెన్సార్‌షిప్ నుంచి కాల్పుల విరమణ వరకు-సైనికీకరణ, ప్రచారం, సామ్రాజ్యవాదం, రాజకీయ అవకాశవాదం లాంటివి సంక్లిష్టమైన విషయాలను తెలియజేస్తుంది. ప్రస్తుతం దేశం ముందు టెర్రరిజాన్ని సవాలు చేయడమేకాదు, ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసిన, సార్వభౌమాధికారాన్ని పరిరక్షించుకోవడం,సెక్యులరిజం, న్యాయం, న్యాయ వ్యవస్థ విలువలను మరింతగా పెంపొందించుకోవడం అవసరం. ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు సమష్టి, పారదర్శకంగా ప్రజల భాగస్వామ్యం ఎంతైనా అవసరం. ఇదిలేకుండా పదేపదే హింస, జోక్యం ప్రజల అవసరాలకోసం కాదు, కేవలం ప్రపంచ ఆధిపత్య దేశాల అత్యాశ కోసమే ఇలాంటి పనులు చేస్తున్నారు.

శాస్త్రీయ విద్య అవశ్యం

మల్లాడి శ్రీనగేష్

"సుమారు 93 శాతం 14-21 వయసు కల్గిన మంది విద్యార్థులు అందుబాటులో వున్న సుమారు 250 కెరీర్ - ఉద్యోగ అవకాశాల ఆప్షన్ లలో వారికి కేవలం 7 రకాల ఉద్యోగ రంగ సమాచారం మాత్రమే కలిగి ఉన్నారు. మరొక వైపు 90 శాతం మంది విద్యార్థులు తప్పు కెరీర్ ఎంపికను చేసుకుంటున్నారు. ఈ ఎంపిక పట్ల వారికి అవగాహన లేకపోవడం వారి నైపుణ్యాలకు ఉద్యోగ అర్హతకు ఎంతమాత్రం పొంతన లేదని తెలుస్తోంది"

కొఠారి కమీషన్ విద్యా సంస్కరణల్లో ఓ ప్రధాన భూమిక పోషించిన విషయం అందరికీ విదితమే, విద్యయే దేశాన్ని ఓ శక్తిమంతంగా తీర్చి దిద్దడానికి , సాంఘిక, జాతీయ సమైక్యతను పరిగణనలోనికి తీసుకొని అందరికీ నాణ్యమైన విద్య కోసం సరైన బోధనా వాతావరణాన్ని అందించడం అనేది ప్రధాన లక్ష్యంగా వక్కాణించారు. నాణ్యమైన విద్య అందించడం ద్వారా జీవితాలను తద్వారా సమాజాన్ని ప్రభావితం చేయడమే కాక సమాజంలో నెలకొని ఉన్న అసమానత -సామజిక వైషమ్యాలను తొలగించడానికి ఉపకరిస్తుందని వివరించారు. దీనికి తోడు విద్య జీవిత సాఫల్యతకు అనగా ఆదాయం, ఆరోగ్యం ఎన్నో అత్యున్నత అవకాశాలు అందుకోవడానికి చదువు ఒక ప్రధాన భూమిక. విద్య ఆధునికతను సంతరింపచేయడానికి, సమాజంలో ఆర్థిక అసమానతలను తొలగించడానికి తదనుగుణమైన వ్యవస్థలను రూపొందించడానికి ఉపకరిస్తుంది అనడంలో ఎంత మాత్రం సందేహం లేదు. యునెస్కో ప్రకారం విద్య మానవ హక్కు అని, జీవితకాలం ప్రతిఒక్కరు విద్యా హక్కును వినియోగించుకొనే అవకాశం ఉంటుందని నిర్వచించింది. నూతన విద్యా విధానం 2020 కూడా ఇదే ఒరవడిలో భావి తరాలను మంచి ప్రయోజకులుగా తీర్చి దిద్దడానికి కొన్ని కీలక సిద్ధాంతాలను పొందుపరిచింది.

వివేచనతో యోచిం చడం - తదనుగుణంగా పనిచేయడం, కరుణ, సానుభూతి ద్వారా ఇతరులకు సాయపడడం, బాధను చూసి వారికి సహాయం చేయాలనే కోరిక, వారి భావనలను అర్థం చేసుకోవడం తప్పనిసరి అని వక్కాణించింది. కష్టాలను ఎదుర్కోవడం, పట్టుదల అంటే కష్టాలను తట్టుకుని స్థిరంగా నిలబడడం, శాస్త్రీయ దృక్పథం" అంటే, ఏదైనా విషయం గురించి తార్కికంగా, హేతుబద్ధంగా ఆలోచించడం, నైతిక విలువలను దృష్టిలో ఉంచుకొని సృజనాత్మకతకు యోచించడం వంటి ప్రాధాన్యతా అంశాలను నూతన విద్యా విధానంలో పొందుపరచడం జరిగింది . తద్వారా ప్రయోజనకర పౌరులను తీర్చి దిద్ది సమానమైన, సమ్మిళిత భరిత వాతావరణాన్ని ఏర్పరచి రాజ్యాంగ విలువల పరిరక్షణ కూడా ప్రధాన లక్ష్యముగా భావించారు. ఈ లక్ష్యాలు నెరవేరాలంటే దేశంలో నాణ్యమైన విద్యను మరింత బలోపేతం చేయడం తప్పనిసరి.దీనికి కొన్ని ముఖ్యమైన సంస్కరణలు అనివార్యం. పాఠశాల కరికులం. ఉపాధ్యాయ వృత్తి విద్యా నైపుణ్యాల సరళి తరగతుల నిర్వహణలో శాస్త్రీయ దృక్పథం, ఏదైనా విషయం గురించి తార్కికంగా, హేతుబద్ధంగా, సృజనాత్మకతతో యోచించడం వంటి ప్రాధాన్యతా అంశాలపై దృష్టి -యువతకు ఉద్యోగ -ఉపాధి రంగాలలో భరోసా యువతకు భరోసా తప్పనిసరి అని గుర్తించక తప్పదు. కృత్రిమ మేధస్సు దిశగా దేశం పరుగులు పెడుతున్న తరుణంలో మన విద్యా నైపుణ్యాలను త్వరితగతిన మెరుగుపరచడానికి మౌలిక వసతులు, యువతకు నూతన నైపుణ్యాల వైపు అవగాహన , క్షేత్ర సందర్శన, కళాశాల విద్యను కొత్త కోర్సులతో మెరుగుపరచడం, ఉన్నత విద్యా స్థాయి మొదలుకొని ఉపాధి - ఉద్యోగ మార్కెట్ల డిమాండ్ సంబంధిత సమాచారాన్ని అందుబాటులో ఉంచడం, కెరీర్ కౌన్సిలింగ్ సౌకర్యాలతో యువతను సమాయత్త పరచడం ప్రధాన బాధ్యతగా ప్రభుత్వాలు, విద్యాలయాలు గుర్తెరగాలి. లేకపోతే చదువుకు - ఉద్యోగ ఉపాధి రంగాలకు అవసరమైన పనితనానికి ఎంతమాత్రం పొంతన ఉండక మనవాభివృద్ధికే పెద్ద విఘాతం. ఉదాహరణకు ఇండియా టు డే వారి నివేదిక ప్రకారం 93 శాతం 14-21 వయసు కల్గిన మంది విద్యార్థులు అందుబాటులో వున్న సుమారు 250 కెరీర్ -ఉద్యోగ అవకాశాల ఆప్షన్‌లలో వారికి కేవలం 7 రకాల ఉద్యోగ రంగ సమాచారం మాత్రమే కలిగి ఉన్నట్టు, సుమారు 90 శాతం మంది విద్యార్థులు తప్పు కెరీర్ ఎంపికను చేసుకుంటున్నట్లు వెల్లడైంది. ఈ ఎంపిక పట్ల వారికి అవగాహన లేకపోవడం వారి నైపుణ్యాలకు ఉద్యోగ అర్హతకు ఎంతమాత్రం పొంతన లేకపోవడం, దీని వల్ల ఎక్కువ శాతం మంది సరైన ఉద్యోగాలను పొందలేక, పొందినా సంతృప్తి చెందక,ఉద్యోగ బాధ్యతను నిర్వహించలేక నిరాశలో వున్నారని తెలుస్తోంది. అంతేకాక, అవగాహనా రాహిత్యం వల్ల ఇంజనీరింగ్, కంప్యూటర్ మరియు వివిధ టెక్నికల్ కోర్సులలో బాలికల చేరిక శాతం చాలా తక్కువని తెలుస్తోంది. నిజానికి 30-40 శాతం మంది బాలికలు మాత్రమే టెక్నికల్ కోర్సులలో చేరుతున్నారని అల్ ఇండియా స్టడీ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ 2021 నివేదిక వెల్లడించింది. ఈ పరిస్థితిలో చదువు, నైపుణ్యాలు ప్రాథమిక స్థాయి నుంచి బహుళ ప్రయోజనాల ప్రాతిపదికన ఉండాలి. పటిష్టమైన కరికులం, డిమాండ్ కలిగిన వృత్తిపరమైన విద్యా కోర్సుల రూపకల్పన, విద్యార్థులకు ఉత్సుకత సంతరింపచేసే నైపుణ్యాలతో కూడిన అనుభవాత్మక విద్య, మంచి సంభాషణా చాతుర్యం, సహకారం ప్రతిపాదికతో జట్టు కార్యక్రమాలు వంటి అంశాలను జోడించి వినూత్న విద్యా వ్యవస్థను -ప్రోత్సహించాలి. నూతన విద్యా విధానం 2020 ఈ విషయాలకు వెసులుబాటు కల్పించినప్పటికీ ఆచరణలో, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల -అధ్యాపకుల ఎంపికలో , మౌలిక వసతుల కల్పనలో, నిధుల కేటాయింపులో ప్రాధాన్యత లేకపోతే పోటీ ప్రపంచంలో యువత నెగ్గుకు రావడం కష్టతరమే. సాంప్రదాయ రీతి బోధనకు స్వస్తి పలికి కృత్యాధార, డిజిటల్ బోధన. పీర్ లెర్నింగ్, లైబ్రరీ వినియోగం, స్టెమ్ ఆధారిత అనుభవాత్మక విద్యను అందుబాటులో ఉంచడం తప్పనిసరి. ఈ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాల పెంపుదలలో ప్రభుత్వాలు తగినన్ని నిధులను వెచ్చించి వారికీ వినూత్న బోధన విధానాలపై ప్రత్యేక శిక్షణలు, సేవ్ ది చిల్డ్రన్ (బాల్ రక్షా భారత్) వివిధ రాష్ట్రాల్లో ప్రయోగ ఫలితాల ఆధారంగా ఏర్పరచిన ఉత్సాహవంతులైన సబ్జెక్టు ఆధారిత ఉపాధ్యాయుల పెడోగోజికల్ ఫోరమ్‌లను ఏర్పరచి వారికి తగిన శిక్షణ, అదనపు కోర్సులను నేర్చుకొనే వెసులుబాటు కల్పించడం, క్షేత్ర స్థాయి అవగాహన ద్వారా తద్వారా ఉపాధ్యాయులకు వృత్తి పరమైన నైపుణ్యాలను అందించి ఉపాధ్యాయులను సంసిద్ధపరచడం తప్పనిసరి అని ప్రభుత్వాలు గుర్తించాలి. అదనంగా క్షేత్ర స్థాయిలో ఉపాధ్యాయులకు అకడమిక్ సహకారాన్ని అందించడానికి స్థానిక డైట్ - జిల్లా ఉపాధ్యాయ శిక్షణా సంస్థలను బలోపేతం చేయడమే సమస్యలకు సరైన పరిష్కారం. పాఠశాల స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన బోధనా ప్రక్రియకుపకరించే ఉపకరణాల ఏర్పాటు ద్వారా పాఠశాలలను చైల్డ్ ఫ్రెండ్లీ లెర్నింగ్ సెంటర్‌గా తీర్చిదిద్దడం ప్రభుత్వ బాధ్యతగా గుర్తించాలి. అందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రణాళికలు రచించి యువత భవితకు భరోసా కల్పించాలి.

విద్యారంగ విశ్లేషకులు

నాలుగు వారాల్లోగా బకాయిలు చెల్లించండి

బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలో 25 శాతం నాలుగు వారాల్లోగా చెల్లించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ సుప్రీం కోర్టు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్టుకు వాయిదా వేసింది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ ఏడాది తన రాష్ట్ర బడ్జెట్ ప్రసంగంలో 4 శాతం డీఏ పెంపును ప్రకటించిన తర్వాత బెంగాల్ ప్రభుత్వ ఉద్యోగులకు 18 శాతం డీఏ లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 55 శాతం డీఏ అందుకుంటారు. కొంతమంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వ రేటుతో సమానంగా డీఏ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ చెల్లించాలని డిమాండ్ చేస్తూ కలకత్తా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మే 20, 2022న హైకోర్టు రాష్ట్రాన్ని కేంద్ర రేటుకు సమానమైన 31 శాతం డీఏ చెల్లించాలని ఆదేశించింది. బెంగాల్ ప్రభుత్వం ఈ ఉత్తర్వును సుప్రీం కోర్టులో సవాలు చేసింది. డీఏ కేసు నవంబరు 28, 2022న సుప్రీం కోర్టుకు చేరింది. డిసెంబరు 1, 2024 నుంచి విచారణ 18సార్లు వాయిదా పడింది. శుక్రవారం హైకోర్టు తీర్పులో ఎటువంటి లోపం లేదని సుప్రీం కోర్టు తెలిపింది. పెండింగ్‌లో ఉన్న డీఏలో 25 శాతం చెల్లించాలని, మిగిలినది తదుపరి విచారణలో పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

48 గంటల్లో ఆరుగురు ఉగ్రవాదుల హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ పోలీసులతో కలిసి భారత సైన్యం కేవలం 48 గంటల వ్యవధిలో ఆరుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టింది. మార్చిలో అమాయకుల ప్రాణాలు తీసిన ఓ టెర్రరిస్టు కూడా వీరిలో ఉన్నట్లు మీడియా సమావేశంలో జీవోసీ వి-ఫోర్స్ మేజర్ జనరల్ ధనుంజయ జోషీ, ఐజీపీ కశ్మీర్ వీకే బిర్డి వెల్లడించారు. ఉగ్రవాదులు ఎక్కడ దాక్కొన్నా ఏరి వేస్తామని చెప్పారు. 'మే 12వ తేదీన కెలర్ పర్వత శిఖరాల వద్ద ఉగ్ర బృందాలు దాక్కొని ఉన్నట్లు మాకు విశ్వసనీయ సమాచారం వచ్చింది. మర్నాడు ఉదయమే అక్కడ అనుమానాస్పద కదలికలను గుర్తించాం. దీంతో భద్రతా దళాలు వారిని చుట్టుముట్టాయి. వారు కాల్పులు జరపడంతో ఎన్‌కౌంటర్‌లో వారిని మట్టుబెట్టాయి. ఇక త్రాల్ పరిసరాల్లోని సరిహద్దు గ్రామంలో రెండో ఎన్‌కౌంటర్ జరిగింది. అక్కడ మేము నిర్బంధ తనిఖీలు చేపట్టాం. ఉగ్రవాదులు వేర్వేరు ఇళ్లల్లో దాక్కొని కాల్పులు మొదలు పెట్టారు. ప్రజల ప్రాణాలు రక్షించడం ఇక్కడ మాకు సవాలుగా మారింది. కానీ, ఎట్టకేలకు ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టాం. ఈ రెండు ఎన్‌కౌంటర్లలో మృతి చెందిన ఆరుగురిలో ఒకడైన షహీద్ కుట్టె రెండు పెద్ద దాడుల్లో నిందితుడు. జర్మనీ పర్యాటకులపైనా ఇతడు దాడి చేశాడు. త్రాల్ ప్రాంతంలో భౌగోళిక పరిస్థితులు కూడా చాలా కఠినంగా ఉన్నాయి' అని మేజర్ జనరల్ ధనుంజయ జోషీ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్లలో జమ్మూకశ్మీర్ పోలీస్, సైన్యంతోపాటు సీఆర్‌పీఎఫ్ దళాలు కూడా పాల్గొన్నాయి.

పాక్‌ను వణికించిన ఆకాశ్

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి కారణంగా భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల వేళ... పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో దాదాపు 100 మందికిపైగా ఉగ్రవాదులు మరణించారు. అందుకు ప్రతిగా భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాలే లక్ష్యంగా పాక్ క్షిపణులు, డ్రోన్‌లతో దాడులు చేసింది. ఈ దాడులను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఇందుకుగాను భారత్ అంబులపొదిలోని ఆకాశ్ క్షిపణులను ప్రయోగించింది. ఈ తరహా క్షిపణిని ఇప్పటి వరకు చూడలేదని పాకిస్థాన్ సైతం ప్రకటించిందంటే... ఆకాశ్ శక్తి ఏమిటో అర్థమవుతోంది. ఆకాశ్ క్షిపణి హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థలో తయారైంది. ఆకాశ్ క్షిపణి తయారీకి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా శాస్త్రవేత్త డాక్టర్ ప్రహ్లాద రామారావు వ్యవహరించారు.

మే 9, 10 తేదీల్లో... రాత్రి వేళల్లో భారత్ సైన్యం, పౌరులు నివసించే ప్రాంతాలే లక్ష్యంగా పాకిస్థాన్ క్షిపణులతో దాడులు చేసింది. ఈ దాడులను ఆకాశ్ క్షిపణులు తిప్పికొట్టాయి. భారత్‌పై పాక్ ప్రయోగించిన డ్రోనులు, క్షిపణులతోపాటు మైక్రో యూఏవీలను సైతం ఈ క్షిపణి అడ్డుకొంది. వాతావరణం, భూభాగంతోపాటు రాడార్ నుంచి డేటాను సంగ్రహించి అప్పటికప్పుడు స్వయంగా నిర్ణయం తీసుకుని ఈ దాడులను ఈ క్షిపణులు తిప్పికొట్టాయి. దీంతో క్షిపణుల పని తీరు చూసి... పాకిస్థాన్ సైతం ఆశ్చర్యాన్ని ప్రకటించింది. ఆకాశ్ అనేది ఆత్మ నిర్భర భారత్‌ను ప్రదర్శించే పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించారు. చైనా నుంచి పాకిస్థాన్ దిగుమతి చేసుకున్న హెచ్‌క్యూ-9, హెచ్‌క్యూ-16 క్షిపణులను భారత్‌కు చెందిన ఆకాశ్ క్షిపణిలు ధ్వంసం చేశాయి. ఆకాశ్ క్షిపణి వ్యవస్థ పూర్తిగా స్వయం ప్రతిపత్తి గల రక్షణ వ్యవస్థ. శత్రు దేశాల విమానాలు, డ్రోనులు, క్షిపణులను పసిగట్టడంలో ఆకాశ్‌కు సాటి మరొకటి లేదు. రాడార్ వ్యవస్థలు, సెన్సార్లు, కమ్యూనికేషన్ టెక్నాలజీ తదితర అంశాలు ఈ క్షిపణులతో అనుసంధానించాయి. దీంతో రియల్ టైమ్ మల్టీ సెన్సార్డ్ డేటా ప్రాసెసింగ్‌తోపాటు దాడి తీవ్రతను అంచనా వేయగలదు. ఏ దిశ నుంచి దాడులు సంభవించినా... వాటిని ఒకేసారి ఛేదించగలగడం ఆకాశ్ క్షిపణులకు గల ప్రత్యేకత.

ఒమర్ వర్సెస్ మెహబూబా

- తుల్‌బుల్ ప్రాజెక్టు-సింధూ జల సంధిపై మాటల యుద్ధం
- ఐడబ్ల్యూటీతో జమ్మూకశ్మీర్‌కు పీడీపీ చారిత్రక ద్రోహం: సీఎం
- నీటిని ఆయుధంగా మార్చడం అమానవీయం: మాజీ సీఎం

శ్రీనగర్: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలతో సింధూ జల సంధి రద్దు అయింది. దీంతో తుల్ బుల్ ప్రాజెక్టు పునరుద్ధరణ కోసం జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిపాదన ఆయనకు, మాజీ సీఎం మెహబూబా ముఫ్తీకి మధ్య మాటల యుద్ధానికి తెరతీసింది. సొంత ప్రజల ప్రయోజనాలను పక్కకు పెట్టి సరిహద్దు ఆవలి ఉన్నవారి మెప్పు కోసం జరిగిన సింధూ జల సంధితో జమ్మూకశ్మీర్‌కు చారిత్రక ద్రోహం జరిగిందని ఒమర్ అబ్దుల్లా మండిపడ్డారు. జీవానికి ఎంతో అవసరమైన నీటిని ఆయుధంగా మార్చడం అమానవీయమని పీడీపీ అధినేత్రి ఎదురు దాడి చేశారు. ప్రజలు శాంతిని కోరుకుంటున్నారని, భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నాలు మానుకోవాలని ఒమర్‌నుద్దేశించి ఆమె ఎక్స్‌లో పేర్కొన్నారు. ద్వైపాక్షిక అంశాలను అంతర్జాతీయం చేయడం ప్రమాదకరమన్నారు. ఒమర్ కూడా ఎక్స్ మాధ్యమంగానే మెహబుబా ముఫ్తీపై విరుచుకుపడ్డారు. సింధూ జల సంధి (ఐడబ్ల్యూటీ) రద్దుతో ఉత్తర కశ్మీర్‌లోని ఉల్లర్ సరస్సుపై తుల్‌బుల్ నేవిగేషన్ బ్యారేజికి మార్గం సుగమం అవుతుందని, పాకిస్థాన్ ఒత్తిళ్లతో 1980 దశకంలో ఈ ప్రాజెక్టు ఆగిపోయిందని ఒమర్ చెప్పడాన్ని మెహబూబా ముఫ్తీ ఖండించారు. ఆయన మాటలు బాధ్యతారహితమే కాదు ప్రమాదకరం కూడా అని అన్నారు. ముఫ్తీ మాటలను ఒమర్ తిప్పికొట్టారు. చౌకబారు పబ్లిసిటీ చేసుకునే మాజీ సీఎం ప్రయత్నం దురదృష్టకరమన్నారు. సింధూ జల సంధి ద్వారా జమ్మూకశ్మీర్‌కు చారిత్రక ద్రోహం జరిగిందని, దీనిని అంగీకరించేందుకు మెహబూబా ముఫ్తీ నిరాకరిండం చౌకబారు పబ్లిసిటీ యత్నంలో భాగమంటూ విరుచుకుపడ్డారు. సింధూ జల సంధికి తాను మొదటి నుంచే వ్యతిరేకమని వెల్లడించారు. మెహబూబా ముఫ్తీ స్పందిస్తూ 'ఎవరు ఎవరిని మెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారో కాలమే తేలుస్తుంది. మీ తాత షేక్ సాహెబ్ అధికారాన్ని కోల్పోయిన తర్వాత పాకిస్థాన్‌లో విలీనం కావాలని దాదాపు రెండు దశాబ్దాలు పోరాడారు. కానీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించిన వెంటనే ఆయన తీరు మారింది. భారత్‌కు వంతపాడారు. మా పార్టీ ఎప్పుడూ నిజాయతీకి విలువ ఇచ్చింది. నిబద్ధతతో వ్యవహరించింది. మీ పార్టీ అలా కాదు. మీ పార్టీ విధేయులు రాజకీయ ప్రయోజనాల కోసం నాటకీయంగా మాటలు/పక్షాలు మారుస్తారు. మా నిబద్ధతను రుజువు చేసుకునేందుకు ఉద్రిక్తతలను రెచ్చగొట్టడం లేదా యుద్ధోన్మాద వాక్చాతుర్యాన్ని ప్రదర్శించాల్సిన అవసరం మాకు లేదు' అని మెహబూబా ముఫ్తీ అన్నారు. దీంతో ఒమర్ అబ్దుల్లా ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఈ సంభాషణను ఎటు తీసుకెళుతున్నారు... మీరు అనుకున్న స్థాయికి నేను దిగజారబోను' అని అన్నారు. 'కశ్మీర్ గొప్ప నేతగా మీరు గౌరవించిన నాయకుడిపై బురద జల్లడమా మీరు చేయగలిగినది? నేను ఆ స్థాయికి దిగజారను. ఉత్తర-దక్షిణ ధ్రువాలను ఈ సంభాషణలోకి లాగను. (పీడీపీ-బీజేపీ మధ్య గతంలో పొత్తు ఉండటాన్ని ఉద్దేశించి)' అని ఒమర్ వ్యాఖ్యానించారు. 'మీరు మీకు కావాల్సిన వారి ప్రయోజనాల కోసం వాదనలు వినిపిస్తూ ఉండండి. నేను మాత్రం జమ్మూకశ్మీర్ ప్రజల తరపునే మాట్లాడతాను. మన సొంత నదులను మన ప్రయోజనాల కోసం వాడుకోవడాన్ని సమర్థిస్తాను. నీటిని ఆపను కానీ ఎక్కువ శాతాన్ని మనం వాడుకునేలా చూస్తాను. ఇక నేను పని చేసుకుంటా మీరు పోస్టులు కొనసాగించండి' అని మెహబూబా ముఫ్తీపై ఒమర్ అబ్దుల్లా విరుచుకుపడ్డారు.

పాక్‌కు ఆర్థిక సాయం చేయొద్దు

- ఐఎంఎఫ్‌కు రాజ్‌నాథ్ విజ్ఞప్తి
- భుజ్ వైమానిక స్థావరం సందర్శన
- 'ఆపరేషన్ సిందూర్' ట్రైలర్ మాత్రమేనని పాక్‌కు హెచ్చరిక

భుజ్(గుజరాత్): అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) పాకిస్థాన్‌కు ఒక బిలియన్ డాలర్ల సహాయం అందించడాన్ని పునఃపరిశీలించాలని, భవిష్యత్తులో ఎలాంటి సహాయం ఇవ్వకుండా ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. పాక్ ఆ మొత్తాన్ని ఉగ్రవాదాన్ని ప్రేరేపించేందుకు ఉపయోగించుకోవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన భుజ్‌లోని వైమానిక స్థావరాన్ని సందర్శించారు. అక్కడ సైనిక సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ... పాకిస్థాన్ లేదా మరే ఇతర దేశంలోనూ ఐఎంఎఫ్ నిధులను ఉగ్రవాద మౌలిక సదుపాయాలను సృష్టించడానికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఉపయోగించకూడదని భారత్ కోరుకుంటోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాక్‌కు ఎలాంటి ఆర్థిక సహాయం చేసినా అది ఉగ్రవాదానికి ఊత మిచ్చేందుకే వెళతాయని నమ్ముతున్నానన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసమైన ఉగ్రవాద స్థావరాలను పునర్నిర్మించడానికి జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు రూ.14 కోట్ల ఇస్తున్నట్లు పాక్ ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. పాక్‌కు నిధులు మంజూరు చేస్తే పరోక్షంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినట్లే అవుతుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఐఎంఎఫ్ పాక్‌కు నిధులు సమకూర్చడంపై పునరాలోచించాలని, భవిష్యత్తులోనూ ఆ దేశానికి ఎలాంటి సహాయం అందించొద్దని కోరారు. ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌కు భారత్ అర్ధరాత్రి ఉదయపు వెలుగు ఎలా ఉంటుందో చూపించిందని... మన సైనికుల పరాక్రమం చూసి దేశ, విదేశాల్లోని భారతీయులు గర్విస్తున్నారని రాజ్‌నాథ్ అన్నారు. ఉదయం భుజ్ వైమానిక దళ స్టేషన్‌కు చేరుకున్న రాజ్‌నాథ్... ఉగ్రవాదంపై పోరాటానికి సమర్థవంతంగా నాయకత్వం వహించినందుకు భారత వైమానిక దళాన్ని ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత సాయుధ దళాలు శత్రువులపై ఆధిపత్యం చెలాయించడమే కాకుండా వారిని నిర్మూలించడంలో కూడా విజయం సాధించాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 'ఆపరేషన్ సిందూర్'ను ప్రతిపాదించారని తెలిపారు. పాకిస్థాన్ భూభాగంపై జరిపిన క్షిపణి దాడుల శబ్దం సరిహద్దుల వరకే కాదు ప్రపంచమంతా వినిపించిందని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారతీయులంతా గర్వపడేలా చేశారంటూ వైమానిక దళాన్ని ఆయన ప్రశంసించారు. పాకిస్థాన్ పెంచి పోషిస్తున్న ఉగ్రవాదాన్ని దెబ్బతీసేందుకు 23నిమిషాలు చాలని నిరూపించారంటూ కితాబునిచ్చారు. ఇక ఆపరేషన్ సిందూర్ కేవలం ట్రైలర్ మాత్రమే అని... సమయం వచ్చినప్పుడు పూర్తి సినిమా చూపిస్తామంటూ పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక చేశారు. "నిన్ననే నేను శ్రీనగర్‌లో మన ధైర్యవంతులైన సైనిక సిబ్బందిని కలిశాను. ఈరోజు నేను ఇక్కడ వైమానిక యోధులను కలుస్తున్నాను. నిన్న ఉత్తర ప్రాంతంలోని మన జవాన్లను కలిసి, ఈరోజు నేను దేశంలోని పశ్చిమ ప్రాంతంలో వైమానిక యోధులను, ఇతర భద్రతా సిబ్బందిని కలుస్తున్నాను. రెండు వైపులా ఉత్సాహం, శక్తిని చూస్తున్నాను. ఆ ఉత్సాహాన్ని అనుభవిస్తున్నాను. మీరు భారతదేశ సరిహద్దులను భద్రపరుస్తారని నాకు బలమైన నమ్మకం ఉంది" అన్నారు. రెండు దేశాల సైన్యాల మధ్య నాలుగు రోజుల పాటు జరిగిన ఘర్షణలో పాకిస్థాన్ లక్ష్యంగా చేసుకున్న భారత సైనిక మౌలిక సదుపాయాలలో భుజ్ వైమానిక స్థావరం ఒకటి.

భారత్‌లోకి పాక్ డ్రగ్స్

పంజాబ్ పోలీసుల అదుపులో నిందితులు

చండీగఢ్: పాకిస్థాన్ నుంచి భారత్‌లోకి మాదక ద్రవ్యాలు తరలిస్తున్న ముఠాను పంజాబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి భారీగా మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 85 కేజీల డ్రగ్స్‌ను పోలీసులు సీజ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ రూ.వందల కోట్లలో ఉంటుందని అంచనా. అమృత్‌సర్‌కు చెందిన అమర్‌జోత్ సింగ్ జోతా సంధును ఇందులో ప్రధాన నిందితుడిగా గుర్తించి... అరెస్టు చేశామని పోలీసులు చెప్పారు. పాక్ స్మగ్లింగ్ ముఠాను బ్రిటన్ నుంచి లల్లీ అనే వ్యక్తి నడిపిస్తున్నాడని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంలో అమర్‌జోత్ నివాసం డ్రగ్స్ సరఫరాకు ప్రధాన కేంద్రంగా మారిందని పోలీసులు వెల్లడించారు. పాక్ నుంచి వచ్చిన మాదక ద్రవ్యాలను అతడే దేశంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నాడని తెలిపారు. పాక్‌లోని ఐఎస్ఐ ఏజెంట్లతోనూ ఈ ముఠాకు సంబంధాలు ఉన్నాయని అన్నారు. మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి దర్యాప్తు వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు.

బీజేపీ కట్టడికి 'ఇండియా' పటిష్టత అవసరం: చిదంబరం



న్యూఢిల్లీ: బీజేపీని ఢీకొట్టాలంటే ఇండియా ఐక్యసంఘటనను కాపాడుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం సూచించారు. అయితే బీజేపీ పటిష్టమంతంగా వ్యవస్థీకృతమై ఉందని, ఈ నేపథ్యంలో దానిని బలంగా ఢీకొట్టేందుకు ఏర్పాటైన ఇండియా ఐక్యసంఘటన కూడా ఐక్యంగా ఉందా లేదా అనే దానిపై సందేహాలు తలెత్తుతున్నాయని ఆయన అన్నారు. ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో ప్రముఖ న్యాయవాది, మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌కు సీనియర్ ప్రైవేట్ కార్యదర్శి మృత్యుంజయ సింగ్ యాదవ్ రాసిన 'కాంటెస్టింగ్ డెమోక్రటిక్ డెఫిసిట్: యాన్ ఇన్‌సైడ్ స్టోరీ ఆఫ్ ది 2024 ఎలక్షన్స్' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో చిదంబరం మాట్లాడుతూ 'ప్రస్తుతం ఇండియా ఐక్యసంఘటన ఒత్తిళ్లకు గురవుతున్నట్లు కనిపిస్తోంది. అయినప్పటికీ బీజేపీని ఢీకొట్టేది ఇండియా ఐక్యసంఘటనే. ఇప్పటికీ దానిని కాపాడుకోవడానికి సమయం ఉంది. దానిని కాపాడుకోవాలి' అని అన్నారు. కాగా, తన అనుభవంలో కానీ, చరిత్ర చదివినదానినిబట్టి చూస్తే... బీజేపీ అంత బలంగా వ్యవస్థీకృతమైన రాజకీయ పార్టీ మరొకటి లేదు. ఎందుకంటే అది ప్రతి విభాగంలోనూ చొచ్చుకుపోయి బలాన్ని పెంచుకుంది. ఇలా మరొక రాజకీయ పార్టీ చేయలేదు. ఆ పార్టీనే ఒక యంత్రం. ఆ యంత్రం వెనుక మరొక యంత్రం ఉంది. ఈ రెండు యంత్రాలు... భారత ఎన్నికల కమిషన్ నుండి చిన్నస్థాయి పోలీస్‌స్టేషన్ వరకు భారతదేశంలోని అన్ని యంత్రాంగాలను నియంత్రిస్తాయి. బీజేపీ నేతలు ఈ సంస్థలను నియంత్రించగలరు. లేదా వీలుకాకపోతే... కొన్నిసార్లు స్వాధీనం చేసుకోగలరు. అలాంటిది ఎంతో బలమైన రాజకీయ పార్టీతో ఇండియా ఐక్యసంటఘన పోరాడుతోంది' అని ఆయన అన్నారు. 'కాంటెస్టింగ్ డెమోక్రటిక్ డెఫిసిట్ : యాన్ ఇన్‌సైడ్ స్టోరీ ఆఫ్ ది 2024 ఎలక్షన్స్' పుస్తకంలో రచయిత కోణంవైపు నుంచి చూస్తే... కచ్చితంగా 2029 ఎన్నికలు కష్టతరం కానున్నాయని, బీజేపీతో తలపడడం కష్టమేనని అర్థమవుతుంది. 2029 ఎన్నికలు బీజేపీకి మలుపు కావచ్చు. అయితే తిరిగి మరోసారి అధికారంలోకి వస్తే... ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోలేము. 2029 ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని తిరిగి తెచ్చుకోవాలి. ఆ విధంగా కృషి జరగాలి. ఇండియా ఐక్యసంఘటన మరింత బలం పెంచుకోవాలి' అని చిదంబరం వ్యాఖ్యానించారు.

ప్రజాస్వామ్య గళాల అణచివేతకు కుట్ర

గుజరాత్ సమాచార్ యజమాని అరెస్ట్ అన్యాయం: రాహుల్

న్యూఢిల్లీ: గుజరాత్ సమాచార్ వార్తాపత్రిక యజమాని బాహుబలి షా అరెస్టు ప్రజాస్వామ్య స్వరాల అణచివేతకు జరిగిన కుట్ర అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం అభివర్ణించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) షాను గురువారం అరెస్టు చేసింది. తన సోదరుడు శ్రేయాన్స్‌తో కలిసి ఆయన వార్తాపత్రిక నడుపుతున్నారు. 2016 నాటి సెబీ కేసులో ఈ మీడియా దిగ్గజాన్ని ఈడీ అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. 'గుజరాత్ సమాచార్‌ను అణచివేసే ప్రయత్నాలు కేవలం ఒక వార్తాపత్రిక గురించి కాదు. అన్ని ప్రజాస్వామ్య స్వరాలకు వ్యతిరేకంగా కుట్ర' అని రాహుల్ తన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. 'అధికారానికి అద్దం చూపించే వార్తాపత్రికలు మూసివేయబడినప్పుడు ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని అర్థం' అని రాహుల్ అన్నారు. 'బాహుబలి షా అరెస్టు భయం రాజకీయాల్లో ఒక భాగం. ఇది నరేంద్ర మోదీ ప్రభుత్వ గుర్తింపుగా మారింది. దేశాన్ని భయం లేదా కర్రలు నడపవు. నిజం, రాజ్యాంగం నడిపిస్తుంది' అని ఆయన పేర్కొన్నారు. గుజరాత్ కాంగ్రెస్ నాయకుడు జిగ్నేష్ మేవానీ ఈ అరెస్టును 'అత్యంత సిగ్గుచేటు'గా అభివర్ణించారు. 'గుజరాత్‌లోని అతిపెద్ద వార్తాపత్రిక గుజరాత్ సమాచార్ యజమాని, తంత్రి బాహుబలి షాను ఈడీ అరెస్టు చేసింది. ఇది చాలా సిగ్గు చేటు. మేము గుజరాత్ సమాచార్‌కు మద్దతు ఇస్తున్నాం. 25 సంవత్సరాలుగా ఈ వార్తాపత్రిక మోదీ, షా విధానాలను విమర్శించిన విధానానికి ప్రతీకారం తీర్చుకునే ఉద్దేశంతో ఈ చర్య జరిగింది' అని మేవానీ తన సోషల్ మీడియాలో విమర్శించారు. షా సోదరుల కార్యాలయాలు, ఇళ్లలో ఈడీ, ఆదాయపు పన్ను దాడుల తర్వాత ఈ అరెస్టు జరిగింది. ప్రముఖ గుజరాతీ జర్నలిస్ట్, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా సభ్యురాలు షీలా భట్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ 'ఇది ప్రభుత్వం తీసుకున్న తీవ్రమైన చర్య. అరెస్టులకు కారణాలు ఇంకా స్పష్టంగా తెలియలేదు. అరెస్టు తర్వాత బాహుబలి భాయ్‌ను ప్రభుత్వ నిర్వహణలోని వీఎస్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అతని ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. అందువల్ల అతన్ని జైడస్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం శ్రేయాన్స్ భాయ్ జైడస్ ఆసుపత్రిలో బాహుబలి భాయ్‌కు చికిత్స అందిస్తున్నారు' అని వివరించారు. శ్రేయాన్స్‌భాయ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ 'తాము పోరాడుతూనే ఉంటాం' అని తెలిపారు.

భారత్ జలాల్లో చైనా గూఢచార నౌక

న్యూఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల వేళ భారత జలాల్లో చైనాకు చెందిన గూఢచారి నౌక 'ద యంగ్ యి హావో' కదలికలు కనిపించడం చర్చనీయాంశమైంది. ఇది పాక్-చైనా బంధాన్ని తెలిపేలా ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు జాతీయ మీడియాలో వార్తలు వెలువడ్డాయి. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో చైనా నౌక భారత జలాలకు సమీపంలో సంచరిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. మన సముద్ర జలాల్లోని భారత నౌకల కదలికలు, నిఘా, ప్రతిస్పందన సామర్థ్యాన్ని, జలాంతర్గాముల కదలికలను హైడ్రోగ్రాఫిక్ పరికరాల సాయంతో చైనా పసిగట్టే అవకాశం ఉందని ఆ వర్గాలు వెల్లడించాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రంలో ఉత్తరం వైపు మన నౌకాదళం అత్యంత అప్రమత్తమైంది. ఐఎన్ఎస్ విక్రాంత్, బ్రహ్మోస్ క్షిపణులతో కూడిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములను మోహరించారు. ఆ గూఢచారి నౌకకు ఉన్న అధునాతన సెన్సర్లతో ఐఎన్ఎస్ విక్రాంత్ సహా భారత యుద్ధ నౌకల కదలికలను పసిగట్టేందుకు వీలుంది. పాక్‌కు తమ మద్దతు ఉందని సంకేతాలు పంపేందుకు, నిఘా సమాచారాన్ని సేకరించేందుకు ఈ మోహరింపు ఉపయోగించుకొని ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఒకవేళ పాకిస్థాన్‌లోని కరాచీపై భారత్ దాడి చేసేందుకు సన్నాహాలు చేస్తే... వాటిని ముందుగానే పసిగట్టి, ఆ సమాచారాన్ని పాకిస్థాన్‌కు తెలియజేసేలా ఈ మోహరింపు ఉండి ఉండొచ్చని భావిస్తున్నారు. చైనా ప్రతిష్ఠాత్మక బెల్ట్ అండ్ రోడ్ ఇన్షియేటివ్ (బీఆర్ఐ) కింద చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ నిర్మాణం జరుగుతోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ మీదుగా సీపెక్ ప్రాజెక్టు చేపట్టడంపై భారత్ మొదటి నుంచీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఈ ప్రాజెక్టు పనులు పూర్తి కావాలంటే పాక్‌లో రాజకీయంగా, ఆర్థికంగా స్థిరమైన పరిస్థితులు ఉండటం చైనాకు అవసరమని భావిస్తున్నారు. అందులో భాగంగానే చైనా నౌక భారత జలాల్లోకి ప్రవేశించి ఉంటుందని వార్తలు వచ్చాయి.

మళ్లీ కోవిడ్

- ఆసియా దేశాల్లో కొత్త వేరియంట్ వ్యాప్తి
- సింగపూర్, హాంగ్‌కాంగ్‌లో భారీగా కేసులు
- 31 మంది మృతి- పెరిగిన రోగుల సంఖ్య
- చైనా, థాయిలాండ్‌లోనూ వైరస్ విజృంభణ

న్యూఢిల్లీ: ప్రపంచాన్ని గడగడలాడించిన కోవిడ్ మహమ్మారి మళ్లీ పడగ విప్పింది. ఐదేళ్ల తర్వాత ఈ ప్రాణాంతక వైరస్ విజృంభిస్తోంది. ఆసియా దేశాలను నెమ్మదిగా కబళిస్తోంది. ఇప్పటికే సింగపూర్, హాంగ్‌కాంగ్‌ను ఆవహించింది. ఆ దేశాల్లో వైరస్ వ్యాప్తి వేగంగా జరుగుతోంది. కేసులు గణనీయంగా పెరిగాయి. ఆసుపత్రుల్లో చేరే వారి సంఖ్య కూడా పెరిగింది. ఇప్పటికే 31 మంది చనిపోయారు. థాయిలాండ్, చైనా దేశాల్లోనూ కొవిడ్ కేసులు ఎక్కువగానే నమోదవుతున్నాయి. గత వేరియంట్ల కంటే కొత్త వేరియంట్ తీవ్రత ఎక్కువగా ఉంటుందన్న సూచనలు లేవు కానీ కేసులు పెరుగుతుండటంతో ప్రజలు భయపడుతున్నారు. గత ఐదు వారాల్లో కోవిడ్ పాజిటివిటీ రేట్లు రెట్టింపైనట్లు చైనా వ్యాధి నిరోధక కేంద్రం వెల్లడించింది. ఏప్రిల్‌లో జరిగిన వార్షిక సోంగ్‌క్రన్ ఉత్సవం తర్వాత థాయిలాండ్‌లో రెండు క్లస్టర్ అవుట్‌బ్రేక్‌లు నమోదయ్యాయి. హాంగ్‌కాంగ్‌లో కోవిడ్-19 కేసులు భారీగా నమోదయ్యాయని సెంటర్ ఫర్ హెల్త్ ప్రొటెక్షన్ రిపోర్ట్ పరిధి అంటువ్యాధుల శాఖాధికారి ఆల్బర్ట్ వెల్లడించారు. కోవిడ్ పరీక్షల సంఖ్య పెరిగిందని, నమూనాలు చాలా వరకు పాజిటివ్‌గా తేలాయని చెప్పారు. మే3 వరకు 31 కోవిడ్ మరణాలు నమోదైనట్లు తెలిపారు. ఈ ఏడాది ఇదే గరిష్ఠమన్నారు. గత మహమ్మారితో పోల్చితే ప్రస్తుతం తీవ్రత తక్కువగా ఉన్నా... రోగులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తుందన్నారు. సింగపూర్‌లోనూ కోవిడ్ వైరస్ భయపెడుతోంది. మే మొదటి వారంలో 14,200 కేసులు నమోదు కాగా అంచనా వేసిన కేసుల సంఖ్య కంటే 28 శాతం పెరిగింది. ఈ మేరకు సింగపూర్ ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఆసుపత్రుల్లో చేరే వారి సంఖ్యలో 30 శాతం పెంపుదల ఉన్నట్లు తెలిపింది. ప్రజల్లో రోగనిరోధక శక్తి తగ్గుతుండటంతో కేసులు పెరుగుతున్నాయని ఆరోగ్య శాఖాధికారులు అంటున్నారు. యంత్రాంగాలతో పాటు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని... రద్దీ ప్రాంతాలను నివారించాలని, మాస్కులు ధరించాలని, సోషల్ డిస్టెన్సింగ్ పాటించాలని, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు.

భారత్‌లో 93 కేసులు..

కోవిడ్ ప్రస్తుత దశ ప్రభావం భారత్‌లో లేదు కానీ దేశంలో ప్రస్తుతం 93 పాజిటివ్ కేసులు ఉన్నాయి. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధి కోవిడ్-19 డ్యాష్‌బోర్డ్ ద్వారా తెలిసింది. అయితే భారత్‌లో కోవిడ్ కొత్త దశలో కేసులు నమోదు కాలేదని సమాచారం.



మరాఠాల రిజర్వేషన్లపై ప్రత్యేక ధర్మాసనం

ముంబై: మరాఠా రిజర్వేషన్ల చట్టపరమైన చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణకు బాంబే హైకోర్టు ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది. జస్టిస్ రవీంద్ర ఘుగే, జస్టిస్ ఎన్‌జే జమాదార్, జస్టిస్ సందీప్ మార్నెతో కూడిన పూర్తిస్థాయి ధర్మాసనాన్ని ఏర్పాటు చేసినట్లు శుక్రవారం జారీ చేసిన నోటీసుల్లో పేర్కొంది. అయితే ఈ నోటీసులో విచారణ తేదీని వెల్లడించలేదు. మరాఠాలు రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పించాల్సిన వెనకబడిన సమాజం కాదంటూ... ఆ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన కొన్ని పిటిషన్‌లపై హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి డీకే ఉపాధ్యాయ నేతృత్వంలోని పూర్తి ధర్మాసనం గతేడాది విచారణ ప్రారంభించింది. రిజర్వేషన్లపై మహారాష్ట్ర ఇప్పటికే 50 శాతం పరిమితి దాటిందని కూడా పిటిషనర్లు వాదించారు. అయితే ఈ ఏడాది జనవరిలో హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఉపాధ్యాయను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయడంతో విచారణ నిలిచిపోయింది. ఈ పిటిషన్‌లపై ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి అత్యవసరంగా విచారించాలని మే 14న సుప్రీంకోర్టు బాంబే హైకోర్టును ఆదేశించింది. 2025లో జరిగిన నీట్ అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌ల విచారణ సమయంలో సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. మహారాష్ట్ర జనాభాలో సుమారు మూడింట ఒక వంతు ఉన్న మరాఠా కమ్యూనిటీకి విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించే 2024 చట్టం గతేడాది లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాజకీయ చర్చల్లో ప్రధానాంశంగా నిలిచింది.

విశాలాంధ్ర హైదరాబాద్

ప్రయాణీకుల రక్షణే రైల్వే పోలీసుల లక్ష్యం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఇటీవల జరిగిన రైల్వే ఘటనల మేరకు మల్కాజిగిరి రైల్వే పోలీస్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా ప్రయాణికులకు భద్రత, రక్షణపై దయానంద్ నగర్ స్టేషన్‌లో అవగాహన కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ప్రొటెక్షన్ ఫోర్స్ సంజీవరావు, సబ్ ఇన్స్పెక్టర్ దీప్తి, ప్రయాణికుల సంఘం ప్రధాన కార్యదర్శి, జెడ్ఆర్‌యూసిసి మెంబర్ నూర్ పాల్గొన్నారు. రైల్లో ప్రయాణించే మహిళలు బంగారు నగలు వేసుకొని కిటికీల పక్కన కూర్చోవద్దని, పరిచయం లేని వ్యక్తుల నుండి ఎటువంటి తినుబండారాలు తీసుకోవద్దని, దొంగతనం, మహిళలపై వేధింపులు జరిగితే వెంటనే నంబర్ 139 ఫోన్ చేసి పోలీస్‌లకు తెలియ చేయాలనీ కోరారు. రైల్వే టికెట్ లేకుండ ప్లాట్ ఫారం మీదకు రాకూడదని, ఫోన్‌లో మాట్లాడుతూ ప్లాట్ ఫారం అంచుల మీదుగా తిరగరాదని, పోకిరీలు, తాగుబోతులు స్టేషన్ పరిసరాలలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే విడిచిపెట్టే ప్రశక్తే లేదని హెచ్చరించారు. ఇటీవల ఫోన్‌లో మాట్లాడుతూ ట్రాక్ మీద పడడం, వాకింగ్ చేస్తూ సొమ్మసిల్లి పడిపోవడం లాంటి సంఘటనలను గుర్తు చేశారు. దాదాపు 6.5 లక్షల రూపాయల విలువైన ఏసి కోచ్ బాటరీలను దొంగతనం చేసిన వారిని పట్టుకున్న మల్కాజిగిరి ఆర్‌పిఎఫ్ సిబ్బందిని అభినందిస్తూ నూర్, భరద్వాజ్ మెంబర్ డిఆర్‌యూసీసీ సంజీవ్‌రావును శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందచేశారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ శిబిరం

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ మహా నగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) తన మహిళా ఉద్యోగుల కోసం మే 15 నుండి 17, 2025 వరకు అమీర్‌పేట్‌లోని స్వర్ణ జయంతి కాంప్లెక్స్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయంలో మూడు రోజుల రొమ్ము క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ శిబిరాన్ని విజయవంతంగా ప్రారంభించింది. కిమ్స్ హాస్పిటల్ వారితో కలిసి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం, సంస్థలోని మహిళా ఉద్యోగులలో రొమ్ము క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం దానిపై అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. 45 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసువున్న మహిళలకు క్లినికల్ స్క్రీనింగ్‌లను కిమ్స్ హాస్పిటల్స్‌లోని కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ స్నేహ నిర్వహిస్తున్నారు. ఈ స్క్రీనింగ్‌లలో హెచ్‌ఎండీఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పూర్తిగా అమర్చిన పోర్టబుల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఉచిత కార్యక్రమం చేపట్టింది. కిమ్స్ హాస్పిటల్స్ నుండి వచ్చిన వైద్యుల బృందం 45 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న మహిళలకు వ్యక్తిగత సంప్రదింపులు, అవగాహన సెషన్లను నిర్వహిస్తోంది. ఈ వైద్య శిబిరాన్ని హెచ్‌ఎండీఏ కమిషనర్ ప్రారంభించారు. ఉద్యోగుల శ్రేయస్సును పెంపొందించడానికి వారు చూపుతున్న నిబద్ధతను, వారి అంకితభావాన్ని ఆయన ప్రశంసించారు. మొదటి రోజు 80 మందికి పైగా మహిళలు, రెండో రోజు 120 మంది మహిళలు వైద్య సేవలను పొందారు.

భారీగా పలికిన కొబ్బరికాయ వేలం ధర

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి కె.వెంకన్న, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.బి.రవీంద్ర రెడ్డి సమక్షంలో కొబ్బరికాయ, పూజ ద్రవ్యాలు అమ్ముకొనుటకు వేలం పాటను నిర్వహించారు. ఒక సంవత్సర కాలం పరిమితి గల వేలం పాటలో పాల్గొన్న పాటదారులలో అత్యధిక వేలం పాటను యాదమ్మ 3,52,000 (అక్షరాల మూడు లక్షల యాభై రెండు వేలుకు) కొబ్బరికాయలు పూజా సామాగ్రి అమ్ముకొనుటకు వేలం పాటను కైవసం చేసుకున్నారు. 17 మే 2025 నుంచి వచ్చే సంవత్సరం 16 మే 2026 వరకు పాట అమలులో ఉంటుంది. పాట సమయంలో సూచించిన నిబంధనలకు లోబడి అమ్ముకోవాలని ఆలయ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ముడుంబై వెంకట రమణా చార్యులు, తులసి వెంకట రమణా చార్యులు, క్లార్క్ సంద్ర సుధాకర్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సానాది శంకర్, హేమంత్ కుమార్, సురేష్ కుమార్ సింగ్, రవీంద్రారెడ్డి, అనిత, పద్మావతి, భక్తులు పాల్గొన్నారు.

భారత రక్షణ దళాలకు దక్షిణ మధ్య రైల్వే సంఘీభావం

విశాలాంధ్ర - హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే సివిల్ డిఫెన్స్ నేతృత్వంలో శుక్రవారం ఆపరేషన్ సిందూర్ విజయానికి గుర్తుగా సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే (ఎస్.సి.ఆర్) ప్రధాన కార్యాలయం రైల్ నిలయం నుండి సంగీత్ జంక్షన్ వరకు తిరిగి రైల్ నిలయం వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడమైనది. దక్షిణ మధ్య రైల్వే సివిల్ డిఫెన్స్ కంట్రోలర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (జి) ఉదయనాథ్ కోట్ల, భారత్ స్కౌట్స్, గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్ ఎ.కె.రావత్, డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఎస్.ఆర్. షెల్కేతో పాటు ఇతర అధికారులు, రైల్వే సిబ్బంది, దక్షిణ మధ్య రైల్వే స్కౌట్స్, గైడ్స్ నుండి వాలంటీర్లు, ఆర్.పి.ఎఫ్ సిబ్బంది ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ఉగ్రవాదాన్ని అణచి వేయడంలో భారత సాయుధ దళాలు ప్రదర్శించిన వ్యూహాత్మక శక్తి, పరాక్రమానికి సంఘీభావాన్ని తెలియజేయడం ఈ ఫ్లాగ్ మార్చ్ లక్ష్యం. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ, ఈ ఫ్లాగ్ మార్చ్ దేశం పట్ల మన నిబద్ధతను, వీర సైనికులకు మన సంఘీభావాన్ని తెలుపుతుందన్నారు. రక్షణ బలగాల పరాక్రమానికి దక్షిణ మధ్య రైల్వే సెల్యూట్ చేస్తూ ఉగ్రవాదంపై పోరులో వారికి అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లతో మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర-హైదరాబాద్ : ఈ సారి యాసంగిలోనూ రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 60.14 లక్షల ఎకరాల్లో వరి ధాన్యం సాగు చేయగా సుమారు 129.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశాలున్నాయన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయం నుంచి ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై కలెక్టర్లతో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్.చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ప్రభుత్వం 70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు లక్ష్యంగా పెట్టుకుందని, ఇప్పటికే 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. 2023 రబీ సీజన్‌లో మే 15 నాటికి 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే... ఈ రబీ సీజన్‌లో అదే మే 15 నాటికి 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ముందెన్నడూ లేనిరీతిలో ప్రస్తుత యాసంగి ధాన్యం కొనుగోలుకు 8,348 కేంద్రాలను తెరిచినట్లు వివరించారు. 2021-22 రబీ సీజన్‌తో పోలిస్తే ఈ రబీ సీజన్‌లో అధికంగా 1,739 కేంద్రాలు అధికమని అన్నారు. ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని స్పష్టం చేశారు. అందువల్ల జిల్లా అధికారులు కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తున్నామని, రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. రానున్న 10, 12 రోజులు కొనుగోళ్ల ప్రక్రియలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. క్షేత్ర స్థాయిలో లోపాలు గుర్తించి సత్వరమే పరిష్కరించాలని, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. నిజానిజాలు ప్రజలకు బహిర్గతం చేసి రైతులకు భరోసా కల్పించడంలో కలెక్టర్లు చొరవ తీసుకోవాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని బయట అమ్ముకోవద్దని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ధాన్యం విషయంలో రైతులకు ఇబ్బంది కలగకుండా రాష్ట్ర వ్యాప్తంగా సన్న వడ్లు, దొడ్డు వడ్లు కొనుగోలు చేస్తుందని చెప్పారు. అధిక తూకం లేకుండా, ధాన్యం తరలింపు కోసం రవాణా ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు చెల్లింపు ఆలస్యం లేకుండా వెంటవెంటనే డబ్బులు పడేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులకు ఇబ్బంది కలిగితే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈసారి రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, పంట ఎండిపోయిందనేది లేకుండా విద్యుత్ ఇబ్బందులు లేకుండా, నీటిని వాడుకుంటూ పంటలు కాపాడుకున్నామని మంత్రి పొన్నం చెప్పారు.

బోధనా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రస్తుతం ఉన్న టెక్నాలజీ యుగంలో విద్యాబోధన సామర్థ్యాలను పెంపొందించేందుకు వేసవి సెలవులలో కూడా ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయమని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం అన్నారు. శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టరు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ టెక్నాలజీ పరంగా విద్యాబోధన సామర్థ్యాలను పెంపొందించేందుకు విద్యారంగంలో వస్తున్న మార్పులకనుగుణంగా ఉపాధ్యాయులు తమని తాము ఎప్పుడు అప్ డేట్ చేసుకుంటూ విద్యార్థులకు బోధించాలన్నారు. తరగతి గదిలో విద్యార్థులు అందరు ఒకేలా నేర్చుకోలేరు, వారికి ఎలా అవసరమో ఆ విధానాన్ని గ్రహించి విద్యనందించడమే ఉపాధ్యాయుల గొప్పతనమన్నారు. అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఇన్‌స్టాల్ చేసుకొని నేర్చుకోవాలన్నారు. ఈ శిక్షణలో భాగంగా ఎన్ని పద్దతులలో శిక్షణ ఇవ్వగలరో అన్ని పద్దతులు తెలుసుకొని విద్యార్థులకు అవసరమైన విధంగా భోధించాలన్నారు. జిపిటియాప్ వినియోగించుకొని విద్యారంగాన్ని మరింత మెరుగుపరచాలని, అందుకనుగుణంగా ఈ టెక్నాలజీపై పట్టు సాధించాలన్నారు. టెక్నాలజీ ద్వారా వ్యక్తిగత సామర్థ్యాన్ని కూడా అభివృద్ధి చేసుకోవాలన్నారు. టెక్నాలజీ విషయంలో మనకంటే పిల్లలే ముందున్నారన్నారు. ఈ యాప్ ద్వారా ప్యానల్‌ను ఎలా ఉపయోగించాలి, కంటెంట్‌ను స్పష్టంగా ఎలా తెలియజేయాలి అనే అవగాహన పెంచుకోవా లన్నారు. మన పిల్లలకు ఉత్తమ ఫలితాలు ఇవ్వడం మనందరి బాధ్యత అని కలెక్టరు అన్నారు. విద్యార్థుల్లో చదవడం, వ్రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను పెంచడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులు ఈ శిక్షణ తరగతులను వినియోగించుకొని, వీటిపై మీ అనుభవాలు, ఆలోచనలు, సలహాలు, సూచనలు తప్పనిసరిగా ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని కలెక్టరు కోరారు. ఉపాధ్యాయుల అనుభవాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యాశాఖ జాయింట్ డైరెక్టరు మదన్ మోహన్, జిల్లా విద్యాశాఖాధికారి విజయలక్ష్మి, ఉప్పల్ తహసీల్దారు వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన సీపీఐ నిరంతర పోరాటం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ప్రజల పక్షాన నిలిచి సిపిఐ నిరంతర పోరాటం చేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి డిజి సాయిల్ గౌడ్ అన్నారు. శుక్రవారం వినాయక నగర్ సిపిఐ కార్యాలయంలో మండల 4వ మహాసభ రొయ్యల గిరిజ అధ్యక్షతన జరిగింది. మహాసభ ప్రారంభానికి ముందు సిపిఐ సీనియర్ నాయకులు కొంగ ప్రభాకర్ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ మహాసభలో సాయిల్ గౌడ్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ మహాసభల ద్వారా సిపిఐ పార్టీని బలోపేతం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మే 25న ఉప్పల్ మండలంలో ఈసీఐఎల్ పార్టీ కార్యాలయం దగ్గరలో ఫంక్షన్ హాల్లో జిల్లా మహాసభ సుమారు 400 మంది ప్రతినిధులతో జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ ఎమ్మెల్సీ ఎన్ని కంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.ఎస్. బోసు హాజరవుతున్నారని వివరించారు. రాష్ట్ర మహాసభలు ఆగస్టు నెలలో 19, 20, 21, 22, 4 రోజుల పాటు మేడ్చల్-మల్కాజిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ మండల కేంద్రంలో జరగబోతున్నాయని, రాష్ట్ర మహాసభలు సుమారు 1000 మంది ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర లోని అన్ని జిల్లాల నుండి పాల్గొంటారని, జిల్లాలోని పార్టీ శ్రేణులు ఐక్యంగా ఉండి మహాసభలు జయప్రదం చేయాలని సాయిలు గౌడు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ్ పాల్గొని మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు స్థలాలు కోసం పేదల పక్షాన పోరాటం చేయాలని అన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మల నరసింహ, సిపిఐ మండల కార్యదర్శి టి.యాదయ్య గౌడ్, సహాయ కార్యదర్శిలు కాసర్ల నాగరాజు, కే.అశోక్ కుమార్, పి.సత్యనారాయణ, బి.యాదగిరి, జయ రాములు, కే.ప్రభాకర్, జి.రాములు, జే.వెంకటరమణ, ఎస్.కె అజీజ్, జే.వెంకటరమణ, లింగం, ఎండి యూసుఫ్, కలమ్మ, లక్ష్మమ్మ, వి.వెంకటేశం పాల్గొన్నారు.

పోలీస్ కమిషనర్‌కు అరుదైన గౌరవం

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్‌కు అరుదైన గౌరవం దక్కింది. దుబాయ్‌లో నిర్వహిస్తున్న వరల్డ్ పోలీస్ సమ్మిట్ 2025లో హైదరాబాద్ సీపీకి "ఎక్సలెన్స్ ఇన్ యాంటీ-నార్కోటిక్స్ అవార్డు" ప్రదానం చేశారు. దుబాయ్ పోలీసులు మే 13 నుండి మే 16 వరకు నిర్వహించిన వరల్డ్ పోలీస్ సమ్మిట్ 2025లో హైదరాబాద్ డైరెక్టర్ జనరల్, పోలీస్ కమిషనర్ అయిన సి.వి. ఆనంద్‌కు ప్రతిష్ఠాత్మకమైన "ఎక్సలెన్స్ ఇన్ యాంటీ-నార్కోటిక్స్ అవార్డు" లభించింది. హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆనంద్, హైదరాబాద్‌లో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని ఎదుర్కోవడంలో తన విభాగం నిరంతర కృషికి గుర్తింపుగా అత్యున్నత గౌరవాన్ని అందుకున్నారు. ఈ అవార్డు ప్రదానోత్సవం దుబాయ్ పోలీస్ ఆఫీసర్స్ క్లబ్‌లో శుక్రవారం జరిగింది. ఇక్కడ సీపీ.ఆనంద్ వరల్డ్ పోలీస్ సమ్మిట్ కమిటీ నుండి ప్రశంసలను అందుకున్నారు. ఈ అవార్డు హెచ్ న్యూ చురుకైన అమలు వ్యూహాలు, విద్యార్థులు, సాధారణ ప్రజలకు సమగ్ర అవగాహన కార్యక్రమాలు, గత మూడు సంవత్సరాలుగా మాదకద్రవ్యాల నేరాలను అరికట్టడంలో దాని గణనీయమైన ప్రభావాన్ని హైలైట్ చేస్తుంది. సమావేశాన్ని ఉద్దేశించి సీపీ.ఆనంద్ మాట్లాడుతూ 138 దేశాల నుండి పోలీసు అధికారులు ఈ సమ్మిట్‌లో పాల్గొన్నారని, హైదరాబాద్ నగర పోలీసుల విజయం పట్ల అపారమైన గర్వాన్ని వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ప్రపంచ పోటీ మధ్య అవార్డు గెలుచుకోవడం మాదకద్రవ్యాల అమలులో హెచ్‌న్యూ సామర్థ్యం, అంకిత భావం వినూత్న పద్ధతులను ప్రతిబింబిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ గుర్తింపు తెలంగాణ పోలీసులకు గౌరవం మాత్రమే కాదు, మొత్తం భారత పోలీసు దళానికి గర్వకారణమైన క్షణంగా అభివర్ణించారు. 12 దేశాలలోని చట్ట అమలు సంస్థల నుండి పన్నెండు మంది అధికారులు, ఆవిష్కర్తలు సమ్మిట్ సందర్భంగా వివిధ విభాగాలలో అత్యున్నత గౌరవాలతో గుర్తించబడ్డారు. అంతకుముందు, సమ్మిట్‌లో జరిగిన ప్యానెల్ చర్చలో, ఆనంద్ భారతదేశంలో మాదకద్రవ్యాల పెరుగుతున్న సవాళ్లను, ముఖ్యంగా కోవిడ్ తర్వాత ప్రస్తావించారు. మాదకద్రవ్యాల సిండికేట్లు ఉపయోగించే కొత్త మార్గాలు, పద్ధతులు, పెడ్లర్లు, ముఠాలపై విజయవంతమైన చర్యలు, విద్యా సంస్థలలో మాదకద్రవ్యాల వ్యతిరేక కమిటీలు, అవగాహన డ్రైవ్‌లు, తన నాయకత్వంలో చేపడుతున్న పునరావాస ప్రయత్నాల వంటి కార్యక్రమాలను ఆయన వివరించారు.

మే 20న జరుగుతున్న సమ్మెను కొనసాగిస్తూ

జూలై 9 వరకు విస్తృత ప్రచారం ఆందోళనలు, నిరసనలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు మే 15న న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో మే 20న జరుగుతున్న సమ్మెను కొనసాగిస్తూ జూలై 9 వరకు విస్తృత ప్రచారం ఆందోళనలు, నిరసనలు, సమ్మెల విజయవంతానికి సిద్ధం కావాలని, జాతీయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ తెలిపారు. గతంలో కేంద్ర కార్మిక సంఘాల నిర్ణయం ప్రకారం యధావిధిగా మే 20న అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర, ప్రజా, రైతు సంఘాల కార్యకర్తలు, నాయకులు, అన్ని రాష్ట్ర, జిల్లా అనుబంధ సంఘాలవారు మే 20న జరుగు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కార్మిక లోకాన్ని కోరారు. జమ్ము కాశ్మీర్ పహిల్గామ్‌లో ఉగ్రవాదులు, భారత సైనికుల డ్రెస్‌లు వేసుకొని మతం పేరిట మారణహోమం చేసేందుకు 26 మంది అమాయక పర్యాటకులను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపి పైశాచిక ఆనందాన్ని పొందడం, భార్యల ముందే భర్తలను చంపిన ఉగ్రమూకలను తుదముట్టించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు కోట్లాది కార్మికుల కొరకు 29 చట్టాలను రద్దుచేసి 4 కోడులు తెచ్చి కార్మికుల హక్కులను కాలరాయటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తు, ఇప్పటికే 27 సార్లు దేశవ్యాపితంగ సమ్మెలు చేసి 28వ సారి సార్వత్రిక సమ్మెకు సిద్ధమవుతున్న కార్మిక వర్గంపై, ఉగ్రవాదుల దాడులు, ఆకస్మిక చర్యల వలన దేశవ్యాపితంగా జరుగు సమ్మెను మే 20 నుండి జూలై 9 వరకు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వంపై మే 20 నుండి మరింత సమర్థవంతంగా 4 లేబర్ కోడుల రద్దుకై దేశవ్యాపితంగా నిరంతర కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన తెలిపారు. దేశవ్యాపితంగా కార్మికులు, యూనియన్లు సార్వత్రిక సమ్మెకు తమ సన్నాహాలు మే 20 నుండి మరింత పట్టుదలతో కొనసాగిస్తూ కార్మికులలో, రైతులు, ప్రజలలో చైతన్యం తెచ్చి కార్మికులు జూల్కై 9న జరుగు దేశవ్యాపిత సమ్మె వరకు చైతన్యాన్ని నింపి భారీ విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తన కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను కొనసాగిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లతో సంప్రదింపుల సమావేశాలు జరుపకుండ, కార్పొరేటు పెట్టుబడిదారుల మేలు కొరకు, 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడుల అమలుకు యుద్ధం ఒక బూచిగ చూపెట్టి కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను అంతర్గతంగా అమలు చేయచూస్తున్న కేంద్రానికి తగిన బుద్ధి చెప్పేందుకు జూలై 9 నాడు జరుగుతున్న మరో దేశవ్యాపిత సమ్మె విజయవంతానికి కార్మికులు ఐక్యంగా కదిలి రావాలని, విజయవంతం చేయాలని ఎస్.బాల్ రాజ్ కోరారు.

డెంగ్యూ నివారణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జాతీయ డెంగ్యు దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ డివిజన్ లో మేయర్ క్యాంప్ కార్యాలయం వద్ద మండల ప్రైమరీ హెల్త్ సెంటర్లో జిహెచ్‌ఎంసి ఎంటమాలజీ విభాగం, హెల్త్ డిపార్ట్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డెంగ్యు నివారణ అవగాహన ర్యాలీలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ ర్యాలీలో పాల్గొని ప్రజలకు డెంగ్యుపై అవగాహన కల్పించారు. ఇంటి ఇంటికి వెళ్లి డెంగ్యు ముప్పు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇంటి వద్ద నీరు నిల్వ ఉండే ప్రదేశాలను పరిశీలించి, వాటిని తొలగించాలని ప్రజలకు చెప్పారు. అదేవిధంగా ప్రతి ఇంటికీ డెంగ్యు నివారణ స్టికర్లు అంటించి, ప్రజల్లో చైతన్యం నింపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, డెంగ్యు నివారణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలాన్నారు. మన ఇంట్లో, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే దోమలతో వచ్చే అన్ని వ్యాధులను నివారించగలమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి అధికారులు, హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ అడ్వాన్సుడ్ సప్లమెంటరీ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇంటర్మీడియట్ అడ్వాన్సుడ్ సప్లమెంటరీ పరీక్షలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకట చారి అధికారులకు ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారి చాంబర్‌లో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష నిర్వహణకు సంబంధించి నిర్వహించిన సమన్వయ సమావేశంలో అయన పాల్గొని పరీక్షల ఏర్పాట్లను సమీక్షించారు. ఈ నెల 22 నుండి 29 వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు జిల్లాలోని 119 కేంద్రాలలో రెండు సెషన్లలో జరుగుతాయని తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొదటి సంవత్సరం 43,061 మంది విద్యార్థులు రెండవ సంవత్సరం 31,996 మంది విద్యార్థులు మొత్తం 75,057 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారని వీరి కోసం జిల్లాలో 119 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే, జూన్ 3 నుండి జూన్ 6 వరకు రెండు సెషన్లలో (ఉదయం 9 నుండి 12 వరకు మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5) ప్రాక్టికల్ పరీక్షల నిర్వహించడం జరుగుతుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలను వైద్య సామాగ్రి, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అన్ని కేంద్రాలలో ఉంచాలని, టీజీఎస్‌పీడీసీఎల్ నిరంతర విద్యుత్ సరఫర చేయాలని, విద్యార్థుల రాకపోకల కోసం టీజీఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపాలని ఆదేశించారు. ట్రాఫిక్ పోలీసులు ప్రశ్నాపత్రాల డెలివరీ, విద్యార్థుల రాకపోకలకు ట్రాఫిక్ సజావుగా సాగేలా చూడాలని, పోలీసు శాఖ పరీక్ష కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ అమలు చేయాలని మరియు సమీపంలోని జిరాక్స్ దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఆలస్యంగా వచ్చినవారిని పరీక్షా కేంద్రంలోనికి అనుమతించరని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పరీక్షలను ప్రశాంతంగా సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఒడ్డెన్న, అదనపు డిప్యూటీ కమిషనర్లు (ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్) ఎన్. భాస్కర్, రాందాస్ తేజవత్, టీజీఎస్‌పీడీసీఎల్, ఇండియా పోస్ట్, వైద్య మరియు ఆరోగ్య శాఖ, టీజీఆర్టీసీ, మరియు విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు కార్పొరేటర్ పరిశీలన

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ డివిజన్ పరిధిలోని షిరిడీ నగర్ రూ.30 లక్షల వ్యయంతో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ వై.ప్రేం కుమార్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలను పాటించి ఎక్కువ కాలం మన్నేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీ.ఈ.ఈ లౌక్యా, ఏ.ఈ.ఈ శ్రీకాంత్, నాయకులు బాబు, కిషోర్ సత్యనారాయణ, కాలనీ వాసులు రంజిత్ కుమార్, మురళీ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I,SAKHAMURI PADMAVATHI, D/o. Sakhamuri Sri Hariprasad, R/o. A2102, Jayabheri the Summit, Nasingi-500032, Telangana Changed my Name from Chandupatla Padmavathi to SAKHAMURI PADMAVATHI for all purposes.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ధాన్యం కనుగొన్న పురోగతిపై కలెక్టర్లతో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, పౌర సరఫరాల శాఖా ప్రధాన కార్యదర్శి డి.ఎస్.చౌహన్ తదితరులు పాల్గొన్నారు. యాసంగి లోనూ రికార్డ్ స్థాయిలో ధాన్యం దిగుబడి 60.14 లక్షల ఎకరాల్లో వరి ధాన్యం సాగు 129.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా 70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు ప్రభుత్వ లక్ష్యం ఇప్పటికే 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేశామన్నారు. 2023 రబీ సీజన్ లో మే15 నాటికి 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, ఈ రబీ సీజన్‌లో అదే మే 15 నాటికి 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు ముందెన్నడూ లేని రీతిలోపెద్ద సంఖ్యలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. యాసంగి ధాన్యం కొనుగోలకు 8,348 కొనుగోలు కేంద్రాలు 2021-22 రబీ సీజన్‌తో పోలిస్తే ఈ రబీ సీజన్‌లో అధికంగా 1,739 కేంద్రాలు ఏర్పాటు చేసామన్నారు. ధాన్యం దిగుబడి రికార్డు స్థాయిలో పెరగడంతో కొనుగోలు కేంద్రాల పెంపు చేయడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోళ్లు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రైతుల అభీష్టానికి అనుగుణంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పర్యవేక్షించాలని సూచించారు. రానున్న 10,12 రోజులు కొనుగోళ్ల ప్రక్రియలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ, క్షేత్ర స్థాయిలో లోపాలు గుర్తించి సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

వానాకాలం సాగుకు సన్నద్ధం కావాలి : సీఎం

విశాలాంధ్ర - హైదరాబాద్ : వానాకాలం పంటల సాగుకు సన్నద్ధంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. అన్ని జిల్లాల్లో సాగు విస్తీర్ణానికి సరిపడేన్ని విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నకిలీ విత్తనాలు, రైతులను మోసం చేసే కంపెనీలు వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి హెచ్చరించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని సీఎం అధికారులను ఆదేశించారు. కల్తీ, నకిలీ విత్తనాల దందాను అరికట్టేందుకు అన్ని జిల్లాల్లో కలెక్టర్లు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ, పోలీస్ విభాగం సంయుక్తంగా టాస్క్ ఫోర్స్ దాడులు నిర్వహించాలని, రాష్ట్ర సరిహద్దులు అన్ని చోట్ల టాస్క్‌ఫోర్స్ నిఘా ఉంచాలని చెప్పారు. రైతులను మోసం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను సీఎం హెచ్చరించారు. ఎవరెవరు కల్తీ విత్తనాలు విక్రయిస్తున్నారు, ఎక్కడ నిల్వలులున్నాయ.. ఎక్కడ నుంచి రవాణా అవుతున్నాయనే వివరాలన్నీ అధికారులకు సమాచారం ఉందని, ఎవరినీ ఉపేక్షించకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. నకిలీ దందా చేసే వ్యాపారులపై పీడీ యాక్ట్ కేసులు పెట్టాలన్నారు. విత్తనాలు, ఎరువులకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో మాట్లాడాలని సీఎస్ రామకృష్ణారావును సీఎం ఆదేశించారు. సచివాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వానాకాలం పంటల సాగుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపితో పాటు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సీజన్లో వరి, పత్తి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంటుందని, రైతుల నుంచి డిమాండ్ ఉన్న అన్ని కంపెనీల విత్తనాలు మార్కెట్లో ఉన్నాయని చెప్పారు. ఎరువులు, విత్తనాల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రైతులకు భరోసానిచ్చారు. ఈసారి రుతుపవనాలు ముందే వస్తుండటంతో, రాష్ట్రంలోనూ వానలు ముందుగానే కురిసే అవకాశముందని వాతావరణ శాఖ చేసిన సూచనలను రైతులు గమనించాలన్నారు. అందుకు అనుకూలంగా సరైన అదనులో పంటలు వేసుకోవాలని, నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని రైతులను అప్రమత్తం చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని పేదల ప్రయోజనం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్ నివాసి అనారోగ్యం కారణంగా చికిత్స నిమిత్తం శేరిలింగపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ కార్యాలయాన్ని సంప్రదించగా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించి, ఈరోజు వారికి మంజూరు అయిన ఎల్.ఓ.సీ రూ.1,50,000 లెటర్‌ను నియోజకవర్గ నాయకులతో కలిసి బాధితుడికి అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాదితులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిది నిలుస్తుందని వివిధ వ్యాధులతో బాధపడుతున్న పేదలకు వైద్య సహాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. పేదల ప్రయోజనం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు సయ్యన్న,బిసి నాయకులు రాంచందర్ యాదవ్, మల్లేష్, రెహ్మాన్, సుధాకర్, యాదయ్య, కోటేశ్వరరావు, లక్ష్మణ్, రామ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మే20న జరగాల్సిన సార్వత్రిక సమ్మె జూలై 9కి వాయిదా

విశాలాంధ్ర - కాప్రా : మే 20న జరగాల్సిన కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మె జూలై 9 నాటికి వాయిదా పడిందని మేడ్చల్ జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ఎర్ర అశోక్, కార్యదర్శి జె. చంద్రశేఖర్ తెలిపారు. దేశంలోని పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని న్యూఢిల్లీలో గురువారం జరిగిన కేంద్ర కార్మిక సంఘాల నేతల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా సీఐటీయూ కమలానగర్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయకులను బలిగొన్న ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ దాడి అనంతరం దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, మే 20న జరగాల్సిన సమ్మెను జూలై 9కి వాయిదా వేయడం జరిగిందని వారు తెలిపారు. ఉగ్రవాదాన్ని ఖండిస్తూ, జమ్మూ కాశ్మీర్‌తో పాటు దేశవ్యాప్తంగా శ్రామిక ప్రజలు సమిష్టిగా స్పందించాలని, ఉగ్ర వాదానికి వ్యతిరేకంగా శ్రామికుల ఐక్యతను ప్రతిబింబించేలా జూలై 9న సార్వత్రిక సమ్మెను నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. దేశంలో నెలకొన్న సంక్షోభ సమయంలో కూడ కేంద్ర ప్రభుత్వం కార్మిక కోడ్‌ల అమలును బలవంతంగా కొనసాగిస్తున్న తీరు ఆందోళన కలిగించేదిగా ఉందని వారు విమర్శించారు. జూలై 9న జరగబోయే సార్వత్రిక సమ్మెను విజయ వంతం చేయడానికి కార్మికులు, పరిశ్రమల యజమానులు, బాధ్యతాయుత అధికారులంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల్లో సమ్మె ఉద్దేశ్యం, లక్ష్యాలపై చైతన్యం పెంచేందుకు ప్రచార కార్యక్రమాలు కొనసాగించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

సీపీఐ కాప్రా మండల నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - జవహర్ నగర్ : మేడ్చల్ జిల్లా కాప్రా మండల సిపిఐ పార్టీ 2వ మహా సభ సందర్భంగా నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సిపిఐ పార్టీ కాప్రా మండలం కార్యదర్శిగా దర్శనం యాదగిరి, సహాయ కార్యదర్శులుగా జి.లక్ష్మీనారాయణ, మోతే రాజేశ్వరి ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి డీజీ సాయిల్ గౌడ్, సహాయ కార్యదర్శిలు, దామోదర్ రెడ్డి, ఉమా మహేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా మహాసభలు, రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని సిపిఐ శ్రేణులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి జిల్లా కార్యవర్గ సభ్యుడు తోటపల్లి శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ, ఎస్ శంకర్ రావు,రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నర్సింహాలు, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూప, సత్యం, కురుమయ్య, మండల మహిళా అధ్యక్షురాలు జయమ్మ, పి.లక్ష్మణ్, ఏఐటీయూసీ అంబాల ఎల్లయ్య, కౌన్సిల్ కార్యవర్గం 21 సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మాన్సూన్‌కు అందరూ సిద్ధంగా ఉండాలి: కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : వర్షాకాలంలో నగర ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ పేర్కొన్నారు. శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మాన్సూన్‌కు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లపై జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్‌లతో కమీషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ మాన్సూన్ సీజన్‌లో నగర ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమర్థవంతమైన సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో డీ-సిల్టింగ్ పనుల పురోగతి, వాటర్ లాగిన్ పాయింట్లు, వర్షాలతో సంభవించే సంక్షోభ పరిస్థితుల పరిష్కారంపై చర్చించి పలు సూచనలు చేశారు. జోన్ వారిగా సమస్యల పరిష్కారాలపై సమీక్షించారు. నగరంలోని ప్రధాన నాలాలు, స్టామ్ వాటర్ డ్రెయిన్‌లను వేగవంతంగా పూర్తిగా శుభ్రం చేయాలని ఆదేశించారు. వాటర్ లాగిన్ పాయింట్‌లకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ సమన్వయం తో పనిచేయాలని సూచించారు. మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్‌ను అవసరం మేరకు ఏర్పాటు చేయాలన్నారు. మొబైల్ రెస్పాన్స్ టీమ్ వాహనా నికి జీహెచ్ఎంసీ లోగోతో సైనేజి బోర్డు పెట్టాలని, వారి ఫోన్ నెంబర్లను అన్ని పోలీస్‌స్టేషన్‌లో (ఎస్ హెచ్ ఓ) ఇవ్వాలని తెలిపారు. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్ శాఖల మధ్య సమన్వయం ఉండేలా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు. ట్రాఫిక్ జాంలు, ప్రమాదాలు నివారించేందుకు ట్రాఫిక్ మేనేజ్మెంట్ ప్లాన్‌ను ముందస్తుగా సిద్ధం చేయాలని సూచించారు. ట్రాఫిక్ డిసిపి జోయల్, జోనల్ కమీషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, వెంకన్న, రవికిరణ్, అపూర్వ్ చౌహాన్, హేమంత్ సహదేవ్ రావు, సిఈ రత్నకార్, జోనల్ ఎస్ఈలు

మ్యాన్‌హోల్స్‌లో నుంచి బ్లాంకెట్లు.. బెడ్‌షీట్లు..!

విశాలాంధ్ర - హైదరాబాద్ : జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ నం-2 రియాసత్ నగర్ పరిధిలోని మలక్ పేట్, నల్గొండ చౌరస్తాలో సీవరేజ్ ఓవర్ ఫ్లోను అధికారులు అరికట్టారు. జెట్టింగ్ యంత్రాన్ని ఉపయోగించి సిల్ట్‌ను బయటికి తీసి మురుగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చేశారు. ఈ ప్రాంతాల్లో తరుచూ సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫిర్యాదులు నమోదు కావడం తో అధికారులు డీ- సిల్టింగ్ పను చేపట్టారు. అయితే మ్యాన్ హెూళ్లలో నుంచి బ్లాంకెట్లు.. బెడ్ షీట్లు, బట్టలు, ప్లాస్టిక్ వస్తువులు ఇతర ఘన పదార్థాలను గుర్తించారు. ఆ కారణంగా ఆ ప్రాంతంలో సీవరేజ్ ఓవర్ ఫ్లో అవుతున్నట్టు గుర్తించారు. వాస్తవానికి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఇక్కడ డీ-సిల్టింగ్ పనులు నిర్వహించి సిల్ట్ అంతా తొలగించారు. కానీ మళ్లీ అందులో వ్యర్థాలు వేయడం వల్ల అది పేరుకుపోయి మళ్లీ ఓవర్ ఫ్లో అయింది. ప్రజల అవగాహన లేమితో ఇలా చేయడం వల్ల సమస్య మళ్లీ ఉత్పన్నమయింది. జనాల్లో అవగాహన, వారి నుంచి సరైన సహకారం లేకుంటే ఇలాంటి స్పెషల్ డ్రైవ్‌లు ఎన్ని చేపట్టినా సమస్యలు వస్తూనే ఉంటాయి. ఇక నుంచి ఎవరైనా మ్యాన్ హెూళ్లలో చెత్త, వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. జలమండలి చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో సీవరేజ్ పైపు లైన్లు, మ్యాన్ హెూళ్లలో డీ-సిల్టింగ్ పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మ్యాన్ హెూళ్ల నుంచి భారీగా వ్యర్థాలను (సిల్ట్) బయటికి తీశారు. ఎన్నో రోజుల నుంచి ఈ వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో ఇవి మురుగు నీటి ప్రవాహానికి అడ్డుగా మారి మ్యాన్ హెూళ్లు పొంగిపోతున్నాయి. ప్రజలు మ్యాన్ హెూళ్లలో బ్లాంకెట్లు, బెడ్‌షీట్లు, ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు, వాటర్ బాటిళ్లు, ఘన పదార్థాలు లాంటి వ్యర్థాలు వేస్తున్నారు. ఒకానొక దశలో అయితే మ్యాన్ హెూళ్ల నుంచి దిండ్లు, పరుపులు తీసిన ఘటనలూ ఉన్నాయి. ఇవన్నీ వేయడం వల్ల అందులో ప్రవహించే మురుగు నీరుకు ఆటంకం ఏర్పడుతుంది. అది సాఫీగా లేకపోవడంతో మ్యాన్ హెూల్ మూతల నుంచి బయటికి వచ్చి ఓవర్ ఫ్లో అవుతుంది. ప్రజల అవగాహన లేమితో ఇలా చేయడం వల్ల ఓవర్ ఫ్లో సమస్యలు వస్తున్నాయి. అదే పౌరుల నుంచి సరైన భాగస్వామ్యం ఉంటే, ఓవర్ ఫ్లో సమస్యలు తగ్గుతాయి. ఇదే కాకుండా.. హెూటళ్లు, కార్యాలయాలు, బేకరీలు, ఫుడ్ కోర్టులు, వాణిజ్య భవనాల యజమానులు, బహుళ అంతస్తు భవన సముదాయాల నిర్వాహకులు.. తమ సీవరేజ్ పైపు లైన్ ను నేరుగా జలమండలి సీవరేజ్ నెట్ వర్క్‌కు అనుసంధానం చేయడంతో వాటి నుంచి వచ్చే ఆహార, వ్యర్థ పదార్థాలు మ్యాన్ హెూళ్లలో చేరుతున్నాయి. సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకోకపోవడం వల్ల కూడా ఈ సమస్య వస్తుంది. ఫలితంగా సీవరేజ్ పైపు లైన్లపై ఒత్తిడి పెరిగి అవి ఓవర్ ఫ్లో అవుతున్నాయి. తద్వారా వాటిలో నుంచి వచ్చే వ్యర్థాలు మ్యాన్ హెూళ్లలో కలవకుండా ఉంటాయి.

స్ట్రీట్ లైట్ నిర్వహణపై జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : వీధి దీపాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించేందుకు జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి సారించింది. గత నెల ఈఈఎస్ఎల్ ఏజెన్సీ అగ్రిమెంట్ ముగియడంతో మే 1 నుండి వీధి దీపాల నిర్వహణ జీహెచ్ఎంసీ నిర్వహిస్తుంది. అందులో భాగంగా నూతన అడిషనల్ కమిషనర్ నియామకం జరిగింది. జోన్ వారిగా స్ట్రీట్ లైట్లు, తదితర సామాగ్రి కొనుగోలుకు చర్యలు చేపట్టారు. రోజువారీగా సమీక్షలు నిర్వహించడం జరుగుతుంది. లైట్స్ బిగించడానికి 17 ఏజెన్సీలను మరో నెలల కొనసాగించడం జరుగుతుంది. వీధి లైట్ల పై వస్తున్న ఫిర్యాదుల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించి రోజువారీగా సమీక్షలు నిర్వహించడం జరుగుతుంది. ఇప్పటి వరకు 9,000 ఫిర్యాదులు అందగా, 5,800 ఫిర్యాదులను పరిష్కరించడం జరిగింది. ఇప్పటి వరకు 50 శాతానికి పైగా ఫిర్యాదులను పరిష్కరించడం జరిగింది. ఫిర్యాదు వచ్చిన 48 గంటల్లో పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. మిగిలిన 3,200 ఫిర్యాదులను వారంలోగా పరిష్కరించేందుకు లక్ష్యంగా కలదు. ప్రజలందరూ తమ ఏరియాలలో వీధి దీపాల సమస్యలను మైజీహెచ్ఎంసీ యాప్ ద్వారా తెలియజేయాలని సూచించారు.

అధిక రక్తపోటుపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: అధిక రక్తపోటు సమస్యతో బాధపడేవారు తప్పకుండా పలు రకాల జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందనీ యూపీహెచ్ సి ముషీరాబాద్, బోలక్ పూర్ మెడికల్ ఆఫీసర్ డా. ఎం.మనోజ్ రెడ్డి అన్నారు. ముఖ్యంగా ఈ సమస్యతో బాధపడేవారు సులభంగా దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతుంటారనీ, ఈ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే తప్పకుండా ముందుగానే శరీరంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. జీవనశైలిలో మార్పులు చేర్పులు చేసుకోవాలన్నారు. హైపర్‌టెన్షన్ సమస్య మరింత పెరిగి అనేక సమస్యలకు దారీ తీసే అవకాశం ఉందన్నారు. రక్తపోటు సమస్యలతో బాధపడేవారు దీనిని నియంత్రణలో ఉంచుకోవడానికి ప్రతి రోజు కేవలం ఆరోగ్యకరమైన ఆహారాలు తీసుకోవాల్సి ఉంటుందనీ, రోజు తినే ఆహారాల్లో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు తప్పకుండా ఉండేటట్లు చూసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎక్కువ మోతాదులో సోడియం కలిగిన ఆహారాలు తీసుకోవడం వల్ల అనేక రకాల అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయనీ, ముఖ్యంగా శరీర బరువు పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. సోడియం కలిగిన ఆహారాలకు దూరంగా ఉండడం మంచిదదన్నారు. ఈ సమస్యలతో బాధపడే వారు కానీసం 150 నుంచి 200 నిమిషాల పాటు వ్యాయామాలు చేయాల్సి ఉంటుందన్నారు. అధిక రక్తపోటు సమస్యలతో బాధపడేవారు తప్పకుండా శరీర బరువును నియంత్రించుకోవాల్సి ఉంటుందనీ, ఈ సమస్యతో బాధపడేవారు బరువు పెరిగితే అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు.

చెత్తకుప్పలో మగ శిశువు మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - జవహర్‌నగర్ : జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శుక్రవారం అంబేద్కర్ నగర్‌లో అప్పుడే పుట్టిన మగ శిశువుని కమ్యూనిటీ హాల్ వద్ద చెత్త కుప్పలో గుర్తుతెలియని వ్యక్తులు పడేసి వెళ్లిపోయిన ఘటన శుక్రవారం జవహర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు ఈ విషయం తెలుసుకున్న జవహర్ నగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, సంఘటన స్థలాన్ని పరిశీలించి చూడగా అప్పటికే శిశువు మృతి చెందడంతో, శిశువుని గాంధీ ఆసుపత్రికి తరలించామని అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సర్కార్ నిర్లక్ష్యం

విశాలాంధ్ర - ఆమనగల్లు : ఫీజు రియంబర్స్ మెంట్ పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య పూరిత ధరణితో లక్షల మంది పేద విద్యార్థుల భవితవ్యం ప్రమాదంలో పడిందని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు రూ.8,000 వేల కోట్లకు పెరిగిపోయిన ఫీజు రియంబర్స్ మెంట్ తక్షణం చెల్లించాలంటూ ఈ రోజు ఆమనగల్‌లో ప్రెస్‌మీట్‌లో వెల్లడించారు. ఇకపై అన్ని నిర్ణీత కాల పట్టిక ప్రకారం వాయిదాల్లేకుండా చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని కోరారు. రియంబర్స్‌మెంట్ బకాయిలతో సంక్షోభంలో చిక్కుకున్న ప్రైవేటు కాలేజీలు, అధ్యాపకులకు వేతనాలు చెల్లించలేని దుస్థితి నెలకొందన్న లక్ష్మి నివాస్ వేల సంఖ్యలో కాలేజీలు అప్పులతో మూతపడుతున్నాయని గుర్తు చేశారు. కోర్సులు పూర్తిచేసిన పేద విద్యార్థులు సర్టిఫికెట్లు పొందక ఉద్యోగాలకు దరఖాస్తు చేయలేక ఉన్నత విద్య అభ్యాసించలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. కాలేజీ యజమాన్యాలకు విద్యార్థులకు మధ్య జరిగిన గొడవలు పోలీస్‌స్టేషన్‌ల వరకు వెళుతున్న పట్టించుకోరా అని రాష్ట్ర సర్కార్‌ను నిలదించారు. తక్షణం ఫీజు బకాయిలు చెల్లించకపోతే తదుపరి పరిణామాలకు ప్రభుత్వానిదే బాధ్యత అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మీసాల వంశీ, రాష్ట్ర కోఆర్డినేటర్ సుదర్శన్, సోషల్ మీడియా ఇన్చార్జ్ చిక్కి, సందీప్, ఆమనగల్ మండల కమిటీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తే సహించేది లేదు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తే సహించేది లేదని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వంపైన విమర్శలు చేసిన బిఆర్ఎస్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందపై నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొలను హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత ముఖ్యమంత్రి కెసిఆర్ ఫామ్ హౌస్‌లో పడుకుంటున్నట్లు తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పడుకోవడం లేదని ఎద్దేవా చేశారు. రోజులో 18 గంటల పాటు రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని వెల్లడించారు. బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ మెప్పు పొందడానికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఎవరు సహించబోరని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందని కొలన్ హన్మంత్ రెడ్డి హెచ్చరించారు. 10 సంవత్సరాల కాల వ్యవధిలో తెలంగాణ రాష్ట్రాన్ని ఏడున్నర కోట్ల రూపాయల అప్పుల రాష్ట్రంగా చేసిన ఘనత కేసిఆర్‌కు దక్కిన విషయం ఎమ్మెల్యే వివేకానందకి కూడా తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధించి కొందరు కావాలని కోర్టు మెట్లు ఎక్కి అభివృద్ధిని అడ్డుకునే దిశగా కృషి చేస్తున్నారని, ప్రజలందరూ వాటిని గమనిస్తున్నారని త్వరలోనే వారందరికీ కూడా తగిన బుద్ధి చెప్పే రోజు రానున్నదని అన్నారు. ఇప్పటికైనా ఒక ఎమ్మెల్యేగా చదువుకున్న వ్యక్తిగా ఇలాంటి అసత్యపు ప్రచారాలు మానుకొని అభివృద్ధి పైన దృష్టి పెట్టాలని ఆయనకు హితోపలికారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

డెంగ్యూపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా స్థాయి కార్యక్రమం శుక్రవారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరి పాల్గొని మాట్లాడుతూ దోమ కాటు వల్ల వచ్చే వ్యాధుల గురించి, ముఖ్యంగా ఏడీస్ ఈజిప్టై దోమ కాటు వల్ల డెంగ్యూ వ్యాధి సంక్రమిస్తుందని తెలిపారు. డెంగ్యూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దోమల పెరుగుదలను నియంత్రించేందుకు ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు గృహ సందర్శనల సమయంలో దోమల లార్వాలను నిర్మూలించే పద్ధతులు (ఏఎల్ఓ యాక్టివిటీస్)ను జిహెచ్ఎంసి సిబ్బందితో కలిసి అమలు చేయాలని సూచించారు. జిల్లా ఎన్‌సివిబిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ వై. శ్రీదేవి గారు మాట్లాడుతూ, వర్షాకాలంలో దోమ కాటు వల్ల వచ్చే వ్యాధులను, ముఖ్యంగా డెంగ్యూను అరికట్టేందుకు ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు ఫీల్డ్ స్థాయిలో చురుకుగా పనిచేయాలని తెలిపారు. అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్వేత మాట్లాడుతూ డెంగ్యూ జ్వరం లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పల్లె దవాఖాన లేదా బస్తీ దవాఖానలకు వెళ్లి ఉచిత పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన మందులు పొందాలని సూచించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కౌశిక్, మల్కాజిగిరి జిహెచ్ఎంసి సీనియర్ ఎంటమాలజీ అధికారి వెంకటేశ్వర్, డివిజన్ సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, కీసర డివిజన్ సబ్‌యూనిట్ అధికారి కె.వినోద్ కుమార్, జిల్లా కళాజాత బృందం, హెల్త్ సూపర్‌వైజర్లు టి.గొంగడయ్య, అరుణ, జంగయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా

విశాలాంధ్ర-దుండిగల్ : డబుల్ బెడ్రూం ఇండ్ల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్ పల్లి డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల విన్నపం మేరకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులతో సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం బహదూర్ పల్లి డబల్ బెడ్ రూమ్ సొసైటీ సభ్యులు, లబ్ధిదారులు సంబంధిత ప్రభుత్వ అధికారుల ముందు వారి సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపలని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ బహదూర్ పల్లి డబుల్ బెడ్ రూమ్‌లో పేద ప్రజల దగ్గర నుండి పైసలు వసూళ్లు చేస్తున్న సొసైటీ సభ్యులను తీవ్రంగా ఖండించారు. డబుల్ బెడ్ రూమ్‌లో ఉన్న త్రాగునీటి సమస్యలు, డ్రైనేజి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుండి వచ్చిన నోటీసుల వల్ల ఆందోళన చెందొద్దని, ఆ నోటీసులకు రిప్లై లెటర్ రాసి సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. పేద ప్రజలపై మళ్ళీ ఇలాంటివి పునరావృతం చేస్తే సాహించేది లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి, బహదూర్ పల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, సాదు యాదవ్, సంబంధిత ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, బహదూర్ పల్లి సీనియర్ నాయకులు, డబుల్ బెడ్ రూమ్ సొసైటీ సభ్యులు, డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే డెంగ్యూను అరికట్టవచ్చు : రాగం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : డెంగ్యూ ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తెలిపారు. జాతీయ డెంగ్యూ జాతి నివారణ దినోత్సవంలో భాగంగా శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ర్యాలీని శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ హేమంత్ బోర్కడేతో కలిసి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ జెండా ఊపి ప్రారంభించారు. డెంగ్యూ నివారణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఇంట్లో, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. డెంగ్యూపై ప్రతిరోజు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆశా వర్కర్లు ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించడం తప్పనిసరి అన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగ్యూ కిట్లు అందుబాటులో ఉంచామని ఎలిజా పరీక్ష ద్వారా డెంగ్యూని పూర్తిగా నిర్ధారించేందుకు సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏంటమాలజీ ఎస్సీ వెంకటమనికరణ్, ఎఈ తనూజ, సీనియర్ నాయకులు పురం విష్ణువర్ధన్ రెడ్డి, రవి, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, ఏంటమాలజీ స్టాఫ్ పాల్గొన్నారు.

యువతే రాజ్యాంగ రక్షకులు

- బీజేపీ పాలనలో వ్యవస్థల విధ్వంసం
- మహోద్యమ నిర్మాణాలకు తరుణం ఆసన్నం
- ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు నాంది కావాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

విశాలాంధ్ర బ్యూరో/తిరుపతి: రాజ్యాంగంపై ఏ మాత్రం అవగాహనలేని, గౌరవంలేని శక్తులు దేశాన్ని పాలిస్తున్నాయని...రాజ్యాంగ ఉనికికి ప్రమాదం వాటిల్లుతున్న నేటి యువత అప్రమత్తం కావాల్సిన తరుణం ఆసన్నమైందని సీపీఐ జాతీయ కార్యదర్శి, అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)17వ జాతీయ మహాసభల ఆహ్వానసంఘం అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ పేర్కొన్నారు. తిరుపతిలో ప్రారంభమైన ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం కామ్రేడ్ కనం రాజేంద్రన్ హాలు (కచ్చాపి ఆడిటోరియం)లో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. ఆహ్వానసంఘం తరపున నారాయణ అధ్యక్షోపన్యాసం చేస్తూ... ఆర్ఎస్ఎస్ ప్రేరేపిత బీజేపీ పాలనలో రాజ్యాంగ వ్యవస్థలు అవమానాలెదుర్కొంటున్నాయని, గవర్నర్ల అధికారాల విషయంలో ఇటీవల సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలను రాష్ట్రపతి సైతం ఖండించిన తీరు చూస్తుంటే... రాజ్యాంగానికి ముప్పు పతాకస్థాయికి చేరిందని అర్థమవుతోందని... ఈ పరిణామాల పట్ల యువత అప్రమత్తం కావాలని కోరారు.

మహోన్నత ఉద్యమ చరిత్ర కలిగిన ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల ఆహ్వానసంఘానికి చైర్మన్‌గా ఉండటం తనకెంతో గర్వంగా ఉందని నారాయణ అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు, కన్నెగంటి హనుమంతుల వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సామ్రాజ్యవాద వ్యతిరేక, నయా వలసవాద వ్యతిరేకతతో ఏఐవైఎఫ్ 1959 మే 3న పురుడుపోసుకొని, ప్రగతిశీల యువజన సంస్థగా పురోగమిస్తున్నదని చెప్పారు. ప్రపంచ యువ చిహ్నం చేగువేరా నుండి ప్రేరణ పొందిన ఏఐవైఎఫ్ అధ్వర్యంలో యువతరం నేటికీ తమ భుజాలపై సామ్రాజ్యవాద వ్యతిరేక జెండాను మోస్తోందని అన్నారు. ప్రపంచ శాంతి కోసం పనిచేస్తూ, మతోన్మాదం, ఇతర వివక్షలకు వ్యతిరేకంగా నిలబడిందన్నారు. 18 ఏళ్లకు ఓటు హక్కు కోసం యువతను సమీకరించి ఉద్యమించడం ద్వారా విజయం సాధించిన దేశంలోని ప్రముఖ యువజన సంస్థ ఇదేనన్నారు. "జాబ్ లేదా జైలు" అనే నినాదంతో దేశవ్యాప్తంగా మిలిటెంట్ పోరాటాలు నిర్వహించిందని గుర్తుచేశారు. మతతత్వానికి వ్యతిరేకంగా, లౌకికవాదం, ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం పోరాడుతోందని, 'సేవ్ ఇండియా- చేంజ్ ఇండియా' అనే నినాదంతో దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించిందన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లిఖించిన రాజ్యాంగం మనకు ఇచ్చిన విద్య, వైద్య సౌకర్యాలు వంటి ప్రాథమిక హక్కుల రక్షణ, అమలు కోసం అవిశ్రాంతంగా పోరాడుతున్న సంస్థ ఏఐవైఎఫ్ అని, అన్ని స్థాయిలలో అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతూ, అప్రమత్తంగా ఉంటున్నదన్నారు. దళితులు, ఆదివాసీలు, మహిళలు, మైనారిటీలు వంటి అణగారిన వర్గాలను రక్షించడంలో, వారిపై దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఏఐవైఎఫ్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని నారాయణ చెప్పారు. మాదకద్రవ్యాల మాఫియా, అశ్లీల సాహిత్యం, బాల్య వివాహాలు, వరకట్న వ్యవస్థ వంటి అన్ని సామాజిక దురాచారాలను నిర్మూలించడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రాజకీయ పాఠశాలలను క్రమం తప్పకుండా నిర్వహించడం ద్వారా యువతరానికి రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా కూడా అవగాహన కల్పిస్తోందని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే, ఏఐవైఎఫ్ వెంటనే స్పందించి పునరావాస కార్యకలాపాలు నిర్వహిస్తూ, బాధితులకు చేయూతనిస్తున్నదన్నారు.

ఏఐవైఎఫ్ మహాసభలకు తిరుపతి వేదిక కావడం తనకు గర్వకారణమని, తిరుపతి అనేది ఒక ప్రసిద్ధ తీర్థయాత్ర అన్నారు. ప్రతిరోజూ 50 వేల నుంచి లక్ష వరకు ప్రజలు సందర్శిస్తారని తెలిపారు. ఈ చారిత్రాత్మక నగరానికి 11వ శతాబ్దంలో ప్రముఖ హిందూ వేదాంతి రామానుజాచార్యులు పునాది వేశారని, పల్లవులు ఈ నగరాన్ని 6వ శతాబ్దంలో అభివృద్ధి చేశారని, ఈ చారిత్రాత్మక నగరం 17వ శతాబ్దం వరకు శ్రీకృష్ణదేవరాయలు సారథ్యంలోని విజయనగర సామ్రాజ్యంలో భాగంగా ఉండేదని తెలిపారు. చోళులు, పల్లవులు, పాండ్య రాజవంశాలకు చెందిన 1150 సంస్కృత శాసనాలు ఉన్నాయని, ప్రముఖ ప్రాచీన సంగీతకారుడు తాళ్లపాక అన్నమాచార్యులు కూడా ఈ చారిత్రక ప్రదేశం నుండి వచ్చారని గుర్తుచేశారు. ఈ చారిత్రక నగరాన్ని వర్ణిస్తూ ఆయన అనేక తెలుగు సాహిత్యాలను రాసి, ఆలపించారన్నారు. ఇది ఎస్వీ విశ్వవిద్యాలయం, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, సంస్కృత విశ్వవిద్యాలయం, వేద విశ్వవిద్యాలయం, స్విమ్స్ విశ్వవిద్యాలయం, వెటర్నరీ విశ్వవిద్యాలయం, ఐఐటీ మొదలైన విశ్వవిద్యాలయాలతో ప్రసిద్ధి చెందిన విద్యా కేంద్రమన్నారు. స్విమ్స్, బర్డ్, అరబిందో కంటి ఆసుపత్రి, టాటా క్యాన్సర్ ఆసుపత్రి వంటి అనేక ప్రముఖ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో కూడిన వైద్య కేంద్రాలకు తిరుపతి కేంద్రంగా ఉందన్నారు. పండితులు రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ, గౌరిపెద్ది రామసుబ్బశర్మ, ప్రముఖ ఎపిగ్రాఫిస్ట్ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి, ప్రఖ్యాత జర్నలిస్ట్ విద్వాన్ విశ్వం, మార్క్సిస్ట్ సాహిత్య విమర్శకుడు త్రిపురనేని మధుసూదనరావు, ప్రముఖ భాషావేత్త జీఎన్ రెడ్డి, మా తెలుగు తల్లికి మల్లెపూదండ రాసిన శంకరంబాడి సుందరాచారి ప్రభృతులు ఈ తిరుపతి నుంచి వచ్చిన వారేనని స్మరించారు. విప్లవ రచయితలకు, కమ్యూనిస్టు ఉద్యమాలకు పెట్టనికోట అని అన్నారు. విద్యార్థుల ఆందోళనలకు పుట్టినిల్లు అని అన్నారు. ఇలాంటి చరిత్ర కలిగిన తిరుపతిలో జరుగుతున్న ఏఐవైఎఫ్ మహాసభల్లో ప్రతినిధులు చురుగ్గా పాల్గొని, దేశ ప్రజాస్వామ్య పరిరక్షణ దిశగా మంచి నిర్ణయాలు తీసుకోవాలని కె.నారాయణ ఆశాభావం వ్యక్తం చేశారు. మహోద్యమ నిర్మాణాలకు ఇది నాంది కావాలని ఆకాంక్షించారు.

యువ రైతులు పోరాటాలకు సిద్ధం కావాలి

ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య

విశాలాంధ్ర బ్యూరో/తిరుపతి: ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు సరికొత్త ఉద్యమ నిర్ణయాలకు వేదిక కావాలని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల్లో వెంకయ్య సౌహార్ద సందేశమిస్తూ... నేటి యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ జాతీయ మహాసభ తగిన వ్యూహం రూపొందిస్తుందని ఆకాంక్షించారు. వేలాది మంది యువ విప్లవకారులు స్వాతంత్ర్య పోరాటంలో తమ జీవితాన్ని త్యాగం చేశారని, షహీద్ భగత్ సింగ్, అల్లూరి సీతారామ రాజు అందుకు గొప్ప ఉదాహరణ అన్నారు. ఇటీవల 13 నెలలపాటు జరిగిన చారిత్రాత్మక రైతు ఆందోళనలో పెద్ద సంఖ్యలో యువ రైతులు పాల్గొనడం వల్లే ఉధృత రూపం దాల్చి... విజయం సాధించగలిగామని గుర్తు చేశారు. ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని విస్మరిస్తున్నాయని, స్వామినాథన్ కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేయడం లేదన్నారు. రైతులకు మద్దతు ధర లేదని, శ్రమకు తగ్గ ఫలితం లేదని, సాగు విస్తీర్ణం తరిగిపోతోందని, దేశ వ్యాప్తంగా ఏడాదికి 4 లక్షల మంది, రోజుకు సగటున 31 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించని నేపథ్యంలో కుటుంబ వ్యవస్థ కూడా విచ్ఛిన్నకర పరిస్థితులను ఎదుర్కొంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఏఐవైఎఫ్ కార్యకర్తల్లో ఎందరో రైతుల బిడ్డలు ఉన్నారని, వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలు వారికి ఎరుకేనని అన్నారు. అందుకే రైతుల సమస్యలపై సైతం ఏఐవైఎఫ్ పోరాడాలని, ఈ దిశగా యువ రైతులను సమీకరించాలని రావుల వెంకయ్య పిలుపునిచ్చారు.

ఐక్య ఉద్యమాలతో ముందుకు

ఎంపీ, డీవైఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు రహీం

విశాలాంధ్ర బ్యూరో/తిరుపతి: పాలకుల ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశం సంక్షోభంలోకి నెట్టబడుతోందని పార్లమెంట్ సభ్యులు, డీవైఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు రహీం అన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలను ప్రభుత్వం భర్తీ చేయకపోగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారని తెలిపారు. చివరకు అగ్నివీర్ ఉద్యోగాలు కూడా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న యువతకు ఉద్యోగ భద్రత కల్పించినప్పుడే దేశంలో ఆర్థిక అసమానతలు తొలగిపోతాయన్నారు. అభివృద్ధి చెందిన దేశంలో కూడా నేడు ఉద్యోగ ఉపాధి కోసం ఉద్యమించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. భారత్‌లో కూడా ఉద్యోగ భద్రత ఉపాధి కోసం యువత పెద్ద ఎత్తున ఐక్య ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. కేరళ లో లెఫ్ట్ ఫ్రంట్ అధికారంలో ఉండటంతో యువకులకు ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. కేంద్రంలని బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ విధానాలను దేశంపై రుద్దుతున్నదని, దానిని ఎదుర్కోవాలంటే లెఫ్ట్ పార్టీలన్నీ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో యువత చైతన్యం తీసుకురావాలని సూచించారు.

ప్రపంచ నెంబర్‌వన్ అబద్ధాలకోరు మోదీ

ఎన్ఎఫ్ఐడబ్ల్యు ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధూ

విశాలాంధ్ర బ్యూరో/తిరుపతి: అధికారంలోకి రాక ముందు ఏటా 2 లక్షల ఉద్యోగాలిస్తామని నమ్మబలికిన నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక విద్రోహ శక్తిగా మారిపోయారని, ప్రపంచంలోనే నెంబర్‌వన్ అబద్ధాలకోరు మోదీయేనని ఎన్ఎఫ్ఐడబ్ల్యు జాతీయ ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధూ విమర్శించారు. ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల్లో సౌహార్ద సందేశమిస్తూ... అబద్ధాలతో యువతను మోసం చేసిన అతిపెద్ద చరిత్ర మోదీదేనని అన్నారు. గాలికబుర్లతో కాలం వెళ్లదీస్తూ యువతను ఆకర్షించడానికి అవసరమైనప్పుడల్లా జాతీయవాదాన్ని రెచ్చగొడుతున్నారని, దగుల్బాజీ రాజకీయాలకు పాల్పడుతున్న మోదీసర్కార్‌ను గద్దెదింపేందుకు యువత ఐక్య ఉద్యమాలు చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఉగ్రవాదుల దాడుల్లో భర్త ప్రాణాలను కోల్పోయిన ఒక మహిళను సోషల్‌మీడియాలో ట్రోల్స్ చేసి అవమానించారని, మహిళల పట్ల అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, ముఖ్యంగా సోషల్‌మీడియా వేదికగా వేధింపులు పెరిగాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఏఐవైఎఫ్ కార్యకర్తలు ఇటువంటి జాఢ్యాలపై సరైన వ్యూహంతో పోరుబాట పట్టాలని కోరారు. అవసరమైతే, ఎన్ఎఫ్ఐడబ్ల్యు, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్‌లు కలిసి, సమైక్య పోరాటాలు చేయాలని, మహిళావేధింపులపై జాతీయ వేదికలపై చర్చలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ఏఐవైఎఫ్ పోరాట బాధ్యతల్లో మహిళలకూ ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె ఆకాంక్షించారు.

యువతను కార్పొరేట్లకు చౌక కార్మికులుగా అమ్మేస్తున్న మోదీ

ఆర్‌వైఏ అఖిలభారత ఉపాధ్యక్షులు సుందర్ రాజన్

విశాలాంధ్ర బ్యూరో/తిరుపతి: ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశం ఇబ్బందుల్లో ఉన్న ఈ తరుణంలో ఏఐవైఫ్ జాతీయ మహాసభల చర్చలు ప్రజా హితానికి నాంది పలుకుతాయని ఆర్‌వైఏ అఖిలభారత ఉపాధ్యక్షులు సుందర్ రాజన్ అన్నారు. కేంద్రంలోని ఫాసిస్ట్ మోదీ ప్రభుత్వం దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టి, తనకు అనుకూల పెట్టుబడిదారులైన అదానీ, అంబానీల లాభాల కోసం పనిచేస్తోందన్నారు. ఇటీవల పాకిస్థాన్‌తో హడావిడిగా యుద్ధం ప్రారంభమైందని, ట్రంప్ బెదిరింపు తర్వాతే కాల్పుల విరమణ ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. మోదీ ప్రభుత్వం అమెరికాకు తలొగ్గిందని తేటతెల్లం అయిందని వ్యాఖ్యానించారు. వాణిజ్య ఆంక్షలతో రెండు దేశాలను బెదిరించి... యుద్ధాన్ని ఆపమని బలవంతం చేసినట్లు ట్రంప్ బహిరంగంగా పేర్కొన్నారని గుర్తుచేశారు. ఇది దేశ ఆత్మగౌరవంపై ప్రత్యక్ష దాడి కాదా అని ప్రశ్నించారు. యువత దీనిని ఎప్పటికీ సహించబోదన్నారు. దేశవ్యాప్తంగా ముస్లింలు, కశ్మీరీలపై మత విద్వేషాన్ని రెచ్చగొట్టడానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు పహల్గాం ఉగ్రవాద దాడి అనే దారుణమైన చర్యను ఒక సాకుగా ఎలా ఉపయోగించుకున్నాయో మనం చూశామన్నారు.

సార్వభౌమత్వ భారతదేశానికి మీరే రూపశిల్పులు

ఏఐవైఎల్ జాతీయ నేత జగదీశ్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో/తిరుపతి: భారతదేశ యువతను ఏకం చేయడానికి, సమీకరించడానికి, శక్తిమంతం చేయడానికి మనం చేసే ప్రయత్నాలు, లక్ష్యాలు నిబద్ధతతో లోతుగా ప్రతిధ్వనిసాయని ఏఐవైఎల్ జాతీయ నాయకులు బీ జగదీశ్ కుమార్ అన్నారు. నేడు మన దేశ యువత తీవ్ర సంక్షోభంలో ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. నిరుద్యోగం, మతపరమైన అంశాల్లో కఠినమైన పరిస్థితులను ఎదుర్కొం టున్నారన్నారు. యువత దృష్టిని మళ్లించడానికి ప్రతీఘాత శక్తులు మతం, కులం వంటి అంశాలను ఆయుధంగా చేసుకుని వారి తిరోగమన, విభజన అజెండాలకు సేవ చేసేలా వాడుకుంటున్నాయన్నారు. ఉద్యోగాల కొరత, క్షీణిస్తున్న విద్యా ప్రమాణాలు, పర్యావరణ క్షీణత సమస్యలను పరిష్కరించే బదులు మత ఉద్రిక్తతలను రేకెత్తిస్తున్నాయని అన్నారు. యువత వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా, అంకితభావంతో నిర్భయంగా దేశ పరిరక్షణకు కృషి చెయ్యాలన్నారు. నేతాజీ యువతను ఆధునిక, స్వావలంబన, సార్వభౌమ భారతదేశానికి రూపశిల్పులుగా ఊహించారన్నారు.

ప్రైవేటీకరణపై ఐక్య ఉద్యమాలు

ఏఐటీయూసీ నేత బీవీవీ కొండలరావు

విశాలాంధ్ర బ్యూరో/తిరుపతి: కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మోదీ ప్రభుత్వం భారత యువతను కూడా అదే కార్పొరేట్లకు సేవకులుగా మార్చేందుకు కుట్ర పన్నుతోందని ఏఐటీయూసీ జాతీయ కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి బీవీవీ కొండలరావు విమర్శించారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశం ప్రైవేటీకరణ, నిరుద్యోగం, విద్యా వ్యాపారీకరణ దిశగా వెళ్తున్నదని, కార్మికులు, యువజన హక్కులను గాలికి కొదిలేస్తున్నదని స్పష్టం అవుతోందన్నారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆస్తులను అమ్ముతూ, ప్రజాస్వామ్యాన్ని అణిచివేస్తోందని విమర్శించారు. నూతన కార్మిక కోడ్‌లతో కార్మిక హక్కులకు చారిత్రాత్మక ద్రోహం చేస్తోందని దుయ్యబట్టారు. నిరుద్యోగం, ఖరీదైన విద్య, అస్థిర ఉద్యోగాల ముసుగులో యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా యువతను నిర్లక్ష్యం చేస్తూ కార్పొరేట్ సంస్థల మేలు కోసం ప్రైవేటీకరణ సాగుతోందని తెలిపారు. ఎఐటీయూసీ, ఏఐవైఎఫ్ నాయకత్వం, కార్మికులతో చేతులు కలిపి ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

కార్మిక వ్యతిరేక ప్రభుత్వానికి గుణపాఠం

బీకేఎంయూ నేత పెరియార్ స్వామి

విశాలాంధ్ర బ్యూరో/తిరుపతి: కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని బీకేఎంయూ జాతీయ అధ్యక్షులు పెరియార్ స్వామి కోరారు. మోదీ అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను పూర్తిగా రద్దు చేయడానికి కుట్ర చేశారన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులను హరించి వేస్తూ...కార్మికులను కట్టు బానిసలుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్‌లకు ఊడిగం చేయడమే మోదీ ప్రధాన అజెండా అని విమర్శించారు. కుల మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందుతూ అధికారం చెలాయిస్తున్నారన్నారు. విద్యార్థులు, యువకులు బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద, మనువాద సిద్ధాంతాలను నిశితంగా అర్థం చేసుకోవాలని చెప్పారు. ఉపాధి కోసం యువకులు అలుపెరుగని పోరాటం సాగించాలన్నారు. అందుకు తిరుపతిలో జరుగుతున్న అఖిలభారత యువజన సమాఖ్య జాతీయ మహాసభలు నాంది కావాలని ఆకాంక్షించారు.

అట్టహాసంగా ఏఐవైఎఫ్ ప్రతినిధుల మహాసభ

- 24 రాష్ట్రాల నుంచి 700 మంది హాజరు
- ఆకట్టుకున్న విప్లవ గేయాలు, చిన్నారుల నృత్య ప్రదర్శన
- రెడ్ షర్ట్ వాలంటీర్ల సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-బ్యూరో తిరుపతి: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభల్లో భాగంగా శుక్రవారం ప్రతినిధుల మహాసభ అట్టహాసంగా ప్రారంభమయింది. 24 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభల ప్రారంభ రోజు గురువారం సాయంత్రం ఇందిరా మైదానంలో భారీ బహిరంగ సభ విజయవంతంగా జరిగింది. ఈ సభలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ తదితరులు చేసిన ప్రసంగాలు యువతను ఆలోజింపచేశాయి. రెండవ రోజు శుక్రవారం ఉదయం కచ్చపి ఆడిటోరియంలో ప్రతినిధుల మహాసభ ప్రారంభమయింది. ఏఐవైఎఫ్ జెండాను జాతీయ కార్యదర్శి సుక్ జిందర్ సింగ్ మహేసరి ఆవిష్కరించారు. అనంతరం మృత వీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. కణం రాజేంద్రన్ సభా వేదిక నుంచి ప్రారంభమైన ఈ సభకు సుక్ జిందర్ సింగ్ మహేసరి, సయ్యద్ వలీ వుల్లా ఖాదరి, అరుణ్, హారతి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ప్రతినిధుల మహాసభకు ముఖ్య అతిథిగా హాజరయిన సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ ప్రసంగిస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో యువత బాధ్యతను గుర్తు చేశారు. రాజ్యాంగ వ్యవస్థలు న్యాయ వ్యవస్థపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నేడు ఎన్నికలు ధనస్వామ్యంగా మారిపోయాయని, దీని గురించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు యువత కృషి చేయాలన్నారు.

అనంతరం ఆహ్వాన సంఘం అధ్యక్షులు, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ తిరుపతి నగర విశిష్టతను వివరించారు. తిరుపతి ఆధ్యాత్మిక నగరమే కాకుండా విద్యా రంగంలో కూడా ఎంతో పురోభివృద్ధి సాధించిందన్నారు. తిరుపతిలో రచయితలు, కవులతో పాటు త్రిపురనేని మధుసూదన రావు లాంటి విప్లవ రచయితలు కూడా ఎన్నో రచనలు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని తెలిపారు. ప్రతినిధుల సభకు హాజరయిన ఏఐటీయూసీ, ఏఐకేఎస్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, ఏఐఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ, ఆర్‌వైఎఫ్, ఏఐవైఎల్ సంఘాల జాతీయ నాయకులు తమ సందేశాలు వినిపించారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి వామపక్ష ప్రజా సంఘాలతో పాటు లౌకిక వాదులతో కలిసి దేశంలో బలమైన ఉద్యమం నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 24 రాష్ట్రాల నుంచి 700 మంది ప్రతినిధులు హాజరుకాగా, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు తీర్మానాలు ప్రవేశపెట్టారు. సభ ప్రారంభానికి ముందు ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు, చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. చిన్నారులను సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా దగ్గరికి తీసుకొని అభినందించారు. ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల సందర్భంగా ప్రజానాట్యమండలి అధ్వర్యంలో రూపొందించిన బలైపోయిన కాశ్మీరం సీడీని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళితో పాటు ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు ఆవిష్కరించారు. వీరితో పాటు ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చంద్ర నాయక్, పెంచలయ్య, పల్లె నరసింహ, ఆర్.రామకృష్ణ పాల్గొన్నారు. ప్రతినిధులందరికీ ఆహ్వాన సంఘం అధ్వర్యంలో వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సమావేశ హాలు వద్ద ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రతినిధులకు ఉచిత వైద్యంతో పాటు ఉచిత మందులు అందించారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. విశాలాంధ్ర విజ్ఞాన సమితి ప్రచురించిన అనేక పుస్తకాలను ప్రతినిధులు ఆసక్తిగా పరిశీలించి కొనుగోలు చేశారు. రెడ్ షర్ట్ వాలంటీర్లు ప్రతినిధులకు కావాల్సిన సౌకర్యాలను అందించారు. మరో రెండు రోజుల పాటు జరగనున్న ఈ జాతీయ మహాసభలలో దేశంలో యువతీయువకులు ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యతో పాటు కేంద్రం వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించనున్నారు. చివరి రోజు నూతన కమిటీని ఎన్నుకుని భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నారు.

సైనికులకు సెల్యూట్

విజయవాడలో ఘనంగా తిరంగా రన్

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా విజయవాడలో వేలాదిమందితో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకూ ఈ ర్యాలీ సాగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కూటమి పార్టీ నేతలు, పెద్ద సంఖ్యలో నగర వాసులు తిరంగా ర్యాలీలో పాల్గొన్నారు. జాతీయ సమైక్యత, సమగ్రత చాటేలా విద్యార్థులు గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ జాతీయ జెండా చూడగానే దేశభక్తి, ఉద్వేగం ఉప్పొంగుతాయన్నారు. మహిళల సిందూరం తుడిచేస్తే ఏం జరుగుతుందో ఆపరేషన్ సిందూర్ చెప్పిందన్నారు. ఉగ్రవాదులు ఈ దేశం వైపు కన్నెత్తి చూడకుండా జవాబిచ్చామన్నారు. దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడు మోదీ ఉన్నారన్నారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ భారత్ అభివృద్ధిని చూసి ఓర్చుకోలేక పాక్ ఉగ్రవాదాన్ని ఎగదోస్తోందని అన్నారు. దేశభక్తి ఏమిటో సైనికుడు మురళీనాయక్ చూపించారన్నారు. ఇది కొత్త భారతమని పాకిస్థాన్ గ్రహించాలని హెచ్చరించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.